ఈనాడు కర్నూలు

బుధవారం 3 జనవరి 2018 16 పేజీలు

తేది: 2-1-18

సమయం(మధ్యాహ్నం)


గ్రామం కొటేకల్లు

మార్గం: ఎమ్మిగనూరు - ఆదోని ప్రధాన రహదారి (దూరం 30కి.మీ.)

ఏమైంది: ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి 20 మంది ప్రయాణికులతో టాటా ఏస్ ఆటో బయలు దేరింది. పాక్లెయిన్‌తో ఆదోని నుంచి ఎమ్మిగనూరు వస్తున్న లారీ కొండ మలుపులో ఆటోను ఢీకొట్టింది.

- నాలుగు నిండు ప్రాణాలను మింగేసిన లారీ
- 11 మందికి తీవ్ర గాయాలు

పరిణామం: నలుగురు మృత్యువాత పడ్డారు. 11 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. వారందరూ సామాన్య కుటుంబాలవారే. ఒకరేమో కుమారుడి వద్దకు, మరొకరు లారీ పనికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లారు. పెద్ద దిక్కుగా ఉంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్న మరో ఇద్దరు అకస్మాత్తుగా మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



కోటే'గాళ్లు'



ఆటోలోనే ఇరుక్కుపోయిన చోదకుని మృతదేహం

కోటేకల్లు(ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే:

చిన్న కుమారుడి దగ్గరకు వెళ్తూ..

కోటేకల్లు గ్రామానికి చెందిన కర్రెక్క(65) చిన్న కుమారుడు ఆరోగ్య ముంబయిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు దేవదాసు, భర్త నాగన్న గ్రామంలోనే ఉంటున్నారు. చిన్న కుమారుడి వద్దకు వెళ్తానంటే పెద్ద కుమారుడు మంగళవారం తన తల్లిని ఆదోనిలో ముంబయి రైలుకు ఎక్కించడానికి టాటా ఏస్ వాహనంలో బయల్దేరారు. పయనమైన కొన్ని నిమిషాలకే జరిగిన ప్రమాదంలో కర్రెక్క ప్రాణాలు కోల్పోగా కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు.

లారీ పనికి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

మండల పరిధిలోని బనవాసిఫారానికి చెందిన ఖాదర్‌బాషా(60) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ గ్రామంలో హోటల్ కూడా నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈయనకు భార్య హస్మత్‌భాను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితమే పెద్ద కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం లారీ డ్రైవర్‌గా వెళ్లేందుకు ఆదోనికి ఆటోలో బయల్దేరిన కొద్దిసేపటికే ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

పుట్టింటికి వెళ్తూ..

కోటేకల్లు గ్రామానికి చెందిన అంజినమ్మ(60) భర్త బసప్ప చాలా ఏళ్ల క్రితమే మృతి చెందగా కుమారుడు, నలుగురు కుమార్తెలకు ఈమే పెద్ద దిక్కు. ఈ క్రమంలో మంగళవారం అంజినమ్మ తన పుట్టిల్లు అయిన కౌతాళం మండలం ఎరిగేరికి వాహనంలో వెళ్తుండగా మృత్యువాత పడ్డారు. కుమారుడు (మిగతా 2లో)

ఆనందినందనం



ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో వార్షిక ఆరుద్రోత్సవం సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామికి మంగళవారం తెల్లవారుజామున విశేష పూజలు చేశారు. నంది వాహనంపై గ్రామోత్సవం భక్తులకు ఆనందపరవశం కలిగించింది.

11లో



ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం హెలీప్యాడ్‌ను పరిశీలించారు

ఏం పోటీ గురు

- డీఎస్సీ అభ్యర్థులతో జిల్లా కేంద్రంలో సందడి
- టెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే:

రాష్ట్ర విభజనానంతరం మొదటిసారిగా డీఎస్సీ ప్రకటన వెలువడింది. ప్రభుత్వ నిర్ణయం నిరుద్యోగులకు ఆనందాన్ని ఇచ్చినా. ... ప్రైవేట్ సంస్థలు రుసుముల పేరుతో గాబరా పెడుతున్నాయి. ఎలాగైనా డీఎస్సీ కొట్టాలి...వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్న కాంక్షతో జిల్లా కేంద్రం వైపు వస్తున్నారు. రాయలసీమ మూడు జిల్లాల కన్నా కర్నూలులో డీఎస్సీ శిక్షణ పొందితే ఉద్యోగాలు సాధిస్తామన్న నమ్మకంతో ఇక్కడికి వస్తుంటారు. అరకొర వసతుల నడుమ లక్ష్య సాధనే ధ్యేయంగా వస్తోన్న నిరుద్యోగులను ఆసరా చేసుకుంటున్నారు. ధనార్జనే ధ్యేయంగా భావించి ఎంతమంది వచ్చినా శిక్షణ ఇవ్వడానికి సిద్ధమేనని కొట్టాలు, రేకుల షెడ్లు, అద్దె ఇళ్లను తీసుకుంటున్నారు. ముగ్గురు ఉండాల్సిన గదిలో ఏకంగా పది మందికి పైగా నింపి నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు. మొత్తానికి డీఎస్సీ అభ్యర్థులతో జిల్లా కేంద్రం సందడిగా మారింది.

జిల్లాలో డీఎస్సీ, పోలీస్, గ్రూపు-1, 2, 3, బ్యాంకు ఉద్యోగాల శిక్షణ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలు శిక్షణ కేంద్రాలకు నిలయంగా మారాయి. టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)ను, డీఎస్సీ పరీక్షలు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో శిక్షణ సంస్థలకు ఆదాయ వనరుగా మారింది. టెట్‌తో పాటుగానే డీఎస్సీకి కొన్ని సంస్థలు, కేవలం టెట్‌కు మాత్రమే మరికొన్ని సంస్థలు శిక్షణ అందిస్తున్నాయి. ఆ తర్వాతే మరోసారి ప్రత్యేకంగా డీఎస్సీకి శిక్షణ ఇస్తామంటూ బుకాయిస్తున్నాయి. సమయం తక్కువగా ఉంది కాబట్టి అనతికాలంలోనే ఎక్కువ బ్యాచ్‌లు నిర్వహించడానికి తక్కువ వ్యవధిలో సిలబస్‌ను వేగంగా నిర్వహిస్తున్నాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతున్న కేంద్రాలు రాత్రి 8 గంటల వరకు కొనసాగుతున్నాయి. ఆదివారం పరీక్షల పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయి.



పెరిగిన శిక్షణ కేంద్రాలు

సంస్థల నిర్వాహకులు సంపాదించాలన్న ఆశతో టెట్, డీఎస్సీకి వేర్వేరుగా శిక్షణ ఇస్తున్నారు. ముందుగా టెట్ పరీక్ష జరుగుతుండటంతో అన్ని శిక్షణ సంస్థలు వీటికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముందుగా అభ్యర్థికి తక్కువ రుసుము చెబితే మరింత తగ్గిస్తారన్న దురాశతో ప్రణాళిక ప్రకారం రూ.15 వేలు నిర్ణయించామని చెప్పి కొంతవరకు తగ్గించాలని కోరితే రూ.13 వేలు వసూలు చేస్తున్నారు. శిక్షణ, వసతి, మెస్‌లకు ఒక అభ్యర్థికి సుమారు రూ.23 వేలు ఖర్చవుతుంది. అయినా యువత అప్పులు చేసి మరీ ప్రవేశాలు పొందుతున్నారు. జిల్లాలో సిజనల్ శిక్షణ కేంద్రాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇవి ఉద్యోగాల ప్రకటన సమయంలో మాత్రమే వెలుస్తుంటాయి. ఇలాంటివి అద్దె ఇళ్లు, తడికెలతో అప్పటికప్పుడు ఏర్పాటు చేసినవి కాగా, మరి కొన్ని రేకుల షెడ్లలో శిక్షణలు నడుస్తున్నాయి.

అనుమతులపై నోరెత్తని అధికారులు

జిల్లావ్యాప్తంగా చిన్నవి, పెద్దవి శిక్షణ కేంద్రాలు మొత్తంగా 20 పైగానే ఉన్నాయి. వీటిలో సుమారు నాలుగు శిక్షణ కేంద్రాలు మాత్రమే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో నమోదైనట్లు సమాచారం. శిక్షణ సంస్థలు సేవారంగం పరిధిలోకి వస్తాయి. కేంద్రాలుగా గుర్తింపు పొందడానికి రూ.5 వేలు రుసుముతో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలి. ప్రతి రెండేళ్లకోసారి రూ.2,500 చెల్లించి అనుమతులు పునరుద్ధరించుకోవాలి. కేంద్రాల్లో (మిగతా 2లో)

ఈనాడు ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్ - 2017

నేడు జరిగే సెమీ ఫైనల్స్ మ్యాచ్‌ల వివరాలు

కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో...	కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో...
ఉదయం 8.00 గంటలకు:	
ఎస్.వి.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల, నంద్యాల -Vs- ఎ.ఎ.ఎస్. డిగ్రీ కళాశాల, ఆదోని	శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల, కోడుమూరు -Vs- శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల, డోన్
ఉదయం 10.00 గంటలకు:	
ఇ.ఎస్.సి. గవర్నమెంట్ పాలిటెక్నికల్ నంద్యాల -Vs- కె.వి.ఆర్.ఎం. జూ॥ కళాశాల, కోడుమూరు	కె.వి.సుబ్బారెడ్డి కాలేజ్ ఆఫ్ పాలిటెక్నిక్, కర్నూలు -Vs- ఎ.ఎ.ఎస్.జూ॥ కళాశాల, ఆదోని

మధ్యాహ్నం 12 గం॥లకు ఫైనల్స్

సీనియర్స్‌కు మెడికల్ కళాశాల మైదానంలో.. జూనియర్స్‌కు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరుగును.

అర్బన్ మండలం ఏర్పాటు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రెవెన్యూశాఖ కర్నూలు అర్బన్, కర్నూలు గ్రామీణ మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ మేరకు జీవో నంబరు 9ని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి డా.మన్మోహన్ సింగ్ మంగళవారం జారీ చేశారు. కర్నూలు నగరంతోపాటు జొహరాపురం, రోజా, మామిదాలపాడు, కల్లూరు రెవెన్యూ విలేజ్(పార్ట్)లతో కలిపి కర్నూలు అర్బన్ మండలంగా ఏర్పాటుకానుంది. మిగిలిన గ్రామాలన్నింటిని కలిపి కర్నూలు గ్రామీణ మండలంగా పరిగణిస్తారు. కర్నూలు అర్బన్‌కు కొత్త తహసీల్దారును నియమించనున్నారు. ప్రత్యేక భవనంలో అర్బన్ మండలం ఉండబోతుంది.

రూ.2 కోట్ల నిధుల కేటాయింపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నందికొట్కూరు నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.2 కోట్లను రాష్ట్ర ప్రణాళికశాఖ మంజూరు చేసింది. నియోజకవర్గంలో సీసీ రహదారులు, అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించాలంటూ నందికొట్కూరు నియోజకవర్గ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా. ఈమేరకు ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది.

రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు డిపోలో రద్దుచేసిన సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని ఈయూ సంఘం డిపో అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండు చేశారు. ఆర్టీసీ అధికారులు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం డిపో ఎదుట సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులను అధికారులు తమకు ఇష్టం వచ్చినరీతిగా రద్దు చేయడం దారుణమన్నారు. బనగానపల్లె డిపోలో ఛార్ట్ కౌన్సిలింగ్ చేయాలని డిమాండు చేశారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నాగలక్ష్మీరెడ్డి, చాంద్‌బాషా, చంద్ర ఎంఎస్ భగవాన్, యూన్సీరాణి, గ్యారేజీ నాయకులు వెంకోబ, లక్ష్మన్న, దాసు పాల్గొన్నారు.



డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న

ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి 1 విజేతలు

1. డి.శ్రీలత, కావలి; 2. పి.శ్రీవాణి, షాద్‌నగర్; 3. ఎస్.శ్రావణి, నెల్లూరు; 4. డి.లక్ష్మి సరస్వతి, నంద్యాల; 5. బి.పద్మావతి, తిరుపతి; 6. వై.జ్యోతిర్మయి, జగ్గయ్యపేట; 7. పి.సుధారాణి, గూడూరు; 8. ఎ.పద్మ, కావలి; 9. డి.అభినయ, ఒంగోలు; 10. కె.రజని కుమారి, ఒంగోలు. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చును.

హైదరాబాద్- కాకినాడ మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడ), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్- కాకినాడ టౌన్‌ల మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 07001 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 9, 11 తేదీల్లో హైదరాబాద్‌లో రాత్రి 8.50కి బయలుదేరి ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07002 నంబరు రైలు 10, 12 తేదీల్లో కాకినాడ టౌన్‌లో రాత్రి 7.30కి బయలుదేరి ఉదయం 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగుడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఈనెల 31వ వరకు అదనపు బోగీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే సీపీఆర్‌ఓ ఉమాశంకర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ రైలు నంబరు 17417/17418 సాయినగర్ షిర్డీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు ఒక స్లీపర్ బోగీ. ◆ రైలు నంబరు 07417/07418 తిరుపతి-నాగర్‌సోల్ వారాంతపు రైలుకు ఒక స్లీపర్ తరగతి బోగీ.

జూదరులకు కోర్టు జరిమానా

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం ఎస్కేడీ కాలనీలోని ఎన్‌జీవోఎస్ క్లబ్‌లో పేకాట ఆడిన వారికి మంగళవారం ఆదోని కోర్టు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...2013 మే 13 వ తేదీన ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని ఎన్‌జీవోఎస్ క్లబ్‌లో డబ్బులు పెట్టి, జూదం ఆడుతుండగా డీఎస్పీ ఆదేశాల మేరకు మహ్మద్ తాజ్, రవిరెడ్డి, ఈరప్ప, వెంకోబ, చాంద్‌బాషా, కంబగిరి, విజయలను అరెస్టు చేసి, వారి నుంచి రూ.12,010స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితులపై విచారణ సాగింది. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తు ఆదోని జ్యుడిషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తి సాయిరాం తీర్పు నిచ్చారు.

బాబా మందిర నిర్మాణానికి రూ.1,16,001 విరాళం.

డోన్, న్యూస్‌టుడే: డోన్‌లో నిర్మిస్తున్న సాయిబాబా మందిర నిర్మాణానికి కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో వృత్తి ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పీవీఆర్ ప్రసాద్ రూ.1,16001 విరాళాన్ని అందించారు. మంగళవారం కమిటీ సభ్యులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ బాష్యం రమణగౌడ్ మాట్లాడుతూ మందిర నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. భక్తుల సహకారంతో అనుకున్న సమయంలో పూర్తిచేస్తామన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఆలయ నిర్మాణానికి భారీ విరాళం ఇవ్వడంతో పలువురు సహచరులు ఆయనను అభినందించారు. కమిటీ సభ్యులు సన్మానించారు. సభ్యులు పోచా ప్రభాకర్‌రెడ్డి, మరళీకృష్ణగౌడ్, ధర్మారం సుబ్బారెడ్డి, సీ.ఎం.శ్రీనివాసులు, ఆలామల్లికార్జునరెడ్డి, కందుకూరిపార్థ, కొండాసురేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

కోటే 'గొల్లు'

(మొదటిపేజీ తరువాయి) రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ..

పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీకి చెందిన జనార్దన్ రెడ్డి కుమారుడు భీమిరెడ్డి(30) ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని జీవనం పోషిస్తున్నారు. ఈయనకు భార్య సంధ్య, ఏడేళ్ల పాప, ఏడాది వయసు ఉన్న కుమారుడు ఉన్నారు. మంగళవారం తన వాహనంలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మలుపులో లారీ వేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు.



ఆస్పత్రిలో మృతదేహాలు



భీమిరెడ్డి.. ఖాదర్‌బాషా.. అంజినమ్మ.. కర్రెక్క (మృతుల పాతచిత్రాలు)

ఎమ్మెల్యే పరామర్శ


కోటేకల్లు వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను, గాయపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైకాపా నియోజకవర్గ బాధ్యులు జగన్మోహన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో మంగళవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు దహన సంస్కారాలకు గాను తక్షణ సాయం కింద ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున రూ.5 వేలు చొప్పున అందజేశారు. చంద్రన్న బీమా కింద పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఏం పోటీ గురు

(మొదటిపేజీ తరువాయి) తాగు నీరు, స్వచ్ఛమైన గాలి, సరిపడ వెలుతురు, ఒక గదిలో 150 నుంచి 200 మందికి బోర్డు కనిపించేవిధంగా ఏర్పాట్లు, స్త్రీ, పురుషులకు మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలి. కొన్ని శిక్షణ కేంద్రాలు నిబంధనలు పాటించడం లేదు. కొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు లేక పోవడంతో తప్పని పరిస్థితిలో బాలికలు పక్కనున్న కుటుంబాలను ఆశ్రయిస్తున్నారు. బాలురు సమీపంలోని గోడల చాటుకు వెళ్తున్నారు.



పార్కులో చదువుకుంటున్న అభ్యర్థులు

వసతిగృహాల తీరు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన విడుదల చేయడంతో గ్రామీణ ప్రాంతాల యువత జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. అభ్యర్థుల ఆశలను ఆసరాగా చేసుకుని కొంతమంది నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. యువతీ, యువకులకు ప్రత్యేకంగా ఉంటున్న వసతిగృహాలు శిక్షణ కేంద్రాల సమీపంలో అప్పటికప్పుడు మరమ్మతులు చేయించి గదుల సంఖ్యను పెంచుకుంటున్నాయి. గతంలో మెస్, వసతితోపాటుగా ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున ఒక గదిలో ముగ్గురు, నలుగురు ఉండేవారు. ప్రస్తుతం ఒక్కొక్కరు రూ.3 వేలు చెల్లిస్తూనే ఒకే గదిలో పదిమందికి పైగా, మరికొన్నింట్లో స్థాయికి మించి 15 మంది ఉండాల్సి వస్తోంది. ఇలా ఒక్కో గదికి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయం ఆర్జిస్తున్నారు. వసతిగృహాలు స్థాయి పెంచడంతో మరుగుదొడ్లు ఆధ్వానంగా ఉంటున్నాయి. దీంతో మరుగుదొడ్డి, స్నానాలకు రోడ్డు పక్కనున్న సులభ్ సముదాయాలను ఆశ్రయిస్తున్నారు. అద్దె గదులు, వసతిగృహాల్లో కనీసం ప్రశాంతంగా చదువుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ పార్కులు, చెట్లు, తాగునీటి ట్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడున్న వసతిగృహాల్లో సౌకర్యాలు లేకపోవడంతో కొందరు ఇప్పటికే అద్దె గదుల కోసం వెతుకులాట ప్రారంభించారు. రాత్రి సమయంలో నిద్రించడానికి మాత్రమే గదికి వెళ్తున్నారు.

శిక్షణ కేంద్రాల నిర్వహణ ఇలా..

◆ డీఎస్సీ ప్రకటనకు ముందు ఒక బ్యాచ్‌కు 100-150 మందికి శిక్షణ ఇచ్చేవారు. ప్రస్తుతం 500-600 మంది అభ్యర్థులను ఒకే హాలులో కూర్చోబెట్టి శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో ప్రముఖ కేంద్రాలు కూడా రోజుకు 10 పైగా బ్యాచ్‌లు నడిపిస్తున్నాయి.

◆ అభ్యర్థులు జిల్లాకు వస్తుండటంతో అప్పటికప్పుడు రేకుల షెడ్డు వేస్తున్నాయి. మరికొందరు నిరుపయోగంగా ఉన్న పెద్ద భవనాలను ఆరు నెలల పాటుగా అద్దెకు తీసుకుని మరీ శిక్షణ ఇస్తున్నాయి.

◆ డీఎస్సీ పూర్తయితే తమ కేంద్రాల వైపు ఒక్కరు చూడరన్నది వాస్తవం. అందుకే వచ్చినకాడికి దండుకోవడానికి నిర్వాహకులు డాబాలపై షామియానాలు వేస్తున్నారు.

◆ ఓ ప్రైవేట్ నిర్వాహకుడికి పాఠశాలతోపాటుగా శిక్షణ కేంద్రం ఉంది. పాఠశాల పక్కనే శిక్షణను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అభ్యర్థుల డిమాండ్ దృష్ట్యా కొన్ని గదులను పక్కకు మార్పించారని విమర్శలు ఉన్నాయి.

◆ శిక్షణ ప్రారంభంలో జాబితాలోని నిపుణుల ద్వారా కాకుండా మధ్యలో మరో శిక్షకుడి ద్వారా బోధన ఇప్పిస్తున్నారని అభ్యర్థులు చెబుతున్నారు. మొదట్లో ముందుగానే చెప్పిన రుసుములు శిక్షణ పూర్తయ్యేలోపు ఇవ్వాలని సూచిస్తున్న నిర్వాహకులు పదిరోజులు కాకుండా తరగతుల మధ్యలో డబ్బులు కట్టాలంటూ డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

శ్రీశైలం

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు అలూరులో జరిగే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు రాజశేఖర్, డివిజన్ కార్యదర్శి ఏసురత్నంలు కోరారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహనాయక్, వెంకటేశ్వర్లు, మాబాష, మల్లికార్జున, రణధీర్‌లు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు అటవీ రేంజ్ పరిధిలో వన్యప్రాణి దాడిలో మృతి చెందిన పశువుల యజమానులకు మంగళవారం అటవీ శాఖాధికారి దత్తాత్రేయ నష్టపరిహార చెక్కులను పంపిణీ చేశారు. వెలుగోడు జమ్మినగర్‌తండాకు చెందిన బీమానాయక్, సుబ్బానాయక్‌లకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున, గని అనే బాధితునికి రూ.18 వేల చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ నాగన్న, ఎఫ్‌బీఓలు మహానంది, కావేరి, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలకు తీసుకెళ్లి వెనక్కు తెచ్చిన మినుము పంట

కొంటారో... ! కొనరో...!

☛ అమ్ముడుపోవు... అవస్థలు తీరవు...! ☛ అప్పుల ఊబిలో రైతులు..!

మహానంది, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టించి పండించిన పంట దిగుబడులు ఇంటికి చేరాయన్న సంతృప్తి ఒకవైపు. వాటికోసం చేసిన అప్పులు ఎప్పుడు తీర్చుతారంటూ వడ్డీ వ్యాపారులు, బ్యాంకులవారు, అరువు తెచ్చుకున్న ఎరువులు, ఇతర మందుల యజమానులు, ఇల్లు గడిచేందుకు దుకాణాల్లో చేసిన రుణాలు.... భార్యా పిల్లల పోషణల కోసం చేసిన బకాయిలు...ఇలా.... ఎన్నో రకాల సమస్యలతో రైతులు సతమవుతున్నారు. అయితే పండిన పంటను అమ్ముకుందామంటే అమ్మబోతే అడవి ఆయే... కొనబోతే కొరివాయే... యాడేసిన గొంగళి ఆడనే ఉన్నట్లు మారింది రైతు పరిస్థితి.

● మహానంది, బండిఆత్మకూరు, నంద్యాల, గడివేముల, పాణ్యం, శిరువెళ్ల, గోస్పాడు తదితర మండలాల్లో ఖరీఫ్‌లో అధిక శాతం విస్తీర్ణంలో రైతులు మినుము పంటను సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర బారీగా పతనమయ్యింది. ఈ పరిస్థితితో ప్రభుత్వం రూ. 5,400 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా పంటను కొనుగోలు చేస్తోంది. ఇలా కొన్ని సరకును నంద్యాల మార్కెట్ యార్డులో నిల్వ ఉంచుతున్నారు. గతయేడాది ఇదే మినుములు క్వింటాలు రూ. 10 వేల వరకు పలికింది. ఖరీఫ్‌లో పండించిన మినుము పంటను రూ. 6,200లతో విక్రయించుకున్నారు. ధర మరింత పెరుగుతుందన్న ఆశతో రైతులు ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ప్రారంభించడంతో రైతులు తమ ఇళ్లల్లో దాచుకున్న మినుమును విక్రయించుకునేందుకు మార్కెట్‌కు తీసుకెళుతున్నారు. తీసుకురమ్మని చెప్పి తీరా వెళ్లాక యార్డు గేట్లు మూసి వేశారు. ఈ తీరుతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

కేంద్రప్రభుత్వం కొనుగోళ్లు అత్యవసరంగా నిలిపేసింది

– నాగరాజు, నంద్యాల మార్కెట్‌యార్డు మేనేజర్

కేంద్రప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మినుము కొనుగోలు చేయాలని ఆదేశించింది. కొన్నాళ్ల పాటు కొన్నాం. తక్షణమే నిలిపివేయాల్సిందిగా ఆదేశాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా మినుము కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చిస్తోంది. ప్రస్తుతం జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు జరుగుతుండడంతో కొంత ఆలస్యమవుతోంది. సంక్రాంతి తర్వాత మరోసారి ఉత్తర్వులు రావచ్చు. అప్పుడు కొనుగోళ్లు చేసేందుకు ప్రయత్నిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఆదుకుంటుంది.

రైతులను పట్టించుకోలేదు

– పసుపులేటి సుబ్బరాయుడు, సీతారామాపురం



నంద్యాలలో అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయి మాలాంటి రైతులను పట్టించుకోవడం లేదు. బయట గ్రామాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా తీసుకుంటున్నారు. మమ్మల్ని ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారో అర్థం కావడం లేదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. చేసిన అప్పులు తీరడం లేదు. నాతోపాటు నా భార్య బాలసుబ్బమ్మ, నా సోదరుడు శ్రీనివాసులు కలిసి 10 ఎకరాలకుపైగా పంటను పండించాం. 60 క్వింటాళ్లు పండింది. అధికారులు చెబితే గత నెల 17న సరకును నంద్యాల మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లాం. ఎంతో ఆశతో ట్రాక్టర్‌లో సరకు తీసుకెళ్తితే అక్కడ గేట్లు మూసివేశారు. అక్కడే ధాన్యాన్ని ఉంచుకోలేక, కాపలా కాయలేక, గ్రామానికి తీసుకువచ్చాం. ఇప్పుడు ఏం చేయాల్నో అర్థం కావడంలేదు. ఇదే విషయాన్ని జన్మభూమి సభలో అధికారులను అడిగితే నంద్యాల అధికారులకు ఫోన్లు చేసి మాట్లాడారు. కానీ వారు చెప్పిన సమాధానాలు సంతృప్తి కలుగలేదు.

180 క్వింటాళ్లు నిల్వ ఉంది

– గుండ్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీతారామాపురం, మహానంది మండలం



నేను, నా సోదరుడు అనంత విశ్వనాథరెడ్డి కలిసి 22 ఎకరాల్లో 180 క్వింటాళ్ల మినుము పండించాం. ఇందులో సొంత భూమి, కౌలు భూమిని సాగు చేశాం. పంటను కొనుగోలు చేస్తామన్నందుకు అక్కడి వెళితే గేట్లు మూసివేసి ఉన్నాయి. సమాధానం చెప్పేవారు ఎవరూ లేరు. ఎకరా భూమికి కౌలు రూ. 15 వేల నుంచి రూ. 18 వేల వరకు చెల్లించాల్సి వచ్చింది. ఇక పెట్టుబడులు సరేసరి. ప్రభుత్వం తక్షణం స్పందించి మాలాంటి రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేయాలి.

30 క్వింటాళ్లు సిద్ధంగా ఉంచుకున్నాను

– శ్రీనివాసాచారి, సీతారామాపురం



నేను 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాను. ఒక్కో ఎకరా రూ. 15 వేలు కౌలు చెల్లించాలి. ఖరీఫ్‌లో పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాలేదని ఇంట్లోనే ఉంచుకున్నాను. భూమిని కౌలుకు ఇచ్చిన వారికి కౌలు చెల్లించాల్సి ఉంది. రూ. 10 వేల ధర ఉండేది. గత ఏడాది రూ. 6,200 పలికింది. ఇప్పుడు రూ. 5,400 మద్దతు ధరను దొరుకుతుందని ఆశతో వచ్చాం. ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. ఎవరికి చెప్పుకున్నా మాబాధ తీరడం లేదు.



కాలమానినిని ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

పద్మశాలి సంఘం కాలమానిని ఆవిష్కరణ

సున్నిపెంట సర్కిల్ న్యూస్‌టుడే: సున్నిపెంటలోని రెడ్ల కల్యాణ మండపంలో పద్మశాలి సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గంజి రాఘవయ్య, అధ్యక్షుడు నాగశేషయ్య, కమిటీ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగశేషయ్య మాట్లాడుతూ శ్రీశైలంలో పద్మశాలి సంఘాన్ని ఏర్పాటు చేసి 7 నెలలవుతోందన్నారు. సంక్రాంతి పండగకు పద్మశాలి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కోశాధికారి గోవిందరాజు, రామలక్ష్మయ్య, సాంబశివయ్య, నాగార్జున, బాలకృష్ణ, కమిటీ సభ్యులు ఉన్నారు.

కార్మికులపై అధికారుల వేధింపులు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులపై యాజమాన్యం, అధికారుల వేధింపులు అధికమయ్యాయనీ, కారణాలు లేకుండానే కార్మికులను సస్పెండ్ చేస్తున్నారని ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బనగానపల్లి, ఎమ్మిగనూరు డిపోల్లో బస్సు సర్వీసుల రద్దు, కార్మికుల సస్పెన్షన్‌కు నిరసనగా చేపట్టిన రిలేనిరాహార దీక్షలకు మద్దతుగా మంగళవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.ఎల్.నరసింహులు, వెంకటేశ్వర్లు, తిరుపాలు, ముల్లా షపివుల్లాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

విద్యుత్తు సిబ్బందిపై గ్రామస్థుల ఆగ్రహం

మాధవరం(వెలుగోడు), న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఒకరినొకరు సహకరించుకుంటూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని మండల ప్రత్యేకాధికారి లాలాజపతిరావు పేర్కొన్నారు. మంగళవారం మాధవరంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అన్నారపు సీతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. వాటిని అధికారులు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. గ్రామ సభలో కొందరు గ్రామస్థులు విద్యుత్తు శాఖ అధికారులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జన్మభూమిలో విన్నవించిన సమస్యలు నేటికి పరిష్కారం కాలేదని అలాంటప్పుడు జన్మభూమి నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. బస్టాండ్‌లోని బోరింగ్ వద్ద మురికినీరు సమస్య ఉందని నేటికీ పరిష్కారం కాలేదన్నారు. విద్యుత్తు సమస్యను రెండు వారాల్లో పరిష్కరిస్తామని ఏఈ రామేశ్వరయ్య హామీ ఇవ్వడంతో సద్దుమణిగింది. 22 మందికి నూతన రేషన్ కార్డులు, 15 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు, మరో 15 మందికి కొత్త పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, సర్పంచి గీతాంజలి, తహసీల్దారు శ్రీనివాసగౌడు, ఈఓఆర్డీ వెంకటరెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్తు శాఖ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ అన్నారపు సీతమ్మ



అన్నం ఖాళీకావడంతో ఆకలితో దివ్యదర్శనం భక్తులు

అన్నమో... మహానందీశా...! దివ్యదర్శనం భక్తులకు ఆకలికేకలు

మహానంది, న్యూస్‌టుడే: కడప జిల్లా పులివెందల ప్రాంతానికి చెందిన భక్తులు మహానంది పుణ్యక్షేత్రానికి దివ్యదర్శనం భక్తులుగా మంగళవారం దివ్యదర్శనానికి వచ్చారు. వీరికి అన్నం లభించకపోవడంతో చాలామంది ఆకలితో అల్లాడిపోయారు. దేవునికి చేసిన అన్నాభిషేకం అన్నాన్ని కొందరికి వడ్డించారు. ఇంకొంత అన్నాన్ని మహానందిలోని రెండు సత్రాలవారికి ప్రసాదంగా పంపించారు. దీంతో దైవదర్శనానికి వచ్చిన దివ్యదర్శనం భక్తులకు అన్నమో... మహానందీశా...! అనే పరిస్థితి కలిగింది. మహానందిలో మంగళవారం దివ్యదర్శనానికి వచ్చిన భక్తులకు భోజనాన్ని దేవస్థానం వండించాల్సి ఉంది. ఆరుద్రోత్సవ పూజల సందర్భంగా స్వామికి అన్నాభిషేకం చేసి అదే అన్నాన్ని చక్కెర పొంగలి, పులిహోర తయారు చేసి వండి వడ్డించారు. ఇదే ప్రసాదాన్ని ఆ దివ్యదర్శనం భక్తులకు పెట్టాలని భావించినా అది చాలలేదు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. అప్పటికప్పుడు 80 మందికి మళ్లీ అన్నం వండిపెట్టారు.

పల్లె కబుర్లు

బండిఆత్మకూరు,న్యూస్‌టుడే:

పరమటూరు: పరమటూరు, సంతజూటూరు గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నర్సిరెడ్డి తెలిపారు. పరమటూరులో తహసీల్దారు సుధాకరు, సంతజూటూరులో ఎంపీడీఓ సుబ్బమ్మల బృందాలు

సున్నిపెంట సర్కిల్ న్యూస్‌టుడే: సున్నిపెంటలోని లింగాలగట్టులో 4వ తేదీ గురువారం జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహిస్తారు.

వార్డు సరి వరండాలోనే పడక



నేటి చిత్రాలు

నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో రోగుల సంఖ్య ఎక్కువైంది. వార్డులు సరిపోకపోవడంతో చివరికి వైద్యులు చేసేదేమీలేక వరండాల్లోనే పడకలు వేసి చికిత్స అందిస్తున్నారు. ఫలితంగా రాత్రివేళల్లో రోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇకనైనా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

- ఈనాడు, కర్నూలు



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కేఈ

పత్తికొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వాల్లో దేశంలోనే ఏపీ ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి పేర్కొన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పులికొండలో ఐదో విడత జన్మభూమిని మంగళవారం ఆయన ప్రారంభించారు. కేఈ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన తెదేపా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా వందలాది సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తనకు చేతనైనంత సాయం, సహకారం అందించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు గతంలో రూ.200 పించన్ ఇచ్చేవారని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.వెయ్యి నుంచి రూ.1,500కు పెంచారన్నారు. జలయజ్ఞం పనుల్లో భాగంగా జిల్లాలోని పడమటి ప్రాంతాలైన పత్తికొండ, కోడుమూరు, కృష్ణగిరి, మద్దికెర ప్రాంతాలకు హంద్రీనీవా నీటిని మళ్లించి కరవును రూపుమాపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జేసీ ప్రసన్న వెంకటేష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో ఈశ్వర్, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కేఈ శ్యాంబాబు, నాయకులు సాంబశివారెడ్డి, జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచి రంగమ్మ, ఆయా శాఖల అధికారులు శ్రీదేవి, రమణారావు, విజయ, రాజకిషోర్, కబీర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కేఈ, జేసీ

● మండల పరిధిలోని పందికోనలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా తొలిరోజు సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు అనే అంశంపై సాంఘిక సంక్షేమ సహాయ అధికారి జాకీర్ హుస్సేన్ వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో యువత ముందడుగు వేయాలన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు సకాలంలో అందిస్తూ విద్యాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. గ్రామ సర్పంచి నారాయణస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అధికారులు, తెదేపా మండల కన్వీనర్ చెన్నమనాయుడు, నాయకులు రామానాయుడు, తిరుపాలు, రాజునాయక్, ఎమ్పీటీసీ సభ్యురాలు నాగమ్మ, స్థానిక నాయకులు రాముడు, ఆదినారాయణ, జగన్నాథ్, బుల్లేని పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న మహిళలు, వికలాంగునికి రేషన్‌కార్డు అందిస్తున్న కలెక్టర్ సత్యనారాయణ, ఎమ్మెల్యే బుడ్డా

మన ఊరు.. బాగు చేసుకోవడమే జన్మభూమి లక్ష్యం

అమలాపురం (ఆత్మకూరు గ్రామీణ) న్యూస్‌టుడే: మన ఊరు బాగు పడుతుందనేదే జన్మభూమి లక్ష్యమని కలెక్టరు సత్యనారాయణ అన్నారు. మండలంలోని అమలాపురంలో మంగళవారం జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా నోడల్ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిలో 10 కార్యక్రమాలపై చర్చ ఉంటుందని మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరు చదువు, ఉద్యోగం, ఆదాయం సూచికలతోపాటు ఆనందంగా ఉండాలన్నారు. అందుకు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అభివృద్ధి జరగాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం ఆలోచిస్తున్నారని అన్నారు.

మార్చి 1న ఉగాది కానుక

మార్చి ఒకటిన ఉగాది కానుకగా కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టరు చెప్పారు. ఈ నెల 11 వరకు ఇంకా ఎవరైనా అర్హులుంటే సదరం ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో వడ్డీలేని రుణాల కింద రూ. 20.50 కోట్లు, చంద్రన్న బీమా ఉపకార వేతనాలు ఒక్కో విద్యార్థికి రూ. 1,200 చొప్పున, రూ. 14 కోట్లు, స్త్రీనిధి రూ. 7.10 కోట్లు, కుటుంబ వికాసం కార్యక్రమంలో భాగంగా చెంచులు, ఎస్సీ, ఎస్టీల జీవనోపాధుల కల్పనకు రూ. 8.3 కోట్లు, ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో పంటనష్టపరిహారం కింద రూ. 370 కోట్లు ఖర్చవుతుందన్నారు. ప్రజా సాధికార సర్వే ప్రకారం జిల్లాలో 1.56 లక్షల ఇళ్లు కావాలని అర్హులందరికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమమే తెదేపా ధ్యేయమని శ్రీశైల నియోజకర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్ల కల సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ఈ నెల 7న ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, నోడల్ అధికారి సత్యరాజు, ఆర్డీఓ హుసేన్‌సాహెబ్, జడ్పీటీసీ కర్నాటి రాముడు, ఎంపీపీ సౌజన్య, ఎంపీడీఓ శశికళ, తహసీల్దారు రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలోని నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాక మంత్రి భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు.



జన్మభూమి సభలో చిన్నారితో మంత్రి అఖిలప్రియ

పీఎంఎఫ్‌బీవై పథకంలోని లోపాలను సరిదిద్దండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : రైతులకు అత్యుత్తమైన, ప్రయోజనకరమైన ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం (పీఎంఎఫ్‌బీవై) క్షేత్రస్థాయిలో రైతులకు ప్రయోజనకరంగా లేకపోయిందని కర్నూలు ఎంపీ బుట్టా రేణుక అన్నారు. పీఎంఎఫ్‌బీవై పథకంపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమవడంతో ఈ విషయాన్ని ఆమె మంగళవారం లోక్‌సభలో ప్రస్తావించారు. పథకం అమలులో అవాంతరాల కారణంగా దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం రైతులకు ఉపశమనం కలిగించలేకపోతోందని, రైతులకు స్ఫూర్తిదాయకంగా లేదని చెప్పారు. పీఎంఎఫ్‌బీవై పథకం కింద బీమా కంపెనీలకు పంటల ప్రీమియం చెల్లించినప్పటికీ పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పథకంలోని లోపాలను సరిదిద్ది సమర్థంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బుట్టా రేణుక

పరమానందం....
మహానందీశ్వరునికి ఆరుద్రోత్సవం

మహానందిలో స్వయంభువుగా వెలసిన శ్రీమహానందీశ్వరస్వామివార్లకు మంగళవారం ఆరుద్రోత్సవాన్ని నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చిన స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా దేవస్థానం వేదపండితులు రవిశంకరఅవధాని, శాంతారాభట్, నాగేశ్వరశర్మ, అర్చకులు ప్రకాశం శర్మలు వేదోక్తంగా ఇతర రుత్వికులతో విశేష పూజలు చేయించారు. ఈ పూజా కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖులు వారణాసి రామ్మోహన్‌రావు విజయలక్ష్మి దంపతులు, ఆలయ పర్యవేక్షకులు ఈశ్వరరెడ్డి, ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తదితరులు పాల్గొని ఆరుద్రోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేశారు.

- న్యూస్‌టుడే, మహానంది



మహానందిలో ఆరుద్రోత్సవ పూజలు చేస్తున్న పండితులు, దాతలు, అధికారులు

ఉత్కంఠ పోరు.. ప్రతిభకే చోటు

- హోరాహోరీగా తలపడిన క్రీడాకారులు
- తుది దశకు "స్ప్రైట్ ఈసీసీ కప్-2017"



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జే ఆస్పత్రి అధినేత డాక్టర్ జవాద్‌హుస్సేన్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : "స్ప్రైట్ ఈనాడు ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్-2017 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. పలు జట్లు ప్రతిభ చూపి సత్తా చాటాయి. ఈ పోటీలు మంగళవారం ఉత్కంఠభరితంగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మొదటి జట్టు ప్రత్యర్థి ముందు ఓవర్‌కు 9 నెట్ రన్‌రేట్ తగ్గకుండా లక్ష్యం పెట్టింది. దీనిని సాధించేందుకు ఆయా జట్లు శ్రమించాల్సి వచ్చింది. ఈ పోటీలకు నారాయణ విద్యాసంస్థలు ప్రధాన స్పాన్సర్‌గా, కర్నూలు శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. క్రీడాకారులకు అత్యవసర వైద్య సేవలను ఎస్‌జే ఆసుపత్రి అందిస్తోంది. ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగిన పోటీలను ఎస్‌జే ఆసుపత్రి అధినేత డాక్టర్ జవాద్‌హుస్సేన్ ప్రారంభించారు.

ఎస్టీబీసీ కళాశాల మైదానంలో..



ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగిన మొదటి పోటీలో ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల (నంద్యాల), శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నంద్యాల జట్టు ఐదు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. భారీ పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు) జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఎస్వీఆర్ కళాశాల జట్టు విజయాన్ని నమోదు చేసుకుంది.



రెండో పోటీలో శ్రీ వినాయక డిగ్రీ కళాశాల (సి.బెళగల్), శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల (డోన్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సి.బెళగల్ జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. శివ 22 బంతుల్లో ఒక సిక్సర్‌తో 23 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన డోన్ జట్టు కేవలం 7 ఓవర్లలో 51 పరుగులు చేసి గెలుపొందింది.

కేఎంసీ మైదానంలో..



కేఎంసీ మైదానంలో జరిగిన మొదటి పోటీలో కేవీఆర్ఎం జూనియర్ కళాశాల (కోడుమూరు), గీతాంజలి కాలేజీ ఆఫ్ పాలిటెక్నిక్ (కర్నూలు) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 8 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కోడుమూరు జట్టు 8.4 ఓవర్లలో 63 పరుగులు చేసింది. ఆరు వికెట్ల తేడాతో కోడుమూరు కేవీఆర్ఎం జట్టు విజయం సాధించింది.



రెండో పోటీ కేవీ సుబ్బారెడ్డి కాలేజీ ఆఫ్ పాలిటెక్నిక్ (కర్నూలు), ఎస్ఎల్ఎస్ఎస్ అండ్ ఎస్ఎస్ఎస్ జూనియర్ కళాశాల (మద్దికెర) జట్ల మధ్య జరగాల్సి ఉంది. మద్దికెర జట్టు మైదానంలోకి అడుగు పెట్టకపోవడంతో వాక్ ఓవర్ లభించి కేవీ సుబ్బారెడ్డి కాలేజీ ఆఫ్ పాలిటెక్నిక్ జట్టు విజేతగా అంపైర్లు ప్రకటించారు.



మూడో పోటీ ఏపీఎస్ జూనియర్ కళాశాల (ఆదోని), ఉస్మానియా జూనియర్ కళాశాల (కర్నూలు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఏపీఎస్ జూనియర్ కళాశాల జట్టు మూడు వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అబ్దుల్ గఫార్ 30 బంతుల్లో రెండు ఫోర్లతో 30 పరుగులు, రాముడు 25 బంతుల్లో మూడు ఫోర్లతో 23 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 67 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది.

నందివాహనంపై విహరించిన దేవదేవులు

- కనులపండువగా వార్షిక ఆరుద్రోత్సవం



శోభాయమానంగా దర్శనమిచ్చిన ఉత్సవమూర్తులు



స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు,వేదపండితులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీమల్లికార్జునస్వామి విశేష పూజలు జరిగాయి. వార్షిక ఆరుద్రోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి 10 గంటల నుంచి 1 గంట వరకు స్వామివారి మూలవిరాట్‌కు లింగోద్భవకాల మహన్యాస రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరిపి పూజలు జరిపారు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ 3.30 గంటల నుంచి సుప్రభాతసేవ, మహామంగళహారతి ఏకాంతంలో జరిపారు. స్వామివారి ఆలయ ముఖమండపంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. మంగళహారతులు సమర్పించిన అర్చకులు, వేదపండితులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ఉత్తర ద్వారం గుండా వెలుపలికి తీసుకువచ్చారు. నందివాహనంపై ఉత్సవమూర్తులను ఆశీనం గావించి సమంత్రకంగా పూజలు జరిపారు. భక్తజనం ఓంకార నామ స్మరణల నడుమ స్వామిఅమ్మవార్లను గ్రామోత్సవానికి తోడుకువచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి అమ్మవార్లకు నందివాహనంపై శ్రీశైల పురవీధులు, ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వార్షిక ఆరుద్రోత్సవం శ్రీగిరిలో కన్నుల పండువగా జరిగింది.

ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- 7న సీఎం చేతుల మీదుగా సిద్ధాపురం ఎత్తిపోతలు ప్రారంభం
- ఏర్పాటను పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే



డెలివరీ సిస్టమ్‌ను పరిశీలిస్తు న్న కలెక్టర్, ఎస్పీ ఎమ్మెల్యే

ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం కావాలంటే ప్రజలందరు భాగస్వాములు కావాలని అందుకే ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని కలెక్టరు సత్యనారాయణ అన్నారు. ప్రతి రోజు ఒక పథకం ప్రజల ముందుకు తెస్తున్నారని అన్నారు. ఈ నెల 7న సీఎం సిద్ధాపురం చెరువు ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా సీఎం సభ, హెలిప్యాడ్. చెరువు వద్ద ఏర్పాట్లను ఆయన ఎస్పీ గోపినాథ్ జెట్టి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు.

- **ఏర్పాట్ల పరిశీలన:** సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం అనంతరం సీఎం బహిరంగ సభ జరుగుతుంది. ఈనేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటు, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిస్తున్న కారణంగా ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఇతర వాహనాలు ప్రజల వాహనాలు ఎలా పంపాలి అనే వాటిపై చర్చించారు. చెరువు కట్ట వెంట మట్టి రోడ్డును నిర్మిస్తుండటంతో ఎస్పీ అభ్యంతరం తెలిపారు. తారు రోడ్డు వేయాలని సూచించారు. సీఎం వస్తున్నందున తారు రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యే కూడా అభిప్రాయపడ్డారు. స్టేజ్-2 వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాక డెలివరీ సిస్టమ్‌ను సీఎం పరిశీలిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.
- **సిద్ధాపురంలో జన్మభూమి మా ఊరు:** మండలంలోని బైర్లూటి గూడెంలో చెంచుల మధ్య జన్మభూమి మా ఊరు నిర్వహించాలని ఎమ్మెల్యే బుడ్డా పట్టుబట్టినా వాహనాల రద్దీ కారణంగా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని సీఎం సభ వద్దే నిర్వహిద్దామని అధికారులు సూచించారు. అయితే ఏదో ఒక గ్రామలో తప్పనిసరిగా నిర్వహించాలని కోరడంతో సిద్ధాపురంలో నిర్వహించాలా. లేక బైర్లూటిలో నిర్వహించాలా అనేదానిపై చర్చలు జరిపారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సెల్వం, ఆర్డీఓ హుసేన్‌సాహెబ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హాయ్ బుజ్జీ!!



అనగనగా ఓ ఊరుంది... అక్కడంతా బోలెడు వజ్రాలు.... ఎన్నంటే టన్నులకు టన్నులు... ఏ గోడ చూసినా వజ్రాలే... ఏ గుంజ చూసినా అవే... అయితే వాటిని ఎవ్వరూ తియ్యరు... అస్సలు పట్టించుకోరు... ఎందుకో? ఏంటో?

తళుకుల్ బెళుకుల్... ఊరంతా వజ్రాల్!



ఎక్కడైనా వజ్రాలు దొరుకుతాయంటే అంతా వెళ్లి గబగబా ఏరేసుకుందాం అనుకుంటాం. అయితే ఓ చిన్న టౌనుంది. ఎక్కడంటే జర్మనీలో. చూస్తే మామూలు టౌనుల్లానే ఉంటుంది ఇదీనూ. ఇక్కడ బోలెడన్ని వజ్రాలుంటాయి. ఎన్నంటే ఏకంగా 72,000 టన్నుల వరకూనట. అయినా చిత్రంగా వాటిని ఎవ్వరూ పట్టించుకోరు.

■ ఈ ఊరి పేరు నోర్డ్‌లింగన్. వజ్రాల్ని పొదుముకున్న టౌనని దీన్ని పిలుస్తారు. ఇక్కడుండే గోడలు, దుమ్ము... ఇలా అన్ని చోట్లా వజ్రాలు నిక్షిప్తమై ఉంటాయి. కావాలని ఎవరూ వీటినిలా నిక్షిప్తం చెయ్యలేదు.

■ తొమ్మిదో శతాబ్దానికి ముందు నుంచే ఇక్కడ నివాసాలు ఉన్నాయి. అయితే అందుకు పూర్వం ఇక్కడ ఒక అగ్నిపర్వత బిలం ఉండేది. 15 మిలియన్ సంవత్సరాల క్రితం ఇక్కడో గ్రహ శకలం వచ్చి భూమిని బోలెడు ఒత్తిడితో ఢీకొంది.

■ దీంతో అక్కడ రసాయన సమ్మేళనాలు జరిగి చాలానే ఖనిజాలు పుట్టాయి. వీటిల్లో వజ్రాలూ ఉన్నాయి. అయితే అవి మైక్రోస్కోప్‌లో పెట్టి చూస్తే గాని కనిపించనంత బుల్లి బుల్లి రేణువుల్లా ఉంటాయి. ఇక్కడి దుమ్ముల్లో కలిసిపోయి ఉంటాయి.

■ కనీసం కంటికి కనిపిస్తే వాటిని మనం ఆభరణాల్లోనో, మరో విధంగానో వాడుకుంటాం. కానీ రేణువుల్లా కంటికి కనిపించకుండా ఉండే వాటిని ఏం చేసుకుంటాం. అందుకే వాటికి మార్కెట్ విలువా అంతంత మాత్రమే.

■ అందుకే వీటిని ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోరన్నమాట. అయితే రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీలో భీకర వాతావరణం ఉండేది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. ఈ ఊరిని రక్షించుకునేందుకు ఇక్కడి వారు ఆ పక్క పక్కన దొరికే ఇసుక, మట్టిని ఉపయోగించి గోడలు కట్టుకున్నారు. దానితోనే ఇక్కడ కొన్ని ఇళ్లు కూడా కట్టుకున్నారు.

■ సూర్యరశ్మి ఎప్పుడైనా ఏటవాలుగా ఆ గోడలపై పడితే వజ్రాలు ధగధగమని మెరుస్తూ మనకు కనిపిస్తాయి తప్ప ఒట్టిగా అయితే అవి కనే కనిపించవు.

■ ఇక్కడి అగ్ని పర్వత బిలం దాదాపుగా 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేదట. దీంతో ఆ చోటంతా ఇలా చిన్న రేణువుల్లాంటి వజ్రాలు నిక్షిప్తమయ్యాయట.

■ వజ్రాలు చిన్న చిన్న రాళ్లలా కాకుండా ఇలా రేణువుల్లా ఎందుకు మారిపోయాయబ్బా? అని ఎవ్వరికైనా సందేహం కలుగుతుంది కదూ! అంతకు ముందు ఇక్కడ గ్రహశకలం పడటం వల్ల పుట్టిన ఒత్తిడికే ఇవిలా రేణువుల్లా మారిపోయాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

■ ఈ వివరాలన్నీ తెలిపేలా ఇక్కడ ఒక మ్యూజియం కూడా ఉంది. పేరు రైస్ క్రేటర్ మ్యూజియం. ఆ అగ్ని పర్వతం పేరు మీదే దీనికీ పేరు పెట్టారు.

■ దీంతో ఈ చిత్రమైన ఊరుని, మ్యూజియంని చూడటానికి ఇక్కడికి ఏటా బోలెడు మంది పర్యాటకులు వస్తుంటారు. తమాషాగా ఉన్న ఈ వివరాలన్నీ వినడానికైతే భలేగా ఉన్నాయి కదూ!

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Bomb - బామ్

Climb - క్లైమ్

ఆణిముత్యం

శక్తి అనేది డబ్బులో లేదు, మంచితనం, పవిత్రతల్లో ఉంటుంది

- స్వామి వివేకానంద

చిటపట చినుకులు!

కథ

పిల్లగాలి తెమ్మెరొకటి రాలడానికి సిద్ధంగా ఉన్న వాన చినుకుతో కబుర్లకు దిగింది. మబ్బులోని ఆ చినుకు దిగాలుగా ఉంది. కారణమడిగిన గాలితో 'ఎక్కడ రాలతానో, నా బతుకేంకానుందో' అంది దిగులుగా. 'చక్కగా మట్టిలోనో, చెరువులోనో పడతావంతేగా' అంది గాలి.

'అంటే పురుగులు, క్రిములు ఉండే మట్టిలోకో, నాచు నిండిన చెరువులోకో పడి పతనం కావాలా నేను?' అంది చినుకు ఏడుపు ముఖంతో.

'పోనీ ఏ వేడి పదార్థంపైనో పడి ఆవిరవుదువుగానీలే' అంది గాలి ఓదార్పుగా. 'అంటే పుట్టి క్షణం గడవకముందే బతుకు కడతేరిపోతుందా?' అంది చినుకు గాభరాగా.



'ఏమో! ముత్యపు చిప్పలో పడే అదృష్టం పొందుతావేమో దిగులెందుకు' అంది గాలి.

'అంటే నింగిలో స్వేచ్ఛగా విహరించిన నన్ను చిప్పలోను, తర్వాత నగలో పొదిగి బంధీగా పడి ఉండమనా?' అంది చినుకు ఉక్రోషంగా. దాని దిగులును పోగొట్టే ఆఖరి ప్రయత్నంగా గాలి 'పోనీ తళతళమంటూ స్వచ్ఛంగా తామరాకు మీద నిల్చుందువులే' అంది.

'ఛీ.. నిలిచి ఉన్న ఆకునైనా తాకలేని బతుకూ ఓ బతుకేనా?' అంది చినుకు చీదరింపుగా.

సంతోషమే లేని ఆ చినుకు ధోరణికి గాలి నిట్టూర్చింది. పక్కకు చూసింది. ఎంతో కుతూహలంతో నేలను తాకాలని తహతహలాడుతోంది ఓ చినుకు. దాని ముఖమంతా ఉత్సాహం పరుచుకుని ఉంది. ఆశ్చర్యంతో దాన్ని పలకరించింది గాలి.

'నీకు మట్టిలో కలిసిపోతానని భయం లేదా?' అడిగింది.

'ఎందుకూ! అప్పుడు నేను మట్టిలో ఖనిజ లవణాల్ని కరిగించుకుంటాను. చెట్లు నన్ను పీల్చుకోగానే వాటిని అందించగలను. ఎంత మంచి అవకాశం' అంది చినుకు కులాసాగా.

'మరి ఏ వేడి వస్తువుపైనో పడి వెంటనే ఆవిరైపోతే' అంది గాలి.

'మరీ మంచిది. మళ్లీ నింగిలోకి ప్రయాణం. మబ్బు తునకలో భాగంగా స్వేచ్ఛా విహారం' అంది చినుకు తేలిగ్గా.

'ముత్యపు చిప్పలో పడి ముత్యమైపోతావేమో, నింగికెగిరే అవకాశం లేకుండా' అంది గాలి జాలిగా.

'ఆహా! ఎంత భాగ్యం. అప్పుడే కదా. జన్మకు సార్థకత. శాశ్వతత్వం' అంది చినుకు మురిసిపోతూ.

'తామరాకుపై నిలుస్తావనిపిస్తోంది నాకు' అంది గాలి చివరిగా.


'ఎంత చల్లని మాట చెప్పావ్. స్వచ్ఛతను కోల్పోని సంతోషపు బతుకు అప్పుడు' అంది చినుకు చలాకీగా.

ఆ ఆలోచనా ధోరణికి ముగ్ధురాలైంది గాలి. 'ఒకే మబ్బులో పుట్టిన రెండు చినుకులకీ ఎంత తేడా ఉంది? ఆనందమో, విచారమో... మన బతుకు తీరు తేల్చేది మన ఆలోచన విధానమే కదా' అనుకుంది గాలి.

- గుడిపూడి రాధికారాణి


నీడేది?

మొదటి బొమ్మ నీడను పట్టుకోండి



సబ్జెక్ట్ ల్యాబ్ - గణితం

బొమ్మలు, అంకెలు, గుర్తుల్ని బట్టి లెక్క చేయగలరా?



జవాబులు: స్కూల్ సవాల్: 1. జాన్ లోగీ బెయిర్డ్ 2. సహారా ఎడారి 3. మైఖేల్ ఫారడే నీడేది: 2 సబ్జెక్ట్ ల్యాబ్- గణితం: 22 (నీలం గ్లాసు-8, పసుపు గ్లాసు-20, ఎర్ర గ్లాసు-10)

కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?

స్కూల్ సవాల్

1. కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?
2. ప్రపంచంలో అతి పెద్ద ఎడారి?
3. డైనమోని కనిపెట్టిందెవరు?



- డీఎస్ రాజేష్, పదో తరగతి, ఎస్‌కేఆర్ఇఎమ్ స్కూల్, గోరంట్ల, అనంతపురం జిల్లా

అయినా తీరు మారలేదు



టాటా ఏస్‌ల వేగం అదుపు చేసుకోలేక వాహనాలను ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా తల్లిదండ్రుల తీరులో మార్పు రావడం లేదు. ఒకే వాహనంపై ఇలా పిల్లలను తీసుకుని తరలిస్తున్నా వాటిలోనే పంపేందుకు చొరవ చూపుతున్నారు. ముందున్న ప్రమాదాన్ని గుర్తించడంలేదు. ఇకనైనా మార్పురావాల్సిందే. **- మహేష్, మహానంది**

అన్నన్నా...మోత తగునా



హొళగుంద-మార్లమడికి మార్గంలో ప్రయాణించే వారికి ప్రత్యక్ష నరకం కనబడుతోంది. పైపులైను వేసేందుకు తవ్వి వదిలేశారు. ఈ మార్గంలో ఆదోని నుంచి ఇలా ఖాళీ ప్లాస్టిక్ బిందెతో ఆటో వెళ్తోంది. ప్రమాదస్థాయిలో ఆటోలో బిందెల మోతతో వెళ్తూ కనిపించారు. చెట్టుకు తగిలినా, ఒరిగినా ప్రమాదం తప్పదు మరి. **-షఫీ, హొళగుంద**

పెచ్చులూడిన నిర్లక్ష్యం



కళ్లముందే సాక్ష్యం కనిపిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. పెచ్చులూడి ప్రమాదాన్ని గుర్తు చేస్తున్నా.. చలించడం లేదు. పెద్ద తప్పిదం జరిగాక స్పందించడంకన్నా ముందున్న ముప్పును గుర్తించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. బనగానపల్లి మండలం బొందలదిన్నెలో ట్యాంకు పెచ్చులూడి శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. **- రాముడు, బనగానపల్లి**

పౌర పాత్రికేయం



చెక్కు చెదరని బురుజు



కందనవోలు.. నేటి కర్నూలుగా మారిన చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన బురుజు ఇది. నాటి భూస్వాముల పెత్తనాన్ని చాటిచెప్పి స్థానికుల ప్రతాపాన్ని వివరించే కట్టడం ఇది. కట్టడం తిలకించిన వారు చాలామందే ఉంటారు.. కర్నూలులోని కొండారెడ్డి బురుజు నేటికీ చెక్కు చెదరకుండా నిర్మించిన నాటి పాలకుల నిజాయతీని చూపుతోంది. **- రాజు, పాతబస్తీ, కర్నూలు**

అర్ధరాత్రి స్వాతంత్ర్యం



అర్ధరాత్రి మహిళలు తిరిగినపుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని మహాత్మాగాంధీ చెప్పారు. దానిని గుర్తు చేస్తూ ఇదిగో ఇలా.. ఈ వాహనంపై చేతి కర్రతో గాంధీ ఇలా కనిపించారు. కర్నూలు శివారులో అర్ధరాత్రి దాటిన తర్వాత టాటాఏస్ వాహనంలో ఇదిగో ఇలా గాంధీ విగ్రహాన్ని తరలించారు. **- సురేష్, కర్నూలు**

చేయి జారితే..



మహానంది మండలం సీతారామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నీటి కష్టాలు తీరడం లేదు. కనీసం ఒక్క నీటి ట్యాంకు లేదు. 26 మంది చిన్నారులు భోజనం చేయగానే చేతిపంపు వద్ద గంతులేయాల్సిందే. చేయి జారితే.. కట్టు కట్టాల్సిందే.. **- కృష్ణుడు, మహానంది**



నీటిని వాగుకు వదులుతూ...

ఎంతతోడినా.. తర'గని' నీళ్లు

బనగానపల్లి మండల పరిధిలో గనుల యజమానులకు నీటిపాట్లు తప్పడం లేదు. రెండునెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు గని గుంతలు నిండిపోవడంతో వాటిలో వాటిలో పనులు చేయడం కష్టంగా మారింది. అప్పటి నుంచి నిల్వ ఉన్న వర్షంనీటిని బయటకు తోడేందుకు యజమానులు పాట్లుపడుతున్నారు. వందల మీటర్ల దూరంలో మోటార్లు అమర్చి నీటిని తోడి వాగులకు వదులుతున్నారు. పనులు జరగక ఉపాధి లభించడం కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, పలుకూరు (బనగానపల్లి గ్రామీణ)



కాటేజ్ వద్ద ఫ్రాన్స్ దేశస్థులు

ఎకో టూరిజం కేంద్రంలో ఫ్రాన్స్ దేశస్థులు

ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలోని బైర్లూటి ఎకో టూరిజం జంగిల్ సఫారీ క్యాంప్‌ను ఫ్రాన్స్ దేశస్థులు సందర్శించారు. దేశ సందర్శనకు వచ్చిన క్లారిమౌంట్, ఎసాబెల్, లారెంట్, ఎలిమా, క్లూఏ తదితరులు కొద్ది రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. గతంలో ఎకో టూరిజం సందర్శనకు వచ్చిన ఫ్రాన్స్ దేశస్థుల ద్వారా సమాచారం తెలుసుకుని అంతర్జాలంలో నల్లమల గురించి శోధించి అటవీ అందాలు తిలకించేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం సఫారీలో నల్లమలలో తిరిగారు.

1,223కు చేరిన రైతు రథం ట్రాక్టర్లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై అందించే రైతు రథం ట్రాక్టర్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మొదట ప్రభుత్వం 1,128 ట్రాక్టర్ల యూనిట్లను జిల్లాకు కేటాయించింది. తర్వాత కర్నూలు ఎంపీ బుట్టా రేణుకకు 25, కోడుమూరు తెదేపా ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డికి అదనంగా మరో 15, డోన్ తెదేపా బాధ్యుడు కేఈ ప్రతాప్‌కు 20, మంత్రాలయం బాధ్యుడు తిక్కారెడ్డికి 20, మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డికి 15 ట్రాక్టర్లు కేటాయించారు. ప్రస్తుతానికి జిల్లాకు రైతురథం ట్రాక్టర్ల యూనిట్ల సంఖ్య 1,223కు చేరింది.

ఆదోని

ఆరుగురి అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణ శివారు రాజీవ్‌గాంధీ. నగర్‌లో పేకాట నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఎస్సై రంగ తెలిపారు. పేకాట ఆడుతున్న రామాంజనేయులుతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో మట్కా నిర్వాహకులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణం రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న బసరకోడు గ్రామానికి చెందిన కుమారస్వామి అనే నిర్వాహకుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఎస్సై రంగ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.9600 నగదు, మట్కాచీటీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు.. (నిన్నటివి)

ఆదోని మార్కెట్ (కిలో రూపాయల్లో), న్యూస్‌టుడే: టమోటా 7, వంకాయలు 20, బెండకాయలు 16, పచ్చిమిర్చి 26, కాకరకాయ 20, బీరకాయ 20, క్యాలిఫ్లవర్ 18, క్యాబేజి 16, క్యారెట్ 36, ఆలుగడ్డలు 16, ఉల్లిగడ్డలు 42, చౌళెకాయ 26, దోసకాయ 16, సొరకాయ 14, బీట్‌రూట్ 24, బీన్స్ 20, ములంగి 14, చిక్కుడుకాయలు 24, నేతిబీరకాయ 16, దొండమిర్చి 40, అల్లం 36, అనుపకాయ 26, సీమవంకాయలు 30, గెన్సిగడ్డలు 20, కరివేపాకు 40, నిమ్మకాయ 2, మునగకాయ 5, గోంగూర కట్ట 5, ఆకు కూరల కట్ట, 7.00

తెరపై ఈనాడు

ఆదోని మార్కెట్... సత్యం: ప్రాజెక్టు, **శివం:** 2 కంట్రీస్, **రాజ్:** జుమాంజీ, **రాజ్‌శ్రీ:** టైగర్ జిందా **హై,** ద్వారకా **కాంప్లెక్స్ స్క్రీన్ 1:** ఎం.సి.ఎ, **స్క్రీన్ 2:** హల్లో, **స్క్రీన్ 3:** మళ్ళీ రావా, **ప్రభాకర్:** సప్తగిరి ఎల్.ఎల్.బి, **సాయి బాబా:** ఒక్క క్షణం.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే

ఆదోని బంగారం ధరలు..

(10 గ్రాములు). 24 **క్యారెట్లు :** రూ.30,420.
22 క్యారెట్లు ఆభరణాలు : రూ.28,120.
వెండి కిల్లో : 39,800

వ్యవసాయ మార్కెట్ ధరలు..
(క్వింటాళ్లలో..ధర)

దిగుబడులు	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
పత్తి	3657	5367
వేరుసెనగ	2126	4085
ఆముదం	3712	3958
పూలవిత్తనాలు	2811	2931

- న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్.

నేటి నుంచి శివమాల దీక్షలు ప్రారంభం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : శివరాత్రి పండగను పురస్కరించుకొని బుధవారం నుంచి ఆదోని పట్టణంలో శివమాల దీక్షలు ప్రారంభమవుతున్నట్లు గురుస్వామి హంపయ్యస్వామి తెలిపారు. స్థానిక ఎల్‌బీ వీధిలోని శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీన మండల దీక్షలు, 23వ తేదీ నుంచి అర్ధమండల దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. 28వ తేదీన శ్రీస్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని శివస్వాములు ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 13వ తేదీన శివరాత్రి పండగ రోజు దీక్షలు ముగుస్తాయని పేర్కొన్నారు.

శంభూలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

సట్టాబజారు(ఆదోని మార్కెట్), న్యూస్‌టుడే: పట్టణంలోని సట్టాబజారులోని శంభూలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన నిర్వాహకులు ప్రతాప్, కె. భాస్కర్, కృష్ణమూర్తి, రాజాచౌదరి, శంకర్, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఇస్వీ, ఆలూరు రహదారిలో వాహనాలు తనిఖీ చేసి వాహన పత్రాలు సరిగా లేని వాటిని గుర్తించి, 9 కేసులు నమోదు చేసి, రూ.3900 జరిమానా వేసినట్లు ఇస్వీ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఓవర్ లోడుతో వెళ్తున్న 3 ఆటోలను సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఘనంగా ప్రారంభమైన జన్మభూమి-మా ఊరు

వాల్మీకినగర్ (ఆదోని పురపాలకం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోని, ఆర్థికంగా బలపడాలని పురపాలక సంఘం కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. మంగళవారం 1వ వార్డులోని వాల్మీకీ నగర్‌లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలరు సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సభలో కమిషనర్ మాట్లాడారు. ప్రతి పేద వాడిని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక రకాల పథకాలను తెచ్చిందన్నారు. ఇప్పటికే పట్టణంలో రూ.380 కోట్లతో



మాట్లాడుతున్న కమిషనర్ రామలింగేశ్వర్

4704 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో పాటు కొత్తగా 1462 ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. చంద్రన్న ప్రమాద బీమా, అంగన్‌వాడీ చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు అయితే నగదు ప్రోత్సాహకాలు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ఇలా అనేక రకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎం.ఈ విశ్వనాథ్, డీఈలు సత్యనారాయణ, రామూర్తి, గృహ నిర్మాణ శాఖ డీఈ కృష్ణారెడ్డి, ఎఎస్‌డబ్ల్యుఓ గోవిందప్ప, తెదేపా ఫ్లోర్‌నాయకులు తిమ్మప్ప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పట్టణంలో

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నాలుగు వార్డుల్లో జరగనుంది. ఉదయం 2వ వార్డులో భావాజీపేట ఆంజనేయస్వామి ఆలయం, 23వ వార్డులో శంకర్ అర్బన్ ఆరోగ్య కేంద్రం, మధ్యాహ్నం 11వ వార్డులో హవన్నపేట పురపాలక ఉర్దూ పాఠశాల, 27వ వార్డులోని మట్కర్‌వీధిలో కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.

సమస్యలు తీర్చనప్పుడు సభలెందుకు..

ఆర్.ఆర్. కాలనీ (ఆదోని పురపాలకం), న్యూస్‌టుడే : పట్టణంలో మొదటి రోజు నాలుగు వార్డుల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. 1, 10, 22, 26వ వార్డుల్లో కార్యక్రమం నిర్వహించారు. 22వ వార్డులో హనుమాన్ ఆలయం దగ్గర నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ఆ వార్డు కౌన్సిలరు లలితామధుసూదన్‌శర్మ తన అనుచరులతో కలసి బహిష్కరించారు. మా వార్డులో ఏ ఒక్క పని జరగలేదని, గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఏమాత్రం ప్రయోజనం జరగలేదని కౌన్సిలరు జన్మభూమి కార్యక్రమాధికారి టీపీఓ రంగస్వామి, మెప్మా టీపీఓ శేకన్నలను ప్రశ్నించారు. ఎస్సీ సబ్ ప్లాన్, అమృత్ పథకం కింద పనులు మంజూరైన ఏ ఒక్కటీ జరగలేదన్నారు. పింఛన్ల మంజూరులోనూ తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజల సమస్యలు తీర్చాలని వినతులు అందిస్తే.. తీర్చలేనప్పుడు ఎందుకు ఇలాంటి కార్యక్రమాలు అంటు కౌన్సిలరు వెళ్లిపోయారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన కౌన్సిలరు లలితా మధుసూదన్‌శర్మ

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఆదోని మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు అన్నారు. సోమవారం ఆదోని మండలం దిబ్బనకల్లు, సలకలకొండ, బసరకోడు, విరుపాపురం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీనాక్షినాయుడు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు చంద్రన్న బీమా అండగా ఉంటుందన్నారు. నోడల్ అధికారి డ్వామా పీడీ పుల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, తహసీల్దారు శ్రీనాథ్, సర్పంచి పెద్దలక్ష్మి, లక్ష్మన్న, ఎల్లెల్సీ ఉపాధ్యక్షులు రామస్వామి, శంకర్‌రెడ్డి, శ్రీరాములు, సీడీపీఓ శాంతిదుర్గ, ఏఈ వర్మ, వెంకటేశ్వరరెడిడ, ఏపీఎం నల్లన్న, సీఐ దైవప్రసాద్, ఎస్సై సునిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య త్వరలో పరిష్కరిస్తాం

ఆదోని మండలం దిబ్బనకల్లు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామానికి చెందిన ఉసేని, వలమన్నలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఆదోని మండలం నాగనాథనహల్లి వద్ద రూ.12కోట్ల వ్యయంతో తాగునీటి ట్యాంకు నిర్మాణం జరుగుతోందని.. త్వరలో పైపులైన్ల పనులు పూర్తి చేసి మరో నాలుగైదు నెలల్లో గ్రామానికి తాగునీటి సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. పశువైద్య శిబిరం, వైద్య శిబిరం, పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు.



ప్రజలకు సంక్రాంతి కానుక కింద నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే , పీడీ




నల్లరిబ్బన్లు ధరించిన వైద్యులు

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ, స్త్రీల చిన్న పిల్లల ఆస్పత్రి వైద్యులు మంగళవారం నల్లరిబ్బన్లు ధరించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఐఎంఏ సంఘం నాయకులు పద్మకుమార్, ఇబ్రహిం, విజయ్‌కృష్ణ, రాజేశేఖర్, ఆదినగేష్, సృజన్, తదితర వైద్యులు అత్యవసర సేవలు మీనహా ఓపీ సేవలను బహిష్కరించారు. ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు సైతం బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఇండియన్‌మెడికల్ అసోషియోషన్ సెంట్రల్ వర్కింట్ కమిటీ సభ్యులు డా.గోపినాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏఎంసీ స్థానంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తీసుకురావాలనుకోవడం సరికాదన్నారు.

తెదేపా బాధ్యుడికి ఘన సత్కారం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదోని మండలం దిబ్బనకల్లు, సలకలకొండ గ్రామాల్లో మంగళవారం ఆదోని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కె.మీనాక్షినాయుడుకు తెదేపా నాయకులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని, జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరైన ఆయనకు ఘనంగా స్వాగతం పలికి భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మీనాక్షినాయుడును సన్మానిస్తున్న గ్రామస్థులు



డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దైవప్రసాద్

సామర్థ్యానికి మించి జనాల్ని తరలిస్తే కేసులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో చోదకులు తమ ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే వెళ్తే వాహనాలను సీజ్ చేస్తామని ఆదోని తాలుకా సీఐ దైవప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆదోని-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి కోటేకల్లు వద్ద జరిగిన రహదారి ప్రమాదం నేపథ్యంలో తాలుకా పోలీసులు ఆదోని పట్టణ శివారు ఆస్పరి రహదారిలో ఉన్న వైపీఆర్ టౌన్‌షిప్ వద్ద ఆటో, ద్విచక్ర వాహన చోదకులకు, ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో నలుగురికి మించి ఎక్కించుకోరాదని.. డ్రైవరు పక్క సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టరాదని హెచ్చరించారు.

ఆదోని

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి

జూదరుల అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న శ్రీనివాసులు అనే వ్యక్తితో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. జూదరులు గర్జివంక సమీపంలో చరవాణిల (సెల్‌ఫోన్ల) వెలుతురులో పేకాట ఆడుతుండగా దాడి చేసి అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 2070 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.



పెద్దహరివాణం: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాజశేఖర్

సంక్షేమ పథకాలపై అవగాహన

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాన కల్పించారు. గ్రామ ప్రత్యేక అధికారి రాజశేఖర్ మాట్లాడారు. చంద్రన్న బీమా పథకం, ఎన్టీఆర్ భరోసా,పెళ్లి కానుక, ఎన్టీఆర్ హౌసింగ్, ఎస్సీబీసీ, కార్పొరేషన్ల రుణాలు, రేషన్‌కార్డులు తదితర వాటిపై వివరించారు. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. 1100 టోల్‌ఫ్రీ నెంబర్ సరిగా పనిచేయడం లేదని గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుమలత, వీఆర్వో వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మృతికి కారణమైన వారిని శిక్షించాలి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని పట్టణం ఇందిరానగర్‌కు చెందిన సిద్ధరాముడుని కొట్టి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని మృతుడి భార్య భారతి, కుటుంబ సభ్యులు మంగళవారం ఆదోని ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 9వ తేదీన పట్టణంలోని పత్తి జిన్నింగ్ పరిశ్రమలో తన భర్త సిద్ధరాముడిని పరిశ్రమ నిర్వాహకులు, హమాలీలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని వాపోయారు. ఆ తర్వాత పోలీసులు తన భర్తను ఇంట్లో వదిలివెళ్లారన్నారు. పరిస్థితి బాగా లేకపోవడంతో చికిత్స కోసం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు తరలించారన్నారు. ఆ తర్వాత గత నెల 11వ తేదీన స్థానిక ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా సిద్ధరాముడు చికిత్స పొందుతూ డిసెంబరు 30వ తేదీన మృతి చెందారన్నారు. మృతికి కారణమైన వారందరిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

విద్యార్థులు సేవాభావంతో రాణించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని నేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం నేషనల్ కళాశాల విద్యార్థులు కొత్త సంవత్సరం సందర్భంగా పట్టణంలోని ఫెయిత్ హోంలో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా కేకు కోసి చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈకార్యక్రమంలో ఫెయిత్ హోం నిర్వాహకులు ప్రేమ్‌కుమార్, కళాశాల ప్రధానాచార్యులు పణీంద్ర, అధ్యాపకులు మనోహర్, అజాస్‌అహ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం

ఆదోని పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తూ భవిష్యత్తులో ముందుకెళ్లాలని సెయింట్ జోసెఫ్ ఆంగ్లమాధ్యమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ సునీత అన్నారు. ఇటీవల బాలికల విభాగానికి చెందిన ఆదోని జోనల్ క్రీడా పోటీలు మంత్రాలయం మండల కేంద్రంలో జరిగాయి. బాలికల అండర్-14 విభాగానికి చెందిన హాకీ పోటీల్లో సెయింట్ జోసెఫ్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుకుని మొదటిస్థానం కైవసం చేసుకున్నారు. పెద్దనేలటూరు జడ్పీ హెచ్ పాఠశాల జట్టుపై 1-0 గోల్స్ తేడాతో విజయం సాధించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నరసన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పురపాలక ఉపాధ్యాయులకు రుణాలు ఇవ్వాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే : పురపాలక ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణ సౌకర్యం కల్పించాలని ఎంటీఎఫ్ నాయకులు బసవరాజు డిమాండు చేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఎంటీఎఫ్ పట్టణశాఖ కార్యవర్గ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రాథమిక పురపాలక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వ్యక్తిగత అవసరాల కోసం మంజూరు చేసే పార్ట్‌టైం పేమెంట్‌ను పీఎఫ్ ఖాతా నుంచి ఇంతవరకు విడుదల చేయలేదు. దాదాపు 25 మంది ప్రాథమిక ఉపాధ్యాయులకు ఈపార్ట్‌టైం పేమెంట్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ముజాహిద్దీన్, నాగరాజు, అనిల్‌కుమార్, చంద్రమౌళి, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు బసవరాజు



నాటుసారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

నాటుసారా విక్రేతల అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఆదోని ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు చేపట్టారు. ఎక్సైజ్ సీఐ సైదుల్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీధర్, రమేష్‌బాబు, రాజశేఖర్, సిబ్బంది పట్టణ శివారులోని ఆఫీసురాళ్ల గుట్ట ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల సారా ఊట, సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసి డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఎన్టీఆర్‌నగర్‌లో నాటుసారా విక్రయాలు చేస్తున్న శ్రీదేవి, పార్వతి అనే మహిళలను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 4వ తేదీన స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆయా కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యూటీఎఫ్ డైరీని ఆవిష్కరించిన కమిషనర్


ఆదోని విద్య, న్యూస్‌టుడే : పట్టణంలోని పురపాలక కార్యాలయంలో యూటీఎఫ్ డైరీని కమిషనర్ రామలింగేశ్వర్ ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ డైరీలో ఎంతో విలువైన సమాచారం పొందుపరిచామని చెప్పారు. అంతేకాక యూటీఎఫ్ చేపట్టిన ఉద్యమాలు, ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని డైరీలో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు డైరీ రాసే అలవాటు చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా కమిషనర్‌ను నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, పయాజుద్దీన్, రెహమాన్, రామకృష్ణుడు, మోహన్‌రావు, సిద్ధప్ప, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు మేల్కొనాలి

ఆదోని పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా రుద్రవరంలో జరిగిన దళితుల గ్రామ బహిష్కరణతో ప్రభుత్వాలు మేల్కొవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉచ్చీరప్ప, డివిజన్ అధ్యక్షుడు తిక్కన్న అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటికి అంటరానితనం సమసిపోవటంలేదన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సత్కారం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని ఒకటో పట్టణ ఏఎస్సైగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్సై చిదానందను మంగళవారం పోలీసులు ఘనంగా సత్కరించారు. శాలువకప్పి పూలమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై అందించిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం చిదానంద దంపతులకు కుటుంబ సభ్యులు, పోలీసులు, మిత్రులు తదితరులు సత్కరించారు.



సన్మానం అందుకున్న ఏఎస్సై చిదానంద దంపతులు

నల్లకొండలో పౌర్ణమి పూజలు

హనుమాన్‌నగర్ (ఆదోని మార్కెట్), న్యూస్‌టుడే: పట్టణ శివారులోని నల్లకొండ గుహలో కొలువై ఉన్న పాండురంగస్వామి సన్నిధిలో మంగళవారం పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అశ్వర్థనారాయణ నేతృత్వంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. రుక్మిణి, పాండురంగస్వామికి పల్లకిసేవ, రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో రుక్మిణి, పాండురంగస్వామి

జోనల్స్ పోటీలో మదిరె విద్యార్థినుల ప్రతిభ

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : మంత్రాలయంలో జరిగిన ఆదోని డివిజన్ బాలికల జోనల్స్ క్రీడల్లో ఆదోని మండల మదిరె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థినులు బేస్‌బాల్ పోటీల్లో విన్నర్లుగా.. త్రోబాల్ పోటీలో రన్నర్లుగా నిలిచి తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థినుల అభినందన సభ నిర్వహించారు. విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయిని అంజినమ్మలను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శేకన్న, రాజశ్రీ, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో పాఠశాల ఉపాధ్యాయులు

అవీ.. ఇవీ.. అన్నీ..

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణం శ్రీరణమండల ఆంజనేయస్వామి క్షేత్రంలో మంగళవారం ధనుర్మాస పూజలు కనుల పండువగా సాగాయి. స్వామికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, సింధూరలేపనం, మహామంగళహారతి వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే : రాజమండ్రిలో మౌజన్ హత్యను చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మంగళవారం ఎం.ఐ.ఎం పార్టీ నాయకులు పయాజ్‌అహ్మద్ నేతృత్వంలో కార్యకర్తలు ఆర్డీఓ కార్యాలయాధికారికి వినతిపత్రం అందచేశారు. హత్యను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మతిన్ అహ్మద్, సాబీర్‌అలీ, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : మనిషి జీవన విధానం, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి యోగా చక్కటి మార్గమని యోగా మాస్టర్ డాక్టరు వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని ఓం యోగా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 2018 కాలమాన పట్టికలను ప్రముఖ పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి విడుదల చేశారు. సభ్యులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకినగర్(ఆదోని మార్కెట్), న్యూస్‌టుడే: పట్టణంలోని వాల్మీకి నగర్‌లో మంగళవారం మెప్మా విభాగం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 22 మంది వరకు పోటీల్లో పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. సంక్రాంతి పండగ పురస్కరించుకుని పోటీలు నిర్వహించినట్లు మెప్మా విభాగం మేనేజరు ప్రమీలారాణి తెలిపారు. సీఓలు స్వర్ణ, అరుణ, హుసేనయ్య, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా

ఆదోని పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. మంగళవారం ఏపీటీజీ అసోసియేషన్ నాయకులు మీనాక్షి నాయుడిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీటీజీ ప్రచురించిన దైనందినిని ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కె.చిన్నప్ప, జోన్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి కేశవయ్య, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

అందరి సహకారంతోనే అభివృద్ధి

శిరువెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని సర్పంచి దాసరి రత్నమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆకుతోటపేట, మంగళిపేట, బలిజపేటలో నెలకొన్న సమస్యలపై చర్చించినట్లు చెప్పారు.

కూరగాయల ధరలు నిన్నటివి (కిలో.రూ)

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: టమోట 10, పచ్చిమిర్చి 20, ఉల్లిగడ్డలు 40, ఆలుగడ్డలు 20, వంకాయ 40, క్యారెట్‌ 40, బెండకాయలు 40, కాకరకాయలు 40, బీరకాయలు 40, అల్లం 45.

మాంసం ధరలు (కిలో.రూ): పొట్టేలు మాంసం 440, కోడి మాంసం 160.

అందరిలోనూ చిరునవ్వే.. జన్మభూమి లక్ష్యం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి ప్రజల్లో ఆనందాన్ని నింపడమే జన్మభూమి లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ పేర్కొన్నారు. ఆళ్లగడ్డలో మంగళవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం ఐదో విడతలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజాసంక్షేమం కోసం ఇంతగా కష్టపడి పనిచేసే ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పనిచేయడం అదృష్టమన్నారు. ఈ జన్మభూమిలో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి 2 వేల పింఛన్లు, 1,442 గృహాలు, 2,284 ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు తెలిపారు. ఆళ్లగడ్డ శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.72 కోట్లు మంజూరయ్యాయన్నారు. మొలకల వాగు విస్తీర్ణానికి రూ.3 కోట్లు విడుదలయ్యాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలు, చంద్రన్న బీమా అందించి గర్భిణులకు సీమంతం, చిన్నారులకు బారసాల నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌ యార్డ్‌ ఛైర్మన్‌ బీవీ రామిరెడ్డి, ఛైర్‌పర్సన్‌ ఉషారాణి, కమిషనర్‌ వెంకట్రామిరెడ్డి, ఉప తహసీల్దారు సత్య శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

బత్తలూరులో..

బత్తలూరు (ఆళ్లగడ్డ గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ సూచించారు. మంగళవారం ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 9 కి.మీ మాత్రమే సీసీ రోడ్లు వేశారని, 10 కి.మీ వరకు రోడ్లు వేయాల్సి ఉందన్నారు. రహదారి నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్‌ యార్డ్‌ ఛైర్మన్‌ బీవీ రామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాచాపురం శేఖర్‌రెడ్డి, సర్పంచి పుల్లారెడ్డి, ఎంపీపీ బండిచంద్రుడు, జడ్పీటీసీ సుద్దపల్లె చాంద్‌బాషా, నోడల్‌ అధికారి వెంకటరమణమ్మ, ఎంపీడీవో రాముడు, తహసీల్దారు లక్ష్మీదేవి, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బత్తలూరులో మాట్లాడుతున్న మంత్రి అఖిలప్రియ

యల్లావత్తులలో..

యల్లావత్తుల (రుద్రవరం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటకొండ, యల్లావత్తుల గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం నోడల్‌ అధికారి శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సుశీల గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ, మండల విద్యాధికారి సాహెబ్‌ ఉస్సేని, సర్పంచులు పాములేటి, భూలక్ష్మి, ఏఈలు రామకృష్ణ నాయక్‌, మధుమోహన్‌, రాజా, వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం నాగమ్మ, ఈసీ రజాక్‌, వైద్యాధికారిణి జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శులు వెంకటయ్య, సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్‌ అధికారి శివారెడ్డి

శిరువెళ్లలో..

గుంప్రమాన్‌దిన్నె (శిరువెళ్ల), న్యూస్‌టుడే: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని నోడల్‌ అధికారి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం గ్రామ సర్పంచి లక్ష్మీదేవి, ఎంపీపీ బాలజోజమ్మ ఆధ్వర్యంలో ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్‌ ఇంద్రాణి, ఉపాధి ఇంజినీర్‌ సుబ్బన్న, గృహ నిర్మాణశాఖ ఏఈ మహబూబ్‌బాషా, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డి.వనిపెంటలో..

డి.వనిపెంట (చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని డి.వనిపెంట, గొడిగనూరు గ్రామాల్లో మంగళవారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమం జరిగింది. గ్రామాల సర్పంచులు పుల్లమ్మ, దేశంరెడ్డి అధ్యక్షతన సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నోడల్‌ అధికారి సంజీవరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డి.వనిపెంటలో 12 దరఖాస్తులు, గొడిగనూరులో 62 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మంజూరైన ఉపకార వేతన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మాలకొండయ్య, ఎంపీడీవో రాణమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుండుపాపలలో..

గుండుపాపల (దొర్నిపాడు), న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలని మండల నోడల్‌ అధికారి వరప్రసాద్‌ పేర్కొన్నారు. మండలంలోని గుండుపాపల గ్రామంలో ఎంపీపీ చిన్నగురెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామానికి 42 కొత్త ఇళ్లు మంజూరైనట్లు గృహ నిర్మాణ అధికారి రామాంజనేయరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజతమ్మ, ఈవోఆర్‌డీ సరోజినీదేవి, గ్రామ సర్పంచి పుల్లన్న, వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్‌, ఏపీవో రాముడు, వెలుగు అధికారి తిప్పన్న, విద్యాధికారి మనోహర్‌రెడ్డి, అన్ని మండల, గ్రామ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ ఏఈ కృష్ణారెడ్డి

అల్లూరులో..

అల్లూరు (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: అల్లూరు గ్రామంలో ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచి శివరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచి కె.రామకృష్ణారెడ్డి, ఎమ్పీటీసీ సావిత్రమ్మ, తహసీల్దారు ప్రసన్న, ఎమ్పీడీవో మహేష్‌కుమార్‌, మండల విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

క్రీడా దుస్తుల పంపిణీ

ఆలమూరు (రుద్రవరం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆలమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకులు క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ తెలిపారు. గ్రామానికి చెందిన యువకులు శివ, ప్రవీణ్‌, రాము, మనోహర్‌, మహబూబ్‌ వలి మిత్ర బృందం 25 జతల క్రీడా దుస్తులను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరుడు, చంద్రశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నాగరత్నం, లక్ష్మీరెడ్డి, సుబ్బారావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ సమాచారం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు దివ్యదర్శిని కార్యక్రమం సాగుతుందని ఆలయ కార్య నిర్వాహణాధికారి వీరయ్య తెలిపారు. 3వ తేదీ ఉయ్యాలవాడ అగస్త్యేశ్వర ఆలయం నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు. 3న ఒంటిమిట్ట, తిరుమల, 4న తిరుచానూరు, శ్రీకాళహస్తి, జొన్నవాడ, 5న విజయవాడ కనకదుర్గమ్మ, పెద్దకాకని, 6న శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు భక్తులను తీసుకెళ్తున్నట్లు దివ్యదర్శిని నిర్వాహకులు శివనాగిరెడ్డి తెలిపారు.

మాయలూరు: గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు ఎన్‌.వెంకటప్రసాదు (28) క్రిమి సంహారక మాత్రలను మింగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కడుపునొప్పి భరించ లేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి తెలిపారు.

జోనల్‌ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

దొర్నిపాడు, న్యూస్‌టుడే: జోనల్‌ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆల్‌ ఛాంపియన్‌ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. 2017 డిసెంబర్‌ 29 నుంచి 31 వరకు మండలం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జరిగిన జోనల్‌ స్థాయి బాలుర క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి



అమ్మాయితో మాట్లాడుతున్న కాలనీ వాసులు

యువతిని చేరదీసిన కాలనీ వాసులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్సీ నగర్‌ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని యువతిని కాలనీ వాసులు చేరదీశారు. ఈ అమ్మాయి ఒంటరిగా అటూ ఇటూ తిరుగుతూ అనుమానాస్పదంగా కన్పించిందని స్థానికులు తెలిపారు. కాలనీకి చెందిన మహిళలు ఆమెను చేరదీసి చిరునామా తెలుసుకునే ప్రయత్నం చేశారు. చిరునామా సక్రమంగా చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. షీ బృంద సభ్యులు అక్కడికి చేరుకొని ఆమెను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆమె చిరునామా తెలుసుకొని వారి బంధువులకు అప్పగిస్తామని షీ బృందం తెలిపారు.

పేదవారికీ న్యాయం చేయండి

బత్తలూరు (ఆళ్లగడ్డ గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు అధికారులు లబ్ధిదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బత్తలూరు సర్పంచి పుల్లారెడ్డి మంత్రి అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పేదవారికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఎంపీడీవో రాముడుతో మాట్లాడారు. ఎటువంటి అక్రమాలు జరుగకుండా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఘర్షణ కేసులో వ్యక్తులపై కేసు నమోదు

సంజామల, న్యూస్‌టుడే : ఇంటి ఎదుట నీరు చల్లే విషయంలో ఘర్షణకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్‌ మంగళవారం తెలిపారు. సంజామలకు చెందిన ఎల్లప్ప, కల్వటాల నాగేశ్వరరావు ఇంటి ఎదుట నీటిని పోసే విషయంలో పరస్పరం ఘర్షణకు పాల్పడ్డారని, అటుగా వెళుతున్న బీట్‌ కానిస్టేబుల్‌ భానుప్రకాశ్‌ ఫిర్యాదు మేరకు ఘర్షణకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఆళ్లగడ్డ

తెరపై ఈనాడు

ఆళ్లగడ్డ: శ్రీరామ: ప్రాజెక్టు 2, భవానీ: హలో, ఏవీ: ఒక్క క్షణం, రామలక్ష్మి: 2 కంట్రీస్, ప్రతాప్: ఎంసీఏ.

నిత్యావసర వస్తువులు (కిలో.రూ): కందిబేడలు 58, బియ్యం 46, చక్కెర 39, పామాయిల్ 72, సన్‌ఫ్లవర్ ఆయిల్ 84, తెల్లగడ్డలు 50, చింతపండు 200, బెల్లం 50, కొబ్బెర 170, శనగబేడలు 70, గోధుమపిండి 28, ఉప్మారవ్వ 40, ఇడ్లీరవ్వ 30, మినపబేడలు 70, వేరుశనగపప్పులు 75. ఎండు మిర్చి 100.

అంకితభావం.. పురస్కారానికి మార్గం

మాయలూరు (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అమూల్యమైనది. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే సారథులు ఉపాధ్యాయులే. వృత్తిపట్ల అంకితభావం, సామాజిక దృక్పథం కలిగిన ఉపాధ్యాయులను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా విద్యాశాఖాధికారులు

ఎంపిక చేశారు. ఉయ్యాలవాడ మండలం మాయలూరు ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న శ్రీవాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని అందుకున్నారు.


ఉత్తమ ఉపాధ్యాయునిగా కలెక్టర్, డీఈవో నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీవాణి

వ్యక్తిగతం: నంద్యాల పట్టణం ఆమె నివాసం. తల్లిదండ్రులు రామశర్మ, ప్రేమావతి. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అక్కయ్య రాణి గృహిణిగా జీవనం సాగించగా రెండో సంతానం శ్రీవాణి. తమ్ముడు ఫణిరాజు తిరుపతిలో ఏసీబీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీవాణి భర్త

హరి మధుసూదనరావు కడప జిల్లా మైలవరం ఉన్నత

పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడుగా కొనసాగుతున్నారు.

విద్యాభ్యాసం: 1-10వ తరగతి వరకు నంద్యాల పట్టణంలో ఎస్సార్ కేవీ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. ఇంటర్ నేషనల్ కళాశాలలో, రామకృష్ణా డిగ్రీ కళాశాలలో బీఏ పట్టా పొందారు. బీఈడీ విశ్వవాణి కళాశాలలో పూర్తి చేశారు.

ఉద్యోగ ప్రస్థానం: నంద్యాల కేవరెడ్డి పాఠశాలలో మూడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయినిగా పని చేశారు. 2000 సంవత్సరంలో ప్యాపిలి మండలం కౌవలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా నియమితులయ్యారు. 2001లో నిర్వహించిన డీఎస్‌ఈలో స్కూల్ అసిస్టెంట్ సాధించి అల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయినిగా బాధ్యతలు వహించారు. ప్రస్తుతం ఆమె మాయలూరు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

పుస్కారాల సాధన ఇలా..

➡ 2004లో అల్లూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీవాణి మండల స్థాయిలో ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు.

➡ 2014 జనవరి 3న సావిత్రి బాయి పూలే అవార్డును ఆమెకు దక్కింది.

➡ 2017 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైయ్యారు. కలెక్టర్ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

సంతోషంగా ఉంది

– శ్రీవాణి తాత్కాలిక ప్రధానోపాధ్యాయిని, మాయలూరు



పురస్కారం తీసుకోవడంతో మరింత బాధ్యత పెరిగింది. విద్యార్థులకు బోధన సామర్థ్యాలను పెంచడంతో పాటు వారిలో నైతిక విలువలను పెంచడానికి కృషి చేస్తాం. సామాజిక సేవలపై విద్యార్థులకు అవగాహన కలిపిస్తాం. ఇలాంటి అంశాలను ఆచరించడంలో కలిగే అనుభూతులను వారికి వివరించి చైతన్యవంతులను చేస్తాం. ఇన్ని పురస్కారాలను అందుకోవడం సంతోషంగా ఉంది.


శ్మశానం వీధిలో మురుగు కాల్వ లేక ఇలా..

హలో.. ఈనాడు

80085 74916

సమస్య: శ్మశానం కాలనీలో మురుగు కాల్వలు లేవు. ఇళ్లలోని వృథానీరంతా ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటోంది. కాలనీలో అపరిశుభ్రత నెలకొంది. సమస్యను పరిష్కరించండి.

- ఓబులేసు, శ్మశానం కాలనీ

సమాధానం: త్వరలోనే కాలనీలో పర్యటించి మురుగు కాల్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- వెంకట్రామిరెడ్డి, కమిషనర్

సమస్య: దాదాపు 40 రోజులుగా వసంత రాయుడు వీధిలోని కాల్వల్లో మురుగు తీయలేదు. దోమలు అధికంగా ఉన్నాయి. కాల్వను శుభ్రం చేయగలరు.

- సలామ్, వసంత రాయుడు వీధి

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులు నిర్వహించిన సమ్మెతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. రెండు రోజుల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.

- వెంకట్రామిరెడ్డి, కమిషనర్

సమస్య: సబ్‌రిజిస్ట్రార్ వెనుకవైపునున్న మద్యం దుకాణం వద్ద నిత్యం మందు బాబుల రద్దీ ఉంటోంది. మహిళలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. దయచేసి మా సమస్యను గమనించండి.

- ఓ చెల్లెమ్మ, ఆళ్లగడ్డ

సమాధానం: షీ బృందాన్ని తప్పక ఈ ప్రాంతంలో పర్యటించేలా చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ ఎస్సై

☛ ఆళ్లగడ్డ నగర పంచాయతీ పరిధిలోని సామాజిక సమస్యలు ఏవైనా ఉంటే 'హలో ఈనాడు'కు 80085 74916 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఫోన్ చేసి తెలియజేయండి. సమస్యను చిత్రం తీసి వాట్సప్ ద్వారా పంపవచ్చు.


దగ్ధమవుతున్న పశుగ్రాసం

విద్యుత్తు తీగలు తగిలి..

మూడురాళ్ల పల్లె (చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మూడురాళ్ల పల్లె గ్రామ సమీపంలో విద్యుత్తు తీగలు తగలడంతో ట్రాక్టర్ పశుగ్రాసం దగ్ధమైంది. కడప జిల్లా రాజుపాలెం మండలం గాజగూడూరు గ్రామానికి చెందిన పాడిరైతు మల్లికార్జున చింతలచెరువు గ్రామ రైతు నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేశారు. పశుగ్రాసం స్వగ్రామానికి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మూడురాళ్లపల్లె సమీపంలో విద్యుత్తు తీగలు తగిలి ట్రాక్టర్ పశుగ్రాసం దగ్ధమైంది. రూ.10 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

బనగానపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని బనగానపల్లి మజీ సర్పంచి బీసీ రాజారెడ్డి అన్నారు. జోనల్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టును ఆయన బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. క్రీడలకు తనవంతు సహకారం ఇస్తానని, చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రావతమ్మ, మార్కెట్ యార్డు సంచాలకులు శరత్ చంద్రకుమార్, శిక్షకులు ఇబ్రహీం, సీనియర్ క్రీడాకారులు ఖాదర్ బాషా, మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరణ

యల్లావత్తుల (రుద్రవరం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని యల్లావత్తుల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ కాలమానిని మండల విద్యాధికారి సాహెబ్ ఉస్సేని మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం రాష్ట్రోపాధ్యాయ సంఘం చేస్తున్న సేవాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, జిల్లా నాయకులు పురుషోత్తంరెడ్డి, మౌలాలి, వెంకట సుబ్బయ్య, కృష్ణారెడ్డి, రాజేశ్వరీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టీయూ సంఘం అధ్యక్షుడు పోచా శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన సంవత్సరం కాలమానిని ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారి రఘురామిరెడ్డి, పీఆర్‌ఏఈ వెంకటయ్య , పీఆర్‌టీయూ సంఘం సంయుక్త కార్యదర్శి వి.రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు సి.శివయ్య, ఎ.నాగేశ్వరరావు, ఎం.సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.


కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంఈవో


తప్పిన ప్రమాదం

కోటకొండ (రుద్రవరం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటకొండ గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి స్కార్పియో వాహనం దూసుకెళ్లింది. ఏపీ 21 ఏవీ 5949 నంబర్ గల స్కార్పియో అతివేగంతో అదుపుతప్పి ప్రమాదవశాత్తు పంట పొలాలకు సంబంధించిన కాల్వలో పడిపోయినట్లు స్థానికులు తెలిపారు.


కాల్వలో పడిన స్కార్పియో

వెల్లాల క్షేత్రంలో ఆకుపూజ

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని మల్లెవేముల గ్రామానికి సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వెల్లాల క్షేత్రంలో సంజీవరాయస్వామికి భక్తులు లక్ష ఆకుపూజను జరిపారు.


పూజలందుకున్న వెల్లాల సంజీవరాయస్వామి


వివరాలు తెలుసుకుంటున్న నరహరి వీరప్రసాద్

దళితులకు అండగా ఉంటాం

నక్కలదిన్నె (రుద్రవరం), న్యూస్‌టుడే: నక్కలదిన్నెలో దళితుల గ్రామ బహిష్కరణ ఘటనపై రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యుడు నరహరి వీరప్రసాద్ మంగళవారం గ్రామంలో పర్యటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దళిత కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో చర్చించారు. అనంతరం ఎస్సై హనుమంతయ్యను కలిసి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనను కేంద్ర కమిషన్ సభ్యుడు శ్రీరాములు, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్ సుందర్, డీఎస్పీ చక్రవర్తి, తహసీల్దార్ శివరాముడు, సీఐలు దస్తగిరిబాబు, యుగంధర్‌బాబు, ఎస్సైలు హనుమంతయ్య, సుధాకర్ రెడ్డి, నరేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆలూరు

కూరగాయల ధరలు(కి.రూ)

ఆలూరు, న్యూస్‌టుడే : టమోటా 10, పచ్చిమిరప 30, వంకాయ 20, బీట్‌రూట్ 40, క్యారెట్ 40, ఉర్లగడ్డలు 20, ఉల్లిగడ్డలు 50, క్యాలీఫ్లవర్ 20, బీన్స్ 40, ముల్లంగి 20, దోసకాయ 20, కాకరకాయ 40, బెండకాయ 40, చిక్కుడుకాయలు 30, క్యాబేజి 30, బీర కాయలు 40.

తెరపై ఈనాడు..

ఆలూరు : గోవర్దన్ (డీటీఎస్) : హలో.

నిత్యావసర వస్తువుల ధరలు (కిలో రూ.)

బియ్యం కొత్తవి 40, బియ్యం పాతవి 48, మైదాపిండి 30, పప్పులు 75, వట్టికొబ్బెర 160, పెసరబేడలు 80, కందిబేడలు 55, కందిబేడలు (అకోల) 65, శనగబేడలు 75, చింత పండు 200, వెల్లుల్లి 50, ధనియాలు 80, ఉప్మారవ్వ 40, గోధుమపిండి 30, చక్కెర 40, బెల్లం 45, ఉద్దిబేడలు 80, అటుకులు 50, బొంబాయిరవ్వ 40, సన్‌ఫ్లవర్ నూనె (లీటరు) 82, పామోలిన్ 72.

214 రేషన్ కార్డులు మంజూరు

చిప్పగిరి, న్యూస్‌టుడే : మండలానికి 214 రేషన్‌కార్డులు మంజూరు చేశామని తహసీల్దారు వలిబాషా మంగళవారం విలేకరులకు తెలిపారు. గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న వారందరికి రేషన్ కార్డులు ఇచ్చామని ఆయన చెప్పారు. పెళ్లిళ్లు జరిగినవి, పుట్టిన పిల్లల పేర్లు ఇలా 1524 మందికి మీ సేవ ద్వారా లబ్ధి చేకూర్చామని వివరించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

నిట్రవట్టి (హొలహర్వి), న్యూస్‌టుడే : ఆదోని డివిజన్ స్థాయి పరిధిలో మంత్రాలయంలో జరిగిన క్రీడా పోటీల్లో నిట్రవట్టి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ తెలిపారు. మంగళవారం విజయం సాధించిన విద్యార్థులు పథకాలతో గ్రామంలో పుర వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో హొలహర్వి మండలంలోనే ఈ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభతో రాణించారన్నారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-14, అండర్-17లో విద్యార్థులు మొదటి స్థానంలో విజయం సాధించారని వివరించారు. అథ్లెటిక్స్, షాట్ ఫుట్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించారన్నారు. ఇందుకు విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్నలను సన్మానించారు.



విజయం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మధ్యాహ్న భోజనం.. ఇక పారదర్శకం


- అన్ని వివరాలు యాప్‌లో నిక్షిప్తం
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- సాకేంతికతతో అక్రమాలకు అడ్డుకట్ట



మధ్యాహ్న భోజనం కోసం వరసలో ఉన్న విద్యార్థులు

సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు పెంచేందుకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి మంచి రోజులు వచ్చాయి. పథకం నిర్వహణలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చారు. ఇన్నాళ్లు విద్యార్థులు ఉన్నా.. లేకున్నా.. ఎక్కువగా చూపిస్తూ.. నిధులు కాజేసేవారని ఆరోపణలు ఉండేవి. కొన్ని సందర్భాల్లో వంట రుచికరంగా లేదని పిల్లలు ఇళ్ల నుంచి తెచ్చుకొనే వారు. ఆసమయంలో లెక్కలు తప్పుగా చూపేవారు. ఇప్పుడిలాంటి వాటికి చెక్ పెట్టారు. ఈనేపథ్యంలో కొత్త సాంకేతిక విధానం ఏంటి? ఎలా అక్రమాలకు అడ్డుపడనుంది? తదితర వివరాలతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

-న్యూస్‌టుడే, హొలహర్వి



నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి సుమారుగా 245 వరకు ఉన్నాయి. ఇందులో సుమారుగా 30 వేలు మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి మధ్యాహ్న భోజనం అమలవుతోంది. పాఠశాలలో చేసే వంటలు రుచిగా లేదన్న ఉద్దేశంతో పదులు సంఖ్యలో విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకొని భోజనం చేస్తున్నారు. మిగిలిన వారు గత్యంతరం లేక పాఠశాల భోజనాన్నే చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రాథమిక, ప్రాథమికోన్న, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. దీన్ని పాఠశాల యాజమాన్య కమిటీ, ప్రధానోపాధ్యాయుడు, రిసోర్సు పర్సన్ నిరంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తుండాలి. గ్రామంలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తల్లిదండ్రులు సైతం పథకాన్ని పర్యవేక్షించవచ్చు. ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించినా, మెనూ ప్రకారం విద్యార్థులకు అందించకున్నా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. వీరిలో చాలా మంది బాధ్యతలకు దూరంగా ఉండటంతో పథకం నిర్వహణ ఇష్టానుసారంగా తయారైంది. ధరలు పెరిగాయన్న సాకుతో సక్రమంగా వంటలు చేయక పోవడంతో విద్యార్థులు చాలా మంది మధ్యాహ్న భోజనానికి దూరమయ్యారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఫిర్యాదులు అనేకంగా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ సమస్య పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు 'మిడ్ డే మీల్స్' అనే యాప్‌ను రూపొందించింది.

Mid Day Meal Scheme

అమలయ్యే మెనూ

సోమవారం:	అన్నం, కూరగాయలతో సాంబారు, ఉడికించిన గుడ్డు
మంగళవారం:	అన్నం, కూరగాయలతో కూర
బుధవారం:	అన్నం, కూరగాయలతో సాంబారు, ఉడికించిన గుడ్డు
గురువారం:	అన్నం, ఆకుకూరతో పప్పు
శుక్రవారం:	అన్నం, కూరగాయలతో సాంబారు, ఉడికించిన గుడ్డు
శనివారం:	అన్నం, కూరగాయలతో కూర

సాంకేతికత పాత్ర ఇది



కొత్తగా రూపొందించిన యాప్‌లో పాఠశాలలకు హాజరైన విద్యార్థులు సంఖ్య, మధ్యాహ్న భోజనం తీసుకున్న విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు అందించిన ఆహార పదార్థాలు వివరాలు, ఒక రోజు ముందు సరకు నిల్వ, ప్రస్తుతం సరకు నిల్వ వంటి వివరాలు నమోదు చేయాలి. అంతే కాకుండా చిత్రాన్ని తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సమాచారాన్ని జిల్లా విద్యాశాఖాధికారి, కమిషనర్ అంతర్జాలంలో పరిశీలించి ఏ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తక్కువగా తీసుకుంటున్నారో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉంటుందో అందుకు కారణాలు, ఏమిటి తదితర అంశాలను సమీక్షించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ యాప్ అమల్లోకి వచ్చిన తర్వాత గతంలో కంటే విద్యార్థులు సంఖ్య పెరిగిందని అధికారులు అంటున్నారు.



మంచి ఫలితాలు వస్తాయి

-జనార్దన్, పచ్చరపల్లి, భగత్‌సింగ్ యూత్ కమిటీ అధ్యక్షుడు

మధ్యాహ్న భోజనం పథకంలో సాంకేతిక పరిజ్ఞానం తోడుకావడంతో మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకు పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసే వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయడం వల్ల పథకంలో మరింత పారదర్శకత కనిపిస్తుంది. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందించడం వల్ల విద్యార్థులు ఎంతో మేలు కలుగుతుంది. ఇలాంటి పౌష్టికాహారానికి సంబంధించిన ఆహార పదార్థాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వివరాలు నమోదు చేస్తున్నాం

-ఈరన్న, మండల విద్యాధికారి

మండలంలో అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అలాగే పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చాం. అలాగే ప్రతి రెండు నెలలకు ఒకసారి వంట నిర్వాహకులకు శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలి

ఆలూరు, న్యూస్‌టుడే : కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలని సీఐ అబ్దుల్‌గౌస్ అన్నారు. సోమవారం సీఐ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం నియోజకవర్గంలోని పలువురు ఆలూరులోని పోలీసు స్టేషన్‌కు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఏడాదిలో ఘర్షణలు, ప్రమాదాలు వంటి వాటివి చోటు చేసుకుని కొంత మంది మృత్యువాత పడగా.. మరి కొంత మంది క్షతగాత్రులయ్యారని చెప్పారు. అయితే ఈ ఏడాది ప్రజలందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. ప్రధానంగా ఎలాంటి ఘర్షణలు, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఖలందర్ ఆధ్వర్యంలో కేకు కోసి పలువురికి పంచి పెట్టారు. సీపీఎం నాయకులు హనుమంతు, నారాయణస్వామితో పాటు పలువురు సీఐ, ఎస్సై ధనుంజయకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.



కేకు కోస్తున్న సీఐ అబ్దుల్‌గౌస్, చిత్రంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఖలందర్



మాట్లాడుతున్న శాలి వాహన సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర

చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారం

ఆలూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆలూరులోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం విడిపోయినా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేసి గుడిసె లేని గ్రామాలను ఆవిష్కరిస్తున్నారన్నారు. చంద్రన్న బీమాతో ఎంతో మందికి మంచి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్రంలో తెదేపానే అధికారం వస్తుందన్నారు. తెదేపా నాయకులు నారాయణరెడ్డి, నర్సప్ప, శివప్రసాద్‌శెట్టి, నారాయణ, గూళ్యం రామాంజనేయులు, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

శంకరబండ (ఆస్పరి), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలపై అవగాహన అవసరమని ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు శంకర్‌ప్రసాద్ కోరారు. మంగళవారం శంకరబండ గ్రామంలో విద్యార్థులు, అధ్యాపకులందరూ కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అందకపోతే కారణాలు అడిగారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛభారత్ పాటించాలని కోరారు. ఇళ్ల వద్ద ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బడేసాబ్, ఓబులేసు, దత్తాత్రేయ, నరసింహులు, ఈరన్న, సంతోషలక్ష్మి, లత, మహాలక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జొన్న పంట దగ్ధం

ఆలూరు, న్యూస్‌టుడే : ఆలూరుకు చెందిన రైతు వన్నూర్‌స్వామి పొలంలో సాగు చేసిన జొన్న పంట అగ్నికి ఆహుతై రూ. లక్ష వరకు నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి వెళ్లే మార్గంలో మొత్తం 13 ఎకరాలను కౌలుకు తీసుకుని జొన్న పంట సాగు చేశానని చెప్పారు. ప్రస్తుతం పంట చేతికందుతున్న సమయంలో సోమవారం రాత్రి అనుకోని విధంగా మంటలు చెలరేగి దాదాపు 3 ఎకరాల మేరా పంట మొత్తం కాలిపోయిందని వాపోయారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి గిడ్డయ్య మంగళవారం వన్నూర్‌స్వామి పొలానికి వెళ్లి కాలిపోయిన పంటను పరిశీలించారు. అనుకోకుండా జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు తీవ్రంగా నష్టపోయాడని.. ప్రభుత్వం ఆయనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వారి వెంట మండల కార్యదర్శి మునిస్వామి, భూపేష్, ఎస్ఎస్ బాషా, బాబు, సుంకన్న ఉన్నారు.



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ ఉప తహసీల్దారుగా ఆదినారాయణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దేవనకొండ ఉప తహసీల్దారును జిల్లా సచివాలయానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. అక్కడ కర్నూలు జిల్లా కేంద్రంలో మీసేవ ఏవోగా పనిచేస్తున్న ఆదినారాయణను దేవనకొండ ఉప తహసీల్దారుగా నియమించారు. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మీసేవ ఏవోగా రెవెన్యూ సెక్షన్‌లో సూపరింటెండెంటుగాఉన్న శ్రీనివాసులుకుఅదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

ఆలూరు

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

ఆల్లూరుదిన్నె, వెలమకూరు, దేవనకొండ(ఆస్పరి), న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాలూకా ప్రత్యేక అధికారి తిప్పేనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆల్లూరుదిన్నె, వెలమకూరు గ్రామాల్లో గ్రామ సర్పంచులు మహేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు అధ్యక్షతన జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పార్వతి, ఎంపీడీవో మహబుబ్‌బాషా, తహసీల్దారు బాలగణేశయ్య, ఏపీవో కృష్ణమోహన్, ఏపీఎం వందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా అధికారులు, ప్రజలందరూ కలసి ప్రతిజ్ఞ చేశారు.

విరుపాపురం, నిట్రవట్టి (హాలహర్వి), న్యూస్‌టుడే : గతంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన వినతులకు పరిష్కారం చూపలేదని, ఇలాంటి పరిస్థితిలో మళ్లీ కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తారని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం విరుపాపురం, నిట్రవట్టి గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామస్థులు అధికారులను సమస్యలపై ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన పింఛను, గృహాలు, రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో విరుపాపురం సర్పంచి బసవ, నిట్రవట్టి సర్పంచి బసప్ప, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఈవోఆర్డీ రవికిశోర్, తెదేపా నాయకుడు బసప్ప తదితరులు పాల్గొన్నారు.



హొళగుంద : మార్లమడికిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



హాలహర్వి: అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

హత్తిబెళగల్ (ఆలూరు), న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారమే జన్మభూమి కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్, ఎంపీడీవో విజయభాస్కర్, తహసీల్దారు సూర్యనారాయణ ప్రసాద్ అన్నారు. ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామంలో మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నియోజక వర్గ పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ ఏవైన సమస్యలు ఉంటే జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తులు అందిస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పలువురు రేషన్ కార్డులు, పింఛన్లు, ఎన్టీఆర్ గృహాలు తదితర వాటిపై దరఖాస్తులు అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు రాంభీంనాయుడు, ఎస్సై ధనుంజయ, ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్ర, వార్డు సభ్యుడు, సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు, ఈరన్న పాల్గొన్నారు.

రామదుర్గం (చిప్పగిరి), న్యూస్‌టుడే: నియోజకవర్గానికి 2 వేల కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నామని జడ్పీటీసీ జిల్లా సంఘం అధ్యక్షుడు మీనాక్షి నాయుడు తెలిపారు. చిప్పగిరి మండలం రామదుర్గంలో సర్పంచి రోహిణి ఆధ్వర్యంలో 'జన్మభూమి- మాఊరు' గ్రామసభను ఉద్దేశించి ఆయన మంగళవారం మాట్లాడారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, పక్కాగృహాలు ఇస్తున్నామన్నారు. తెదేపా ప్రజల ప్రభుత్వమన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాజామొహిద్దీన్, ఎంపీపీ పద్మావతి, బెల్డోణ సహకార సంఘం అధ్యక్షుడు నిరంజన్‌ప్రసాద్, తెదేపా సీనియర్ నాయకుడు తిమ్మయ్య, బెల్డోణ సర్పంచి భీమలింగప్ప పాల్గొన్నారు.

మార్లమడికి, హొన్నూరు (హొళగుంద), న్యూస్‌టుడే : ప్రజల సమస్యలన్నీ తీర్చడానికే ప్రభుత్వం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసాద్, ఆలూరు ఏపీడీ లోకేశ్వర్ అన్నారు. మండలంలోని మార్లమడికి, హొన్నూరు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన పింఛన్లు, రేషను పత్రాల వివరాలను అధికారులు చదివి వినిపించారు. హొన్నూరు గ్రామంలో మాత్రం సర్పంచి రామలింగమ్మ గ్రామసభకు హాజరయ్యారు. అయితే మార్లమడికిలో మాత్రం ప్రజా ప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం

తంగరడోణ, తొగలగల్లు(ఆస్పరి), న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ముఖ్య లక్ష్యమని మండల అధ్యక్షురాలు రత్నమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని తంగరడోణ, తొగలగల్లు గ్రామాల్లో గ్రామ సర్పంచులు గోపాల్‌రెడ్డి, కృష్ణ అధ్యక్షతన జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చెంగలరాయుడు, ఎంపీడీవో సలీంబాషా, ఉప తహసీల్దారు శ్రీనివాసులు ఈవోర్డీ వీర్రాజు, ఏపీవో బొజ్జయ్య, వైద్యాధికారి రఘురామిరెడ్డి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు రాధాకృష్ణ

జలాశయాల నిర్మాణాలు పూర్తయ్యే వరకు పోరాటం

ఆలూరు, న్యూస్‌టుడే : జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో నగరడోణ, వేదవతి జలాశయాల నిర్మాణాలు చేపట్టేంత వరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు రాధాకృష్ణ అన్నారు. స్థానిక జ్యోతిబసు భవనంలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జలాశయాలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇస్తున్నారే తప్పా నిధులు విడుదల చేయలేకపోయారని దుయ్యబట్టారు. జలాశయాలు లేకపోవడంతో ఇక్కడి ప్రాంత ప్రజలు కేవలం వర్షాధారంపైనే పంటలు పండించుకుంటున్నారని వాపోయారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగు నీటికి సైతం ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారన్నారు. వెంటనే జలాశయాలు నిర్మించి తాగు, సాగు నీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండు చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈసమావేశంలో తాలూకా కార్యదర్శి హనుమంతు, నారాయణస్వామి, తిమ్మప్ప, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరును అభివృద్ధి చేయాలి

ఆస్పరి, న్యూస్‌టుడే : జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతమైన ఆలూరు నియోజవర్గాన్ని అభివృద్ధి చేయాలని సీపీఎం తాలూకా నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, మాణిక్యప్పలు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఈనెల 10న ఆలూరులో జరిగే సీపీఎం 21వ జిల్లా మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. 10వతేదీ నుంచి 12వతేదీ వరకు మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మల్లేష్, భాస్కర్, రవి, శేషప్ప, తిమ్మప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిరావాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గ సీపీఐ 10వ మహాసభలను ఆస్పరిలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 4న జరిగే తాలూకా 10వ మహాసభలకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఆంజనయ్య, వీరన్న, వెంకటరాముడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పశుగ్రాసానికి గిరాకీ

హొళగుంద, న్యూస్‌టుడే : తుంగభద్ర దిగువ కాల్వ కింద ఖరీఫ్‌లో వరి సాగు చేయని విషయం తెలిసిందే. కాల్వకు నీటి విడుదల ఆలస్యం కావడంతో పాటు విపరీతమైన వర్షాల వల్ల చాలా వరకు రైతులు వేసుకున్న పంటలు దెబ్బతిన్నాయి. కొందరు రైతులు మాత్రం వరికి ప్రత్యామ్నాయంగా జొన్న సాగు చేశారు. ప్రస్తుతం జొన్న కోతలు ప్రారంభమయ్యాయి. పశువులకు వరిగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడటంతో పలు ప్రాంతాలకు చెందిన పాడి రైతులు జొన్నసొప్ప కొనడానికి పోటీ పడుతున్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

కైరుప్పల(ఆస్పరి), న్యూస్‌టుడే : విద్యార్థులు క్రీడల్లోనూ సత్తాచాటి పాఠశాల పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు జేమ్స్ అన్నారు. ఇటీవల మంత్రాలయం, పత్తికొండల్లో జరిగిన జోనల్స్‌లో పోటీల్లో వాలీబాల్ ఆటలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో బాగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లతీఫ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆటల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బస్సు సౌకర్యం.. మూణ్నాళ్ల ముచ్చటే..!

హొళగుంద, న్యూస్‌టుడే : మండలానికి కర్ణాటక బస్సుల రాక మూణ్నాళ్ల ముచ్చటగా మారింది.. ఆరు నెలల కిందట పలు కారణాలతో మండలానికి నడిచే కర్ణాటక ఆర్టీసీ బస్సులు రద్దైన విషయం తెలిసిందే. అయితే గత నెల 15న ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్ ఉరుసును పురస్కరించుకుని బళ్లారి, శిరుగుప్ప డిపో అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. కాగా అప్పట్లో గ్రామానికి చెందిన పలువురు బస్సులను అడ్డుకున్నారు. ప్రతి రోజు మండలానికి బస్సులు నడిపితేనే తాము వదులుతామని.. లేని పక్షంలో బస్సులు తిరగనివ్వమని నిరసన వ్యక్తం చేశారు. అయితే గ్రామంలోని పెద్దలు వారిని నచ్చజెప్పి బస్సులు తిరిగేలా చేశారు. అయితే ఉరుసు ముగిసిన మరుసటి రోజు నుంచే కర్ణాటక ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడం ఆవేదనకు గురిచేస్తోంది. ప్రైవేటు బస్సుల టాపు పైనే కూర్చొని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడటం విచారకరం.



ప్రైవేటు బస్సు టాపుపై బళ్లారి వెళుతున్న ప్రయాణికులు

విలువలతో కూడిన విద్య అందించాలి

ఆలూరు, న్యూస్‌టుడే : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని మండల విద్యాధికారిణి సునంద అన్నారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద మంగళవారం యూటీఎఫ్, ఎస్టీయూ 2018 కాలమాని, దైనందినిలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఒక ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ నేర్పించాలని సూచించారు. ఇదే విధంగా ఎక్కడ విధులు నిర్వహించినా పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాలను స్వచ్ఛంగా ఉంచి ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధించాలని సూచించారు. యూటీఎఫ్ నాయకులు ఖాసీం, మురళీ, పార్థసారథి, బసవరాజు, ఎస్టీయూ నాయకులు నాగరాజు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు..



కాలమాని విడుదల చేస్తున్న విద్యాధికారిణి సునంద, యూటీఎఫ్ నాయకులు



ఎస్టీయూ కాలమాని, దైనందిని విడుదల చేస్తున్న నాయకులు

బనగానపల్లి

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగుడి, పసుపల (బనగానపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: పాడిరైతులు హెరిటేజ్ సంస్థ అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమలో రాణించాలని బనగానపల్లి హెరిటేజ్ డెయిరీ మేనేజరు అమర లింగారెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుడి, పసుపల గ్రామాల పరిధిలోని పాడిరైతులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పాటిమీది ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎస్సై మంజునాథ్ అన్నారు. మంగళవారం ఆలయాన్ని ఆయన దర్శించారు. ఎలాంటి అభివృద్ధికి నోచుకోని పురాతన ఆలయం నేడు దాతల సాయంతో అభివృద్ధి చెందుతోందన్నారు. పురాతన ఆలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపరూ..!

బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణ, అవుకు, కోవెలకుంట్ల గ్రామీణ, సంజామల న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏటా జనవరిలో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అందిన దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే చాలావరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో అధికారుల చొరవతో కొంత ముందడుగు వేసినా మరికొన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. నియోజవర్గంలో 130 గ్రామాలు ఉండగా ఆయా గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనున్నారు.



లింగాలలో అభివృద్ధికి నోచుకోని ఓ రహదారి

బనగానపల్లి : మండలంలో యన కండ్ల, ఎర్రగుడి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి దత్తత గ్రామం కావడంతో చాలావరకు మౌలిక సదుపాయాలు కల్పించారు. గ్రామంలో మొత్తం 5,060 జనాభా ఉంది. పింఛన్లు తీసుకుంటున్నవారు 480 మంది ఉండగా నూతనంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు 34 మంది ఉన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్లు ఖర్చుపెట్టి సీసీ రహదారులు వేశారు. పింఛన్లు, ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



కమలపురి వద్ద కోతకు గరైన రహదారి

☛ ఎర్రగుడి గ్రామంలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రహదారిపైనే మురుగునీరు పారుతుండటంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 2030 జనాభా ఉంది. ఇళ్లు 680 ఉండగా పింఛనేదారులు 230 మంది ఉన్నారు. పింఛన్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారు 35 మంది ఉన్నారు.

సంజామల : కమలపురి, వసంతాపురంలో ప్రధాన నమస్యలు ఉన్నాయి. వసంతాపురం మజరా గ్రామమైన బొందలదిన్నెలో ఏళ్ల తరబడి మంచినీటి ట్యాంకు శుభ్రం చేసిన పరిస్థితి కనిపించడం లేదు. అపరిశుభ్రమైన నీరు గ్రామానికి దిక్కుగా మారింది. కమలపురి రహదారి పాలేరు వాగు ఉద్ధృతికి కోతకు గురైంది. ఆయా గ్రామాల ప్రజలు అటుగా వెళ్లేందుకే ఇబ్బందులు పడుతున్నారు. మురుగు సమస్య ఇక్కడ తీవ్రంగా కనిపిస్తుంది. కమలపురిలో

❒ నేటి జన్మభూమి - మాఊరు సమావేశాలు

జరగనున్న కార్యక్రమంలో బనగానపల్లి బీసీ జనార్ధన్‌రెడ్డి పాల్గొననున్నారు.

కోవెలకుంట్ల : లింగాల, వల్లంపాడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లింగాల సమీపంలోని పాలేరు వాగు వద్ద వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వల్లంపాడులో ఎస్సీలకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంజరు భూమిలో శ్మశానం ఉండగా అందులో కొందరు పంటలు సాగు చేసుకోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: బెలుం శింగవరం, బెలుం గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. రెండు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ప్రణాళిక బద్ధంగా పరిష్కారం

వెంకటరెడ్డి, ఎంపీడీవో

జన్మభూమిలో వచ్చిన సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పింఛన్లు, ఇళ్లు కావాలని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారికి తప్పకుండా మంజూరు చేస్తున్నాం. ప్రస్తుతం వస్తున్న దరఖాస్తులను అంతర్జాలంలో ఉన్నతస్థాయి అధికారులకు పంపి చర్యలు తీసుకుంటాం. ఇక మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

అవుకు : జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం సభలు నిర్వహించనున్నారు. గతంలో ప్రకటించిన ప్రణాళికలో స్వల్ప మార్పులు చేసి ఉప్పలపాడు, శింగనపల్లె గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉప్పలపాడులో ఎంపీడీఓ బృందం, శింగనపల్లెలో తహసీల్దారు బృందం హాజరు కానున్నట్లు అధికారులు ప్రకటించారు.



పోటీలను ప్రారంభిస్తున్న దాతలు

బానుముక్కల వృషభాల విజయం

పూడిచర్ల(ఓర్వకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని పూడిచర్లలో ఆర్‌సీఎం చర్చి సంఘస్థుల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగు పోటీలు నిర్వహించారు. బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామానికి చెందిన డేగల రాజేశ్వరి వృషభాలు 4742 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.30వేలు కైవసం చేసుకుంది.

5న కలెక్టరేట్ ముట్టడి

బనగానపల్లి, న్యూస్‌టుడే: కర్నూలులో ఈనెల 5న చేపట్టిన గిరిజనుల కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సంఘం పట్టణ అధ్యక్షుడు రాముడు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం అన్యాయమని, ఆ ప్రయత్నం వెంటనే మానుకోవాలని డిమాండు చేశారు.

ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: వారం రోజుల క్రితం మండలాధ్యక్షుడు రామాంజనేయులు తండ్రి బ్రహ్మం అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం ఆయన కుటుంబానికి బనగానపల్లి ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి వెళ్లి ఆయనను పరామర్శించి ఓదార్చారు. తెదేపా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బెలుం వెంకటసుబ్బా రెడ్డి, తెదేపా నాయకులు నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్వో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో వ్యక్తులపై కేసు నమోదు

సంజామల, న్యూస్‌టుడే : ఇంటి ఎదుట నీరు చల్లే విషయంలో ఘర్షణకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ మంగళవారం తెలిపారు. సంజామలకు చెందిన ఎల్లప్ప, కల్వటాల నాగేశ్వరరావు ఇంటి ఎదుట నీటిని పోసే విషయంలో పరస్పరం ఘర్షణకు పాల్పడ్డారని, అటుగా వెళుతున్న బీట్ కానిస్టేబుల్ భానుప్రకాశ్ ఫిర్యాదు మేరకు ఘర్షణకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

అవుకు జలాశయం ఈఈగా మధుప్రసాదరెడ్డి

అవుకు, న్యూస్‌టుడే: అవుకు జలాశయం కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ)గా మధు ప్రసాదరెడ్డిని నియమించారు. ఈమేరకు ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఈగా పనిచేసిన పాపారావుకు నంద్యాల డివిజన్‌లో తెలుగుగంగ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. మధుప్రసాదరెడ్డి నాణ్యత నిర్వహణ విభాగంలో ఈఈగా పనిచేశారు.

అల్లర్లు చేస్తే కేసులు తప్పవు

కలుగొట్ల(కోవెలకుంట్ల గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామంలో అల్లర్లు చేస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై మధుసూదన్ హెచ్చరించారు. మంగళవారం రేవనూరు స్టేషన్ పరిధిలోని కలుగొట్లలో ఆయన సిబ్బందితో కలిసి గ్రామసందర్శన చేశారు. గ్రామస్థులతో మాట్లాడుతూ అందరూ ప్రశాంత జీవనం గడపాలన్నారు. మట్కా, పేకాట, సారా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

నందవరం (బనగానపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నందవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అవుకులో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు నారాయణ మంగళవారం తెలిపారు. అండర్-17 సీనియర్స్ విభాగంలో క్రికెట్‌లో విజేతలుగా నిలవగా సాఫ్ట్‌బాల్‌లో ద్వితీయ స్థానంలో, అండర్-14 విభాగంలో క్రికెట్, కబడ్డీ, సాఫ్ట్‌బాల్‌లో విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

లాంగ్‌జంప్‌లో పేరుసోములకు ద్వితీయ స్థానం

పేరుసోముల (సంజామల), న్యూస్‌టుడే : కోవెలకుంట్ల జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పేరుసోముల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి సీనియర్ విభాగం లాంగ్‌జంప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు వరప్రసాదరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినప్పటికీ తెలుగు ఉపాధ్యాయుడు బాబయ్య ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు కృషిచేయటం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు బాబాయ్యను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు సతీష్ కుమార్, వెంకటరామిరెడ్డి, తులసీశ్వరర్‌రెడ్డి, విజయ కుమార్, రమణయ్య, నరేష్ బాబు, అహమ్మద్ హుసేన్, ఓబయ్య, రమబాయి, రాఘవేంద్రమ్మ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి వాసవి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.రమణారెడ్డి మంగళవారం తెలిపారు. గతనెల 27 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులు కె.దినేష్‌రెడ్డి, పి.మహేష్, బి.వి.ఫణీంద్రారెడ్డి, ఎం.నశీర్, ఎం.శ్రీనివాసులు, పి.ఉమామహేష్‌లు మార్చిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పీడీ పార్ధసారథిరెడ్డితో పాటు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులతో అధ్యాపకులు

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

బనగానపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని బనగానపల్లి మజీ సర్పంచి బీసీ రాజారెడ్డి అన్నారు. జోనల్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టును ఆయన బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. క్రీడలకు తనవంతు సహకారం ఇస్తానని, చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రావతమ్మ, మార్కెట్ యార్డు సంచాలకులు శరత్ చంద్రకుమార్, శిక్షకులు ఇబ్రహీం, సీనియర్ క్రీడాకారులు ఖాదర్ బాషా, మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న బీసీ రాజారెడ్డి

తెరపై ఈనాడు

కోవెలకుంట్ల: ఎ.వి.ఆర్.: ఒక్క క్షణం, **ఎస్ఎల్‌వీటీ:** హలో, పాండురంగా: ఎంసీఏ

బనగానపల్లి: శివరామ్: 2 కంట్రీస్,. **జీఎం:** హలో.

డోన్

కేదారీశ్వర ఆలయంలో వేడుకలు

డోన్, న్యూస్‌టుడే: శ్రీనివాసనగర్‌లోని కేదారగౌరీశ్వర స్వామి ఆలయంలో మండల దీక్ష ముగింపు వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కురుకుంద శేఖర్ తెలిపారు. ఆలయంలో స్వామివారికి ఉదయం నుంచి పూజలు 24 రకాల వస్తువులతో అభిషేకాలు ఉంటాయని తెలిపారు. మండలం రోజుల పాటు చేపట్టిన దీక్షల ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

శబరిమలకు వెళ్లిన మాలధారులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్లకు చెందిన అయ్యప్పస్వామి మాలధారులు మంగళవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గురుస్వామి సత్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఇరుముడులు ధరించారు. నరేంద్రస్వామి ఆధ్వర్యంలో 32 మంది భక్తులు వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవాధ్యక్షుడు పోలూరు భాస్కర్‌రెడ్డి, అధ్యక్ష కార్యదర్శి జయచంద్రకుమార్, బచ్చు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రగతి బాట.. రైతుకు బాసట

- వ్యవసాయ విపణిలో రూ.కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- శీతల గోదాముల ఏర్పాటు
- కొనుగోళ్లతో మార్కెట్‌కు కళ

డోన్ గ్రామీణ, ప్యాపిలి: వ్యవసాయ విపణి పేరుకే ఉండేది. గోదాములు, షెడ్లు ఉన్నా పంటల క్రయవిక్రయాలు జరిగేవి కావు. కేవలం పశువులు, గొర్రెల సంతల నిర్వహణ చేపట్టేవారు. ఈ మూడేళ్లలో విపణి అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ఓవైపు ప్రభుత్వం మద్దతు ధరలకు కొనుగోళ్లు చేపడుతుండటం, మరోవైపు మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో దాని రూపురేఖలు మారిపోయాయి.

మూడేళ్ల కాలంలో డోన్ వ్యవసాయ విపణి అభివృద్ధి పథంలో దూసుకెళ్లింది. రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం వేరుసెనగ, కంది వంటి పంటలకు మద్దతు ధరలు కల్పిస్తూ కొనుగోళ్లు చేపడుతుండటంతో మార్కెట్ కళకళలాడుతోంది. 2016-17లో ఆదాయ లక్ష్యం రూ.1.05 కోట్లు కాగా రూ.86 లక్షలు వసూలైంది. 2017-18లో లక్ష్యం రూ.1.36 కోట్లు కాగా ఇప్పటి వరకు 40% వసూలైంది.

రూ.5 కోట్లతో అభివృద్ధి

డోన్ వ్యవసాయ విపణిలో రూ.కోటితో రెండు ఉల్లి గోదాములు ఏర్పాటు చేశారు. పంట ఉత్పత్తులను మాగపెట్టేందుకు, నిల్వ చేసుకొనేందుకు శీతల గోదామును రూ.50 లక్షలతో ఏర్పాటుచేశారు. ప్రధానంగా పండ్లను రసాయనాలతో మాగ బెడుతుండగా విపణిలో ఏర్పాటు చేసిన గోదాముతో రైతులు కృత్రిమంగా మాగబెట్టే అవకాశం ఏర్పడింది. చుట్టూ రక్షణగోడ, రైతుల విశ్రాంతి భవనం మరమ్మతులను రూ.10 లక్షలతో ఏర్పాటు చేశారు.



రూ.కోటితో చేపట్టిన ఉల్లిగోదాములు

పశువుల సంతకు ప్రత్యేకం

డోన్‌లో పశువుల సంతకు ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాతోపాటు ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి సైతం ఇక్కడికి పశువులను తీసుకువస్తుంటారు. మార్కెట్ ఆదాయానికి ప్రధాన వనరు పశువుల సంత నిర్వహణే! వర్షాకాలం, వేసవిలో పశువులు ఎండకు, వర్షానికు తడవకుండా ఉండేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు మార్కెట్లో రూ.1.25 కోట్లతో పశువుల షెడ్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా డోన్‌లో దీన్ని ఏర్పాటు చేయటం గమనార్హం.

అద్దె గదులతో శాశ్వత ఆదాయం

మార్కెట్ ఆదాయానికి ప్రధానంగా క్రయవిక్రయాలు కాకుండా శాశ్వతంగా మార్కెట్‌కు ఆదాయం కల్పించేందుకు విపణికి ఎదురుగా ఉన్న స్థలంలో రూ.50 లక్షలతో గదులను ఏర్పాటు చేశారు. వీటిని అద్దెలకు ఇవ్వడంతో విపణికి శాశ్వతంగా ఆదాయం లభిస్తుందని, విపణి మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



ప్యాపిలి విపణిలో జరుగుతున్న వేరుసెనగ కొనుగోళ్లు

ప్యాపిలిలోనూ అభివృద్ధి పనులు

డోన్ విపణి పరిధిలో ప్యాపిలి సబ్‌యార్డు ఉంది. ఇక్కడ ప్రధానంగా కందులు కొనుగోళ్లు అధికంగా జరుగుతాయి. డోన్‌లోనూ జరగని రీతిలో ఇక్కడ కొనుగోళ్లు జరగటంతో ఇక్కడ రూ.25 లక్షలతో షెడ్లు, కార్యాలయం వంటి వాటిని ఏర్పాటు చేశారు. 2015లో రూ.40 లక్షల వ్యయంతో శీతల గిడ్డంగిని ఏర్పాటు చేశారు. గతేడాది ఇక్కడ 1.2 లక్షల క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరగగా దాదాపు రూ.30 కోట్లను రైతులకు అందేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఇప్పటికి దాదాపు 15,000 క్వింటాళ్ల వేరుశనగ కొనుగోలు చేసినట్లు డీసీఎంఎస్ బాధ్యుడు శరణ్య తెలిపారు.

వేరుసెనగ కొనుగోళ్లు చేపట్టడం బాగుంది

బొంతిరాళ్ల సుంకన్న, పెద్దపూదెళ్ల



డోన్, ప్యాపిలి విపణుల్లో వేరుసెనగ కొనుగోళ్లు చేపడుతుండటంతో రైతులకు అనువుగా ఉంది. గతంలో దళారులకు అమ్మి సరైన గిట్టుబాటు ధరలు లభించేవి కావు. ప్రస్తుతం విపణిలోనే ప్రభుత్వం మద్దతు ధరలు కల్పిస్తుండటంతో ఇక్కడే విక్రయిస్తున్నాం. భవిష్యత్తులోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఇతర పంట దిగుబడుల విక్రయాలకు మంచి సదుపాయాలు కల్పించాలి.

రూ.80 లక్షలతో ప్రతిపాదనలు

- మురళీకృష్ణ గౌడ్, విపణి ఛైర్మన్



డోన్, ప్యాపిలి విపణుల్లో రూ.5 కోట్ల వరకు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టాం. నూతనంగా రూ.80 లక్షలతో గదుల నిర్మాణానికి, రైతులకు మినరల్ వాటర్ కేంద్రం ఏర్పాటు, జీఎస్ఎల్ ఆర్ ట్యాంకు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఆ పనులు కూడా చేపడతాం. మార్కెట్‌ను అభివృద్ధి చేయాలన్నదే ధ్యేయం. రైతులకు చిన్నచిన్న సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తాం.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్లలోని స్టేట్‌బ్యాంకు సమీపంలో ద్విచక్ర వాహనం వరాహాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. బైటిపేటకు చెందిన రవి, పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్లా కొత్త బస్టాండుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనానికి వరాహం అడ్డు రావడంతో కిందపడ్డారు. గాయపడిన ఇద్దరినీ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అబ్దుల్లాను 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం

డోన్, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మణికంఠ భక్తబృందం సభ్యులు తెలిపారు. అభిషేకాలు, మెట్ల పూజ అనంతరం మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు అందరూ రావాలని కోరారు.

నేటి తాగునీటి సరఫరా ప్రాంతాలు

డోన్, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో బుధవారం పాతపేట, కొండపేట, కొత్తపేట, చిగురుమాన్‌పేట, సుందర్ సింగ్ కాలనీలో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా చేయనున్నారు. తారకరామనగర్‌లోని 17వ వార్డు ప్రాంతాల్లో నీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

కూరగాయల ధరలు

(మంగళవారం నాటి ధరలు)

కిలో రూపాయలలో..

డోన్: టమోటా: 10, మిర్చి: 30, ఉల్లి: 40- 50, కాకర: 40, బెండ: 30, క్యాబేజి: 20, చిక్కుడు: 30, బీన్స్: 40, క్యారెట్: 40, వంకాయ: 20, ముల్లంగి: 30, బీట్రూట్: 40, సొర: 20, దోస: 30, బీర: 30- 40, దొండ: 40, చౌళకాయ: 30, క్యాలీఫ్లవర్: 20- 30, బుడమ: 20, బంగాళదుంప: 20, ఆకుకూరల కట్ట: 03..

తెరపై ఈనాడు

డోన్: **రాజా:** ఎంసీఏ మిడిల్‌క్లాస్ అబ్బాయి, **శ్రీరామా:** ఒక్క క్షణం, **రాఘవేంద్ర:** హలో, **శ్రీనివాస:** 2 కంట్రీస్.

గ్యాస్ సమాచారం

- **డోన్:** పట్టణంలో గ్యాస్ సిలిండర్ల కోసం ఈ నెల 2వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు బుధవారం పంపిణీ చేస్తున్నట్లు భారత్‌గ్యాస్ పంపిణీదారుడు రాజా విజయ్‌కుమార్ తెలిపారు.
- హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల కోసం ఈ నెల 2వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు బుధవారం పంపిణీ చేస్తున్నట్లు పంపిణీదారుడు విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు.

పల్లె కబుర్లు

డోన్ గ్రామీణ, న్యూస్‌టుడే :

- **చిన్నమల్కాపురం:** గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్పంచి రవికుమార్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.
- **ఉడుములపాడు:** గ్రామ సమీపంలోని బాటసుంకులమ్మ ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాలభక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాలికల పాఠశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలి

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్న డిమాండు చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో 1400 మంది విద్యార్థినులకు కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయంపై ఐదునెలల క్రితం మండల కార్యాలయం ఎదుట విద్యార్థినులతో కలిసి ఆందోళన చేపట్టిన సమయంలో మరుగుదొడ్లు నిర్మిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారన్నారు. రూ.5 లక్షల నిధులు కేటాయించి విస్మరించారని, పట్టించుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఏఐఎస్ఎఫ్ డోన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, రంగరత్నం, నాయకులు రాంమోహన్, నాయక్, శీను, మనోహర్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

డోన్, డోన్ గ్రామీణ, న్యూస్‌టుడే : విద్యార్థులు సన్మార్గంలో నడవాలని షీటీం బృందం అధికారి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని యు. కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచితనంతో మెలిగితే సమాజం మంచివైపు పయనిస్తుందన్నారు. ఈవ్‌టీజింగ్ పాల్పడితే కఠిన చట్టాలు ఉన్నాయని, ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకోవాలన్నారు. క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, వాటిపై దృష్టి సారిస్తే మంచి అభివృద్ధి సాధిస్తారన్నారు. షీటీం బృందం సభ్యులు పవన్‌కుమార్, లక్ష్మీ, లక్ష్మీరంగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నైపుణ్యాభివృద్ధి శిక్షణ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, శ్రీటెక్నాలజీ సంస్థల ఆధ్వర్యంలో లాజిస్టిక్స్ సెక్టార్‌లో డాక్యుమెంట్ అసిస్టెంట్ కోర్స్, రీటైల్ సెక్టార్‌లో సేల్స్ అసోసియేట్ కోర్స్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి కోర్సుల్లో ఎస్సీ యువతీయువకులకు రెండునెలల పాటు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు ఎస్సీ నైస్ కంప్యూటర్ నిర్వాహకుడు రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 34 ఏళ్ల లోపువారు శిక్షణకు అర్హులని, శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు అందజేయడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 10లోపు ధ్రువపత్రాలను అందించాలన్నారు.

24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి

డోన్

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి



విద్యార్థుల కథలకు ప్రోత్సాహం

మద్దికెర, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాసే కథలను అచ్చువేయించి ప్రోత్సహిస్తామని గురుజాడ ఫౌండేషన్ కార్యదర్శి, భాషోపాధ్యాయుడు పుల్లా రామాంజనేయులు పేర్కొన్నారు. పెరవలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన కథల ద్వారా జాగృతి, సృజన పేరుతో 2 పుస్తకాలను ముద్రించినట్లు తెలిపారు. సామాజిక అంశాలపై రాసిన కథలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు బృహత్తర కార్యక్రమమైన జన్మభూమిని ప్రవేశపెట్టారని పురపాలక అధ్యక్షురాలు కోట్రికె గాయత్రీదేవి పేర్కొన్నారు. ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పురపాలక పరిధిలోని ఒకటో వార్డుకు సంబంధించి మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ విశ్రాంతి భవనం ప్రాంగణంలో పురపాలక కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. 12వ వార్డులో కౌన్సిలర్ ముమ్మా గోపాల్ అధ్యక్షతన స్థానిక దొరపల్లె రస్తాలోని ప్రాథమిక పాఠశాల దగ్గర సమావేశాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం జన్మభూమితోనే సాధ్యమన్నారు. ఆయా వార్డుల్లో నిర్వహించే జన్మభూమి కార్యక్రమాల్లో వార్డుల్లోని ప్రజలు విరివిగా పాల్గొని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అందించాలని సూచించారు. ఒకటో వార్డులో మొత్తం ఆరు దరఖాస్తులు రాగా రేషన్ కార్డులకు సంబంధించి 2, పింఛను, మరుగుదొడ్డికి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. 12వ వార్డులో రేషన్‌కు 2, పింఛన్లకు 3, స్థలంతో పాటు పక్కాగృహం 2, హౌసింగ్‌కు 6, రోడ్లు, పైపులైన్లు, డ్రైన్స్‌కు సంబంధించి 3 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో 19, 20 వార్డుల కౌన్సిలర్లు కె.ఫణిరాజ్, నాగరాజు, శోభారాణి, పురపాలక, విద్యుత్తు, రెవెన్యూ, సంక్షేమశాఖ, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జన్మభూమి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న పురపాలక అధ్యక్షురాలు, అధికారులు


విశ్రాంతి భవనం ఎదుటగా కుర్చీలు లేక నేలపైనే కూర్చున్న మహిళలు

కుర్చీలు లేక అవస్థలు : జన్మభూమి కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ఒకటో వార్డులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో కుర్చీలు వేశారు. వృద్ధులు, మహిళలు పంచాయతీరాజ్ విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న అరుగుపైన, నేలపై కూర్చోవాల్సిన పరిస్థితి వచ్చింది. మరికొందరు నిల్చునే ఉన్నారు.

నేడు 2, 3 వార్డుల్లో జన్మభూమి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని 2, 3 వార్డులకు సంబంధించి జన్మభూమి కార్యక్రమాలను కొత్తపేట కాలనీలోని ఎరుకల వీధిలోని పాఠశాల వద్ద బుధవారం నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలు ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

నాలుగు గ్రామాల్లో జన్మభూమి

డోన్ గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని యు.కొత్తపల్లె, ధర్మవరం, ఉంగరానిగుండ్ల, కన్నపుకుంట గ్రామాల్లో బుధవారం మాఊరు-జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ క్యాథరిన్ తెలిపారు. యు.కొత్తపల్లె, ధర్మవరం గ్రామాల్లో ఎంపీడీఓ బృందం, ఉంగరానిగుండ్ల, కన్నపుకుంట గ్రామాల్లో తహసీల్దారు బృందం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

గూటుపల్లెలో జన్మభూమి మాఊరు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గూటుపల్లె, తవిశికొండ గ్రామాల్లో బుధవారం జన్మభూమి మాఊరు కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. తవిశికొండకు తహసీల్దార్ అంజనాదేవి, గూటుపల్లె గ్రామానికి నోడల్ అధికారి బృందం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


చిన్నపూదెళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శమంతకమణి

ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి

చిన్నపూదెళ్ల (ప్యాపిలి), న్యూస్‌టుడే: గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని అభివృద్ధి పథకాలు చంద్రబాబు నాయుడు చేపడుతున్నారని, రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందంటే అది చంద్రబాబు కృషివల్లే సాధ్యమైందని ఎమ్మెల్సీ శమంతకమణి, తెదేపా జిల్లా కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, ఎంపీపీ టి.సరస్వతి అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెద్దపూదెళ్ల, చిన్నపూదెళ్ల, వెంగలాంపల్లెలో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డోన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ టి.శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యుడు దిలీప్ చక్రవర్తి, జడ్పీ సీఈఓ ఈశ్వర్, మండల ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ అమృతరాజ్, తహసీల్దారు గోవిందసింగ్, తెదేపా నాయకులు హోసూరు రంగారెడ్డి, కాంతారెడ్డి, శ్రీరాములు, ప్రసాదరెడ్డి, తూర్పు లింగారెడ్డి పాల్గొన్నారు. చిన్నపూదెళ్ల గ్రామంలో జన్మభూమి కమిటీ సభ్యులను సమావేశానికి పిలవలేదని కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్ ఆరోపించారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

డోన్ గ్రామీణ, న్యూస్‌టుడే : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఆవులదొడ్డి, కామగానికుంట్ల, వెంకటనాయునిపల్లెలో జన్మభూమి- మాఊరు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆవులదొడ్డి గ్రామంలో కొంత సేపు రైతులు ఆందోళనకు దిగారు. రెవెన్యూ సిబ్బంది తమ భూములను అంతర్జాలంలో నమోదు చేయటంలేదని ఆరోపించారు. మరోసారి గ్రామానికి వచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు మునికృష్ణయ్య హామీ ఇచ్చారు. ఎంపీడీఓ క్యాథరిన్ ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.


జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చిన్నమల్కాపురం : ఈవో ఆర్డీ మణిమంజరి మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. సర్పంచి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 3 గ్రామాలలో..

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, నార్లాపురం, చెరుకులపాడు గ్రామాలలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో అబ్దుల్ వహీద్ మంగళవారం తెలిపారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో దేవర

అగ్రహారం (మద్దికెర), న్యూస్‌టుడే: గ్రామ దేవత సుంకులమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకొన్నారు. మండలంలోని అగ్రహారం, పెరవలి గ్రామాల్లో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మేళతాళాలతో అమ్మవారికి చీర, సారెలను ఊరేగింపుగా తీసుకువెళ్లి విశేష పూజలు నిర్వహించారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

ఆర్ఎస్‌రంగాపురం (బేతంచెర్ల), న్యూస్‌టుడే: అర్హులైన వారందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమమే జన్మభూమి మాఊరు అని తహసీల్దార్ అంజనాదేవి, జడ్పీటీసీ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్‌రంగాపురం, అంబాపురం గ్రామాల్లో నోడల్ అధికారి వెంకటరమణ, ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.38 లక్షలు, ఎస్సీ కాలనీలో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు జడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. అనంతరం 9 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మద్దిలేటిస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ ఎల్లనాగయ్య, సర్పంచి పెద్దతిమ్మయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వలసల రామకృష్ణ, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ అంజనాదేవి

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు భక్తులు నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకంతో పూజించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జొన్నగిరి, రాంపురం గ్రామాలలో మంగళవారం దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జొన్నగిరిలో నెల్లూరమ్మ, రాంపురంలో పెద్దమ్మ దేవతలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవర సందర్భంగా బంధువులతో ఆయా గ్రామాలు సందడి వాతావరణం నెలకొంది. దేవతలకు బోనాలు సమర్పించుకొనేందుకు గ్రామ ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. దేవర సందర్భంగా గొడవలు చేసుకోవద్దని జొన్నగిరి ఎస్సై నజీర్ అహమ్మద్ సూచించారు.

జన్మభూమితోనైనా దారి బాగుపడేనా

❑ మూడేళ్లయినా పూర్తికాని పంచాయతీ భవనం

గూటుపల్లె (బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని గూటుపల్లెలో రహదారులు గుంతలుపడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామం మొత్తం జనాభా 2456 కాగా గృహాలు 622 ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి, తవిశికొండ గ్రామానికి వెళ్లే రహదారి గుంతలు గుంతలుపడి పాదచారులు నడిచేందుకు వీలులేకుండా ఉంది. రహదారి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం స్పందన లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మురుగునీటితో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట గుంతలు పడ్డాయి. అధికారులు స్పందించి జన్మభూమితోనైనా రహదారి బాగుచేయాలని వారు పేర్కొంటున్నారు. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు కాగా గుత్తేదారుడు పనులు చేపట్టి మధ్యలో నిలిపివేశాడు. ఇప్పటివరకు సుమారు రూ.8 లక్షలు మంజూరు చేయగా రూ.7 లక్షలు చెల్లించాల్సి ఉంది. నిధులు ఉన్నా పనులు పూర్తిచేయడం లేదు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. బోయపేటలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


గూటుపల్లె గ్రామంలో మట్టికుప్పలతో ప్రధాన రహదారి


నిలిచిన పంచాయతీ కార్యాలయ భవనం

యమపాశాలున్నాయి జాగ్రత్త

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల గ్రామంలోని కొత్తబస్టాండులో బస్సులు నిలిచే ప్రాంతంలో విద్యుత్తు తీగలు ప్రమాదంగా ఉన్నాయి. డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ప్రాంగణంలో విద్యుత్తు తీగల కిందే ఆగుతున్నాయి. హమాలీలు బస్సు పైనుంచి సరకు కిందకి దించే క్రమంలో తీగలు తగిలే అవకాశం ఉం. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్సు టాపుపైన ప్రమాదంగా విద్యుత్తు తీగలు

ఎమ్మిగనూరు

ఘనంగా దస్తగిరయ్య ఉరుసు

సిరాలదొడ్డి (ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే : మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో దస్తగిరయ్య ఉరుసు మంగళవారం ఘనంగా జరిగింది. ఉరుసు సందర్భంగా దర్గా వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు నిర్వాహకులు నైవేద్యంతో గ్రామంలో ఊరేగింపుగా వచ్చి దస్తగిరయ్యకు సమర్పించి ప్రార్థనలు చేశారు.

చంద్రన్న బీమా చెక్కు పంపిణీ

గోనెగండ్ల, న్యూస్‌టుడే : గోనెగండ్లలో దర్గాల ఖాజా ఉస్సేన్ భార్య సహజ మరణం చెందారు. మృతురాలు చంద్రన్న బీమా చేయించుకోవడంతో దహన సంస్కారాలకు గాను తక్షణ సాయం కింద భర్తకు రూ.5 వేల చెక్కును మంగళవారం తెదేపా మైనార్టీ నాయకులు నూర్ అహ్మద్, దర్గాల మాబు అందజేశారు.

నిరుద్యోగ భృతి కల్పించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : నిరుద్యోగ భృతి చెల్లించాలని కల్పించాలని ప్రైవేటు అధ్యాపక సంఘం నాయకులు రాఘవేంద్ర, మద్దిలేటి తదితరులు మంగళవారం డోన్ ఉప విద్యాధికారి నాగభూషణానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిబంధనల సాకుతో రోజుకో మాట మార్చడం తగదన్నారు. ఎటువంటి నిబంధనలు లేకుండా ఇచ్చిన హామీ మేరకు తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలని కోరారు.



డోన్ ఉప విద్యాధికారి నాగభూషణానికి వినతిపత్రం అందించిన ప్రైవేటు అధ్యాపకుల సంఘం నాయకులు

పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు అంపన్న డిమాండు చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నూతన డైరీ, కాలమానిని ఎంఈవో వినోద్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం విడుదల చేయించారు. ఈ సందర్భంగా అంపన్న మాట్లాడుతూ డీఎస్సీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న టీటీసీ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రహంతుల్లా, శ్రీనువాసులు, రఘు, ఖాదర్‌బాషా, విశాంత్ర ఉద్యోగి బావిగడ్డ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడివన్న డిమాండు చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 2018 నూతన కాలమానిని మండల విద్యాధికారి వినోద్‌కుమార్ చేత విడుదల చేయించి మాట్లాడారు. రెండు డీఏలు, 2010 పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. నరసన్న, రామచంద్ర, రఫీ తదితరులు పాల్గొన్నారు

టౌన్ బ్యాంకు ఎన్నికలు వాయిదా వేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : టౌన్ బ్యాంకు ఎన్నికలు మూడు నెలలు వాయిదా వేయాలని టౌన్ బ్యాంకు జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు జేమ్స్, రాజు, రమేష్ కోరారు. ఈ మేరకు వారు స్థానిక టౌన్ బ్యాంకులో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా కలెక్టర్, జిల్లా సహకార సంఘాల అధికారికి ఫిర్యాదు చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు. అనంతరం జేమ్స్ మాట్లాడుతూ టౌన్ బ్యాంకులో అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై ప్రచార కర పత్రాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. బ్యాంకులో ఉన్న ఓటర్లను కొందరు అనవసరంగా తొలగించారని విమర్శించారు. బ్యాంకులో 5వేల మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో చాలా మందికి అర్హత లేదని సాకు చూపిస్తూ తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో శంకరన్న, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా కుడి కాల్వ పనులు



సోమలగూడూలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

నందవరం, న్యూస్‌టుడే : రైతుల పాలిట కల్పతరువుగా భావించే రాజోలిబండ కుడి కాల్వ పనులను త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కుడి కాల్వకు సంబంధించిన సర్వే పనులు రూ.3 కోట్లతో పూర్తి చేశామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. తెదేపా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతున్నాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రూ.3 కోట్లకు పైగా రహదారులు నిర్మించామన్నారు. అలాగే తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మూడేళ్లలో దాదాపు రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేశామని వివరించారు. జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో రెండేళ్ల క్రితం నిర్మించుకున్న మరుగుదొడ్లకు ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి ముగిసేలోపు బిల్లులు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు పుష్పావతి, ఎంపీపీ నరసింహ రెడ్డి, తెదేపా జిల్లా నాయకులు నాగరాజ్ గౌడ్, రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జన్మభూమి

కున్నూరు (గోనెగండ్ల), న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండలం నోడల్ అధికారి మురళీ కృష్ణ తెలిపారు. కున్నూరు, లింగందిన్నె గ్రామాల్లో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మొదట ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించి గ్రామ ప్రజల చేత అధికారులు జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. అనంతరం చంద్రన్న బీమా లబ్ధిదారులకు మంజూరైన రూ.1.80 లక్షలు, 53 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు రూ.65,600 నోడల్ అధికారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, తహసీల్దారు బాలగణేష్, సర్పంచులు లింగన్న, మద్దమ్మ, తెదేపా నాయకులు సుంకన్న, వెంకటేశ్వర్ రెడ్డి, రమణ, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



కున్నూరులో చంద్రన్న బీమా పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న మండల నోడల్ అధికారి మురళీకృష్ణ

☛ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఐదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాల ప్రధానాచార్యులు జయరామిరెడ్డి మంగళవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలలో రోజు వారిగా జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు పేర్కొన్నారు. మొదటి రోజు సంక్షేమం సంతృప్తి అనే అంశం గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు సురేష్, ఎల్లప్ప, నాయక్, దాసు, చందు, సునీత తదితరులు పాల్గొన్నారు.

☛ **ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి అని పురపాలక ఛైర్‌పర్సన్ సాయ సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని 1, 2వ వార్డుల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పింఛన్లు రూ.200 నుంచి రూ.1000 పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కిందన్నారు. పట్టణంలో జీప్లస్ త్రీ ఇళ్లు, ప్రతి వాడలో సీసీ రోడ్లు, విద్యుత్తు సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు కొండయ్య చౌదరి, పురపాలక కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు నాగేష్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు.

దైవందిన్నె (ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే : జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దైవందిన్నెలో మంగళవారం నిర్వహించిన జన్మభూమిలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శంకరయ్య, నోడల్ అధికారి ప్రసన్నకుమార్, ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తెదేపా నాయకులు ప్రతాప్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డులో జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న పురపాలక ఛైర్‌పర్సన్ సాయ సరస్వతి, అధికారులు, తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేత విద్యార్థినులను అభినందిస్తున్న పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు కొండయ్య చౌదరి, తదితరులు


ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి, పోలీసు, తదితర ఉద్యోగాల్లో కోటాకు ఎంతో దోహదపడతాయని పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు కొండయ్యచౌదరి అన్నారు. ఆదోని డివిజన్ బాలికల పోటీలు ఇటీవల మంత్రాలయంలో జరిగాయి. ఇందులో భాగంగా జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎమ్మిగనూరులోని వీవర్స్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. దీనిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. దీనికి కొండయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

జలసిరి రైతులకు వరం

నందవరం, న్యూస్‌టుడే : రైతులకు ఎన్టీఆర్ జలసిరి వరమని తెదేపా మండల యువ నాయకులు బండె షప్ప అన్నారు. మండల పరిధిలోని పూలచింతలో మంగళవారం జలసిరి ద్వారా 12 బోర్లను వేశారు. అయితే 7 చోట్ల నీరు పడ్డాయని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డికి పూలచింత రైతులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారన్నారు.

వైభవంగా దస్తగిరి స్వామి ఉరుసు

పెద్దనెలటూరు (గోనెగండ్ల), న్యూస్‌టుడే : మండలంలో పెద్దనెలటూరులో వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. దర్గా ముజావర్లు ఊరేగింపుతో వచ్చి గంధం సమర్పించారు. అనంతరం భక్తులకు గంధం పంచిపెట్టారు. కుల మతాలకు అతీతంగా గ్రామ ప్రజలు ఉరుసును జరుపుకొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఉరుసుకు హాజరై స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



దర్గా వద్ద భక్తులు

ఎమ్మిగనూరు

తెరపై ఈనాడు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : మినీశివ : ఎంసీఏ, శివప్రియ : ఒక్క క్షణం, రాఘవేంద్ర : 2 కంట్రీస్, అబ్బాస్ : టెన్, లక్ష్మణ్ : రాజా ది గ్రేట్, శివ : ప్రాజెక్టు జెడ్ (తెలుగు), మినీశ్రీనివాస : హలో, శ్రీనివాస : జవాన్.

మాంసం ధరలు (కిలో..రూల్లో) : కోడి మాంసం (వెంకాబ్) 140, మాంసం : 480, గుడ్లు డజన్ : 55.

కమనీయం నీలకంఠుడి కల్యాణోత్సవం

- పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే బీవీ దంపతులు
- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : శ్రీనీలకంఠేశ్వర కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఎమ్మిగనూరు పట్టణంలో వెలసిన శ్రీ నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పట్టు వస్త్రాలను స్వామి అమ్మవార్లకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వ రెడ్డి దంపతులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. పరమేశ్వరుడి, పార్వతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పుష్ప రథోత్సవంపై ఆశీనులను చేసి మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. పట్టణ పురవీధుల గుండా శ్రీరామ స్వామి ఆలయం వరకు రథం లాగి అక్కడ పూజలు చేసి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సం జరిపారు. పరమేశ్వరుడి తరపున గడిగ వంశస్థులు, పార్వతీ తరపున బండ వంశస్థులు పెళ్లి పెద్దలుగా కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో రామాంజనేయులు, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మాచాని నీలకంఠప్ప, నాగరాజు, పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం



పట్టు వస్త్రాలను తెస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దంపతులు

జాతరకు ఎమ్మిగనూరు ముస్తాబు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : శ్రీనీలకంఠేశ్వర స్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణాన్ని పురపాలక అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. సోమప్ప, శకుంతల కూడలి, పార్కు, కూరగాయల మార్కెట్, సోమేశ్వర, ఓంశాంతి, అన్నమయ్య కూడలిలో ప్రధాన రహదారుల్లో విద్యుత్తు దీపాలతో అలంకరించారు.


పుష్ప రథోత్సవంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు


సోమప్ప కూడలిలో విద్యుత్తు దీపాలతో ముస్తాబు


శ్రీనీలకంఠేశ్వరుడికి ఆకుపూజ, వెండి అభరణాలతో అలంకరణ

రథానికి కలశ పూజ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మంగళవారం ధర్మకర్త మాచాని నీలకంఠప్ప నాగరాజు అధ్వర్యంలో మహిళలు కలశాలు, గొడుగుతో రథం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం కలశ, గొడుగు పూజ నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రముఖులకు ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందజేశారు.


కలశాలతో రథం ఎదుట మహిళలు

కూరగాయల ధరలు (కిలో..రూల్లో) (నిన్నటివి)

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : టమోటా 7, వంకాయ 15, బెండ 25, ఆలుగడ్డ 30, బీన్స్ 45, క్యారెట్ 40, దోసకాయ 30 బీర 35, బీట్రూట్ 35, దొండ 22 ఉల్లిగడ్డ 42, గోబీపువ్వు 40 పచ్చిమిరప 22, చౌళికాయ 25.

నియోజకవర్గ అధికారుల చరవాణి సంఖ్యలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే :

ఏసీబీ డీఎస్పీ :	94404 46178
ఎమ్మిగనూరు సీఐ :	91211 01146
పురపాలక కమిషనర్ :	98499 05861
ఎమ్మిగనూరు తహసీల్దార్:	98499 04177
ఎంపీడీవో :	97042 34607
వ్యవసాయ శాఖ ఏడీఏ :	88866 13944
విద్యుత్తు ఏడీఈ :	94408 13340
నీటి పారుదల శాఖ డీఈ :	98906 10409
పురపాలక డీఈ :	98499 06657
పంచాయతీ రాజ్‌డీఈ :	88861 11531
ఆర్అండ్‌బీ డీఈ :	94408 18399
ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ :	91001 22590
ఎమ్మిగనూరు టౌన్ ఎస్సై :	91211 01147
గ్రామీణ ఎస్సై :	91211 01148
ట్రాఫిక్ ఎస్సై :	91211 01149
నందవరం ఎస్సై :	91211 01150

సామాజిక సేవ వైపు మొగ్గు చూపాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : సామాజిక సేవ వైపు యువత మొగ్గు చూపాలని సీఐ ప్రసాద్ తెలిపారు. స్థానిక వైష్ణవి కళాశాల విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవద్దంటూ ప్రచారం చేయడంతో పాటు ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవద్దని సూచించారు. వారికి ఏ రంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలో ప్రోత్సహించాలన్నారు. ఒత్తిడితో మానసికంగా కుండిపోవడం తప్ప ఎలాంటి ఫలితం ఉండదన్నారు. విద్యార్థులు సైతం కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. చదువుతూ సామాజిక రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. దేశ సేవలో యువత పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.


దేశభక్తి గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిత్యావసర సరకులు ధరలు (కిలో..రూల్లో)

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : సోనామసూరి బియ్యం 35, పాతవి 42, తెల్లజొన్నలు 44, హైబ్రీడ్ జొన్నలు 25, ఎండు మిరపకాయలు 100, సజ్జలు 18, కొర్రబియ్యం 42, వేరుసెనగ నూనె (లీటరు) 115, చక్కెర 41, బెల్లం 52, ఉప్మారవ్వ 32, బాంబేరవ్వ 32, గోధుమపిండి 41, మైదాపిండి 40, పప్పులు 108, వేరుసెనగ విత్తనాలు 75, వెల్లుల్లి 60.

పింఛన్ల పంపిణీపై విచారణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : పింఛన్లు పంపిణీపై డీఆర్‌డీఏ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా సూపరింటెండెంట్ జిలాని పట్టణంలోని లక్ష్మీపేట, ఇందిరానగర్ కాలనీల్లో పర్యటించి వృద్ధాప్య, వింతతు, చేనేత పింఛన్లపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల వేలి ముద్రలు వేసి పింఛన్లు పంపిణీ చేయడంపై తాము విచారణ చేసినట్లు చెప్పారు. ఈయన వెంట కన్వీనర్ జీవన్‌రాజు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ జిల్లా సూపరిండెంట్ జిలాని

రహదారుల అభివృద్ధికి వీడని గ్రహణం

- కొన్నేళ్లుగా కొత్త దారికి నోచుకోని వైనం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : రవాణా సౌకర్యం మెరుగుపరచాలంటే రహదారులు బాగుండాలి. అప్పుడే గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయి. అయితే అడుగడుగునా గుంతలతో ఉన్న దారులతో పల్లె ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎన్ని సార్లు అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినా అవి దస్త్రాలకే తప్ప పైసా నిధులు రాల్చడం లేదు. దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. ఎమ్మిగనూరు - కోసిగి రహదారి (వయా పల్లెపాడు) 30 కిలోమీటర్లు ప్రయాణించాలి. ప్రధానంగా ఎమ్మిగనూరు కీలకం కావడంతో ఈ దారిలో రోజుకు 40 బస్సు సర్వీసులు, లారీలు, ఆటోలు నిత్యం తిరుగుతున్నాయి. మాలపల్లె పల్లెపాడు మీదుగా పది కిలోమీటర్ల మేర 2002లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్యాచ్‌లు తప్ప నేటికీ కొత్త రహదారికి మోక్షం లభించలేదు. పైపై పూసిన పూతలు మున్నాళ్లకే పోయి గుంతలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా ఈ మార్గంలో ప్రయాణం నరకయాతనగా మారింది. ఇక ఎమ్మిగనూరు - ఉరుకుంద, కౌతాళం రహదారి అధ్వానంగా ఉంది. 20 కిలోమీటర్లు దెబ్బతింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించలేక ప్రజలు, ప్రయాణికులు వ్యయప్రయాసలు పడుతున్నారు. రాత్రిళ్లు గుంతలు కన్పించక వాహనాలు అదుపు తప్పి కిందపడుతుండటంతో చోదకులు, ప్రయాణికులు గాయపడుతున్నారు. రోడ్లు భవనాల శాఖ డీఈ శ్రీధర్ రెడ్డిని వివరణ కోరగా..ఇప్పటికే చాలా సార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదన్నారు. నిధులు విడుదలైన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు.


ఎమ్మిగనూరు- కోసిగి రహదారి దుస్థితి


ఎమ్మిగనూరు- ఉరుకుంద- కౌతాళం రోడ్డు

కోడుమూరు

ఘనంగా ఎల్లమ్మకు పూజలు

వెంకాయపల్లె(కర్నూలు గ్రామీణ), న్యూస్‌టుడే: నగర శివారులోని వెంకాయపల్లె సమీపంలో మంగళవారం ఎల్లమ్మకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మకు వివిధ రకాల, పూలు, పండ్లు సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అమ్మకు ముడుపులు చెల్లించుకున్నారు.

ఊరూరా చైతన్యం.... కదిలిన జనం

● జన్మభూమి మా ఊరు ప్రారంభం ● సమస్యలపై వినతులిచ్చిన జనం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు గ్రామసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సి.బెళగల్ మండలం కొత్తకోటలో ఎమ్మెల్యే మణిగాంధీ, గూడూరు మండలం కొణిదేడులో తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో జనం హాజరైన తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులు సమర్పించారు. అంతర్జాలంలో నమోదుచేసి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు, గూడూరు మండలాల్లో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం: కోడుమూరు
గ్రామాలు: అనుగొండ, ఆమడగుంట్ల
పాల్గొన్న ప్రముఖులు: నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి
ఏం జరిగింది: ముఖ్యమంతి సందేశాన్ని టీవీ ద్వారా ప్రజలకు చూపించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. గర్భిణులకు ఐసీడీఎస్ సిబ్బంది సీమంతం నిర్వహించారు. రేషన్ కార్డులు, ఉపకార వేతనాలను పంపిణీ చేశారు.
పాల్గొన్నవారు: ఎంపీడీవో ఆదెయ్య, తహసీల్దారు రామకృష్ణ, ఏంఈవో అనంతయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున, స్థానిక నాయకులు పెద్దయ్య, వెంకటేశ్వర్లు, మాదన్న, మాలింగన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.
జన్మభూమి నేడు: మండలంలోని వెంకటగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జన్మభూమి మా ఊరు నిర్వహిస్తారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

మండలం: గూడూరు
గ్రామం: నగర పంచాయతీ 1,2వ వార్డులు, బూడిదపాడు
హాజరైన ప్రముఖులు: విష్ణువర్ధన్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఇందిరసుభాషిణి, కమిషనర్ నయీంఅహ్మద్
ఏం జరిగింది: రైతులు ఇబ్బంది పడకుండా దిగువ కాలువ నీరిస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. బూడిదపాడు, కె.నాగులాపురం, పెంచికలపాడు గ్రామాలకు రూ.1.3కోట్లతో నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. 14మందికి రేషన్ కార్డులు అందజేశారు. కొత్తగా బియ్యం కార్డులు, బీమా పథకం కింద సాయం అందజేశారు.
పాల్గొన్న వారు: ఈ కార్యక్రమంలో కరుణాకర రాజు, వెంకటేశ్వర్లు, ఏసన్న, నాగజ్యోతి, నరేష్, కృష్ణ జయన్న, రఘునాథ్ అధికారులు బాలవెంకటరెడ్డి, ప్రసాద్, విజయరాణి

- న్యూస్‌టుడే, గూడూరు, గూడూరు గ్రామీణ



ఆర్థిక సాయం అందజేస్తున్న నోడల్ అధికారి, విష్ణువర్ధనరెడ్డి, తదితరులు



గొందిపర్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు వెంకటరమేష్‌బాబు

మండలం: కర్నూలు
గ్రామాలు: దేవమడ, గొందిపర్ల
పాల్గొన్న ప్రముఖులు: ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి
ఏం జరిగింది: లబ్ధిదారులకు పింఛను, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అధికారులు వివిధ సమస్యలపై వినతులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రజలు, మహిళల నుంచి పలు వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అధికారులు వివరించారు.
పాల్గొన్నవారు: ఈవోఆర్డీ రఘునాథ్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.నాగరాజు, సర్పంచి లక్ష్మీదేవి

మండలం: సి.బెళగల్
గ్రామాలు: కొత్తకోట
హాజరైన ప్రముఖులు: ఎమ్మెల్యే మణిగాంధీ, ప్రత్యేకాధికారి మల్లికార్జున, కొత్తకోట ప్రకాష్‌రెడ్డి
ఏం జరిగింది: పాఠశాలల్లో ప్రహరీలకోసం రూ.6.20 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొత్తకోట రహదారికి నిధులిచ్చామని తెలిపారు. ఈర్లదిన్నెలో ఇళ్లపట్టాలివ్వాలని స్థానికులు కోరారు. కోర్టు తాఖీదులు జారీచేసినా పోలీసులు స్పందించలేదని ప్రకాష్‌రెడ్డి అన్నారు. 135మందికి చంద్రన్న కానుకలు అందజేశారు. ఇద్దరు రైతులకు ట్రాక్టర్లు అందజేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు.
పాల్గొన్నవారు: నాయకులు వెంకట్రామిరెడ్డి, సత్రం రామకృష్ణ, అయ్యపరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, పాండురంగన్న, అధికారులు సురేంద్ర, ప్రసాదరావు, అన్వర్‌హుస్సేన్, సిద్ధలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, సి.బెళగల్



రైతుకు ట్రాక్టరు అందజేస్తున్న ఎమ్మెల్యే మణిగాంధీ

130మందికి ఉచిత వైద్యసేవలు

వెంకటగిరి, ముడుములగుర్తి(కోడుమూరు గ్రామీణ), న్యూస్‌టుడే: చంద్రన్న సంచార వైద్య చికిత్స కింద 130 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వెంకటగిరి, ముడుములగుర్తి గ్రామాలలో మంగళవారం చంద్రన్న సంచార చికిత్స ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, ఫార్మాసిస్టు నూర్‌బాషా, సాంకేతిక సహాయకురాలు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కోడుమూరు గ్రామీణ, న్యూస్‌టుడే: (కిలో రూ.లలో) టమోట 10, ఉల్లి 40, ఆలు 30, వంకాయలు 30, కాకర 40, బెండకాయలు 40, చిక్కుడు 60, ముల్లంగిగడ్డ 40, చౌళికాయలు 50, బీరకాయలు 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 50, క్యాబేజి 40, మునక్కాయలు 180, కాలీ ఫ్లవర్ 40, పచ్చిమిర్చి 40, క్యాప్సికం 50, దోసకాయలు 50, దొండకాయలు 40, అల్లం 60, బీన్సు 40, నిమ్మకాయలు(డజను) 24.

జన్మభూమి వినతులు..అంతర్జాలంలో నమోదు

గూడూరు, న్యూస్‌టుడే: జన్మభూమి వినతులను అంతర్జాలంలో నమోదు చేయాలని తహసీల్దారు శివశంకర్‌నాయక్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం మీసేవ నిర్వాహకుల సమావేశం నిర్వహించి చేయాల్సిన పనులను వివరించారు. ప్రధానంగా జన్మభూమిలో వినతులను శాఖల వారీగా పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పై రామలక్ష్మి, ఉప తహసీల్దారు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు (కిలో రూ.లలో): పొట్టేలు 440, కోడి 160, చేపలు 130, కోడి గుడ్లు(డజను) 72.

వాహనాల తనిఖీ

కె.నాగులాపురం(గూడూరు), న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగులాపురం ఎస్సై మల్లికార్జున మంగళవారం కర్నూలు, బళ్లారి రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. 90మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.20,560 జరిమానా వసూలు చేశారు. వాహనాలను అతివేగంగా నడపడం, మద్యం తాగి వాహనాలు నడుపడం చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాద నివారణకు తోడ్పడాలని ఎస్సై మల్లికార్జున వాహనచోదకులతో అన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మల్లికార్జున

యూటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ


కోడుమూరు, న్యూస్‌టుడే: మండలంలో యూటీఎఫ్ కాలమానిని, దైనందినిలను కోడుమూరు ఎంపీపీ నాగిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి అనంతయ్య, జడ్పీ బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస యాదవ్, నీలకంఠ, వీరనారాయణమ్మ, ఉమాదేవి, తాజుద్దీన్, నవీన్ పట్నాయక్, తాజుద్దీన్, నవీన్ పట్నాయక్, సామేలు పాల్గొన్నారు.



కాలమానిని, దైనందిని ఆవిష్కరించిన ఎంపీపీ నాగిరెడ్డి

ఘనంగా దస్తగిరయ్య ఉరుసు

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలో దస్తగిరియ్య మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పడమటి వీధిలోని నూరు మహమ్మద్ స్వగృహం నుంచి గంధం మోస్తూ పురవీధులగూండా మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చారు. బాణసంచా కాలుస్తూ దర్గా చేరుకుని నూతనంగా అమర్చిన దస్తగిరయ్య జెండాకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫకీర్ల విన్యాసం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దస్తగిరయ్య దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం కీస్తీ కార్యక్రమంతో ముగింపు పలుకుతున్నట్లు నిర్వాహకులు ఇ.చిన్నఈరన్న గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గ్రామ పుర వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

కోడుమూరు

విద్యార్థికి మంత్రి ప్రశంసలు

కోడుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థి ఉపేంద్ర యోగలో ప్రతిభ చూపడంతో ప్రధానా చార్యులు ధనలక్ష్మి అభినందించారు. విశాఖ జిల్లా సింహపురిలో జరిగిన కార్యక్రమంలో యోగాలో చక్కటి ప్రదర్శన ఇచ్చినందుకు ఆయన ముగ్ధుడై అభినందించినట్లు వ్యాయామోపాధ్యాయుడు రాజు తెలిపారు.

కర్నూలు సర్వజన ఆస్పత్రి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : నగరంలోని సర్వజన వైద్యశాలకు జిల్లా నలుమూలల నుంచి మంగళవారం 1,900 మంది ఓపీకి వచ్చారు. వీరిలో 150 మంది వివిధ చికిత్సల నిమిత్తం చేరారు. న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, ఊపిరితిత్తుల విభాగంతోపాటు అన్ని సాధారణ జబ్బులకు బుధవారం ఓపీ ఉంటుంది.

ఇంకెన్నాళ్లు.. నీటి కష్టాలు

తాగునీరు కరవు, బోరు నీరే దిక్కు

ప్యాలకుర్తి(కోడుమూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఏ కాలమైనా నీటి కష్టాలు యథాతథం. ఎన్ని పథకాలున్నా నిరుపయోగంగా మారుతున్నాయి. వేల జనాభా పల్లెలో ఉన్నా.. తాగ డానికి గుక్కెడు నీరు కరవు. నిధులన్నీ కరిగిపోయినా చుక్కనీరు రావడం లేదు. ప్యాలకుర్తి గ్రామస్థులు నీటిపోరాటం చేస్తున్నా ఫలించడం లేదు.



బిందె నీటి కోసం గుమ్మిగూడిన జనం



సైకిల్‌పై నీళ్లను తీసుకెళ్తున్న గ్రామస్థుడు

మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో తొమ్మిదివేల మంది నివాసముంటున్నారు. వీరికి నీటి సదుపాయం కల్పించేందుకు లక్షల రూపాయలు ఖర్చుచేసి రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. అయినా వాటి నుంచి ఇప్పటి వరకు చుక్కనీరు రాలేదు. గ్రామంలోని ప్రధాన వీధి, ఎస్సీ వీధి, ఒకటో వార్డులోని ట్యాంకులకు నీటి సరఫరా లేకపోవడంతో కుళాయిలు వృథాగా పడి ఉన్నాయి. నీటి సరఫరా గొట్టాలు దెబ్బతిన్నాయి. దాంతో గ్రామంలోని పొలంలో వేసిన బోరు నుంచి మెయిన్ బజారు బావిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. అదీ అంతంత మాత్రమే. మరో బోరు నుంచి నీటి ఊట తక్కువగా ఉంది. విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడు మాత్రమే నీరు అందిస్తున్నారు.

పొలం నీళ్లు అమ్ముకుంటున్నారు

సుంకేసుల జలాశయం వద్ద ఏర్పాటు చేసిన నంద్యాల నీటి పథకం నుంచి గ్రామానికి నీటి సరఫరా చేయాల్సి ఉంది. గతంలో నీళ్లు వచ్చేవి. గూడూరు నగర పంచాయతీ అయిన తరువాత ఆ ఊసే లేదు. దాంతో ఎస్సీ వీధిలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు సరఫరా నిలిచిపోయింది. మెయిన్ బజారులో ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన మరో ఓవర్‌హెడ్ ట్యాంకుకు సైతం అక్కడి నుంచి నీటి సరఫరా చేయాల్సి ఉంది. నీరు రాకపోవడంతో రెండు నీటి పథకాలు వృథాగా మారాయి. ఇదే అదనుగా చేసుకున్న గ్రామంలో వ్యక్తులు పొలంలోని నీటిని తెచ్చి విక్రయిస్తున్నారు.

పొలాలకెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం

- మద్దయ్యగౌడ్, ప్యాలకుర్తి



బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో పొలాలకెళ్లి తెచ్చుకుంటున్నాం. రూ.10కే నాలుగు బిందెల నీరు కొంటున్నాం. శుద్ధ జలం కాకపోయినా డబ్బు పెట్టి కొనాల్సి వస్తోంది. నాలుగు బోర్లు సక్రమంగా పనిచేయక పోవడంతో ఇబ్బందిగా మారింది. నంద్యాల నీటి పథకం నుంచి నీళ్లు వస్తే సమస్య తీరుతుంది.

జేబులు నింపుకోవడానికే పథకాలు

- నజీర్‌అహ్మద్, వార్డు సభ్యుడు, ప్యాలకుర్తి



గ్రామంలోని ఎస్సీ వీధిలో ఓవర్ హెడ్ ట్యాంకు ఉండేది. ఒకప్పుడు ఆ ట్యాంకుకు నంద్యాల నీటి పథకం నుంచి అరకొరగా నీరు వచ్చేది. మెయిన్‌బజారులో మరో ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులంతా ఆనందించాం. మంచినీటి కరవు ఉండదనుకున్నాం. అది అలంకార ప్రాయంగా నిలిచిపోయింది. జేబులు నిండినా బిందెలకు నీరు రాలేదు.

సి.క్యాంపు రైతుబజారు ధరలు (నిన్నటివి)

కర్నూలు నగరం, న్యూస్‌టుడే (కిలో రూ.లలో) : టమోట 5, వంకాయ 14-16, బెండ 24, మిర్చి 22, కాకర 28, బీర 24 ,కాలీఫ్లవరు 24, క్యారెట్ 44, క్యాబేజి 16, బీన్స్ 32, దొండ 18, ఆలు 20, ఉల్లి 30-36, చౌళ 24, బుడంకాయ 10, సొర 10, దోస 16, చిక్కుడు 20,అల్లం 58, కాప్సికం 40.

తెరపై ఈనాడు

కర్నూలు బీక్యాంపు, న్యూస్‌టుడే : ఐనాక్స్ సినీ కాంప్లెక్స్: టైగర్ జిందా హై, జ్యామాంజి (తెలుగు, ఇంగ్లిషు), ప్రాజెక్ట్-జెడ్, ది గ్రేటెస్ట్ షో మ్యాన్, వి సెల్యూలాయిడ్స్ **ఆనంద్ సినీ కాంప్లెక్స్:** ఎంసీఏ మిడిల్ క్లాస్‌అబ్బాయి, టూ కంట్రీస్, హలో, టైగర్ జిందా హై, జ్యూమాంజి (తెలుగు, ఇంగ్లిషు), **భరత్ సినీ కాంప్లెక్స్ :** ఒక క్షణం, ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి, టూ కంట్రీస్ రాజ్: మిడిల్ క్లాస్ అబ్బాయి, **శ్రీరామ:** హలో.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మ విశ్వాసంతో ఎదగాలని ప్రధానోపాధ్యాయిని విజయమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సాయి ఎడ్యుకేషన్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటి, సేవ్ ద చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వ ర్యంలో స్థానిక మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విజయమ్మ, సెరూడ్స్ స్వచ్ఛంద సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి గోర్ల మల్లికార్జునలు మాట్లా డుతూ బాలికలు తమ సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, అనిత, బాషా,. జ్ఞానేశ్వరి, అఖిల్, లాజర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని విజయమ్మ

గోరంట్ల పాఠశాల విజయం

కోడుమూరు: విశాఖ జిల్లా సింహపురిలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో అంతర్ గురుకుల పాఠశాలల మధ్య నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీలలో మండలంలోని గోరంట్ల గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రధానాచారిణి ధనలక్ష్మి తెలిపారు. గతంలో రాష్ట్ర స్థాయిలో రన్నర్స్‌గా వరుసగా రెండు సంవత్సరాలు పాఠశాలకు ఖ్యాతిని తెచ్చిన విద్యార్థులను ఆమెతోపాటు, ఉపాధ్యాయులు అభినందించారు. గతంలో కోడుమూరు జోనల్ పోటీలలో హ్యాండ్‌బాల్ నందు విద్యార్థులు వరుసగా విజేతలుగా నిలిచినట్లు వ్యాయామోపాధ్యాయుడు రాజు తెలిపారు.



ప్రధానాచార్యులతో హ్యాండ్‌బాల్ విజేత జట్టు



సింహపురిలో పతకం అందుకుంటున్న గోరంట్ల గురుకుల విద్యార్థులు

ఆలయ సత్రం.. వివాదాస్పదం

గోరంట్ల (కోడుమూరు), న్యూస్‌టుడే: ఆలయంలోని ఓ సత్రాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి మరమ్మతులు చేసి బోర్డు తొలగించడం వివాదాస్పదంగా మారింది. ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్నాడంటూ గ్రామస్థులు ఆలయ ఈవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన పరిశీలించి హెచ్చరించారు. కోడుమూరు మండలంలోని గోరంట్ల మాధవస్వామి ఆలయానికి సత్రాలున్నాయి. వాటిలో ఒక సత్రాన్ని మంగళ వారం ఓ వ్యక్తి మరమ్మదు చేయించారు. సత్రానికే ద్వారం ఏర్పాటు చేసి.. దేవస్థానం బోర్డును తొలగించారు. దీంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవో పరిశీలించారు. భక్తులకోసమే మరమ్మతులు చేయించామని అందులో ఉన్న యుగంధర్ అనే వ్యక్తి తెలిపారు. సత్రాలను దాతలు బాగుచేసి తమకు అప్పగించారని, అన్నీ దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్నాయని తెలిపారు.



సత్రాన్ని పరిశీలిస్తున్న ఆలయం ఈవో

పురుగుమందు తాగి యువకుడు మృతి

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని సి.బెళగల్ చెరువు సమీపంలో మల్లేష్(27) పురుగుమందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. సంఘటనా వివరాలిలా ఉన్నాయి. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన మల్లేష్ సోమవారం ఇంట్లో చెప్పకుండా సి.బెళగల్ గ్రామానికి చేరుకున్నారు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గత నెలలో జరిగిన ప్రమాదంలో తలకు గాయాలై మతి స్థిమితం కోల్పోయినట్లు బంధువులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య సువర్ణ, కుమార్తె ఉన్నారు.

6న శత వసంతాల పండగ

కర్నూలు నగరం, (కల్చరల్) న్యూస్‌టుడే : తిరుపతి వేంకటకవులు రచించిన 'శ్రీకృష్ణరాయభారం (జెండాపై కపిరాజు) నాటకం రాసి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తెలుగు కళాకారులు 'శతవసంతాల పండగ'ను నిర్వహిస్తున్నారు. కర్నూలులోని 'టిజీవీ కళాక్షేత్రంలో 'జెండాపై కపిరాజు (శ్రీకృష్ణరాయభారం లోని పద్యాలు) రంగస్థల పద్యపఠన పోటీలు 6 తేదీ ఉదయం 10 నుంచి నూరేళ్ల పండగ, ఏకపాత్ర పద్యపోటీలు ప్రారంభమవుతాయని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి బాలవెంకటేశ్వర్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల కళాకారులు 90004 93683 నంబరులో సంప్రదించాలని కోరారు. జనవరి 1వ తేదీ నిర్వహించాల్సిన పద్యపోటీలను 6వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 6వ తేదీ సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో శ్రీకృష్ణరాయభారంలోని 'పడకసీను' నాటక ప్రదర్శన ఉంటుందని ఆయన చెప్పారు.

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

కర్నూలు క్రీడలు : నగరంలోని జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో జాతీయ యువ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రాయలసీమ జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఏర్పాటుచేసినట్లు తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్టేడియంలో పోటీల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఇక్కడ ప్రతిభ చూపినవారు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయస్థాయిలో స్పోర్ట్స్ వసతిగృహంలో చేరేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చదరంగం పోటీలు 7న

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో 7వ తేదీ ఉదయం 8 కేవీఆర్ కళాశాలలో ఓపెన్ ప్రైజ్‌మనీ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు అడ్‌హాక్ కమిటీ ఛైర్మన్ వి.సత్యనారాయణరావు మంగళవారం తెలిపారు. లీగ్‌కమ్ పద్ధతిలో జరిగే పోటీలు అంతర్జాతీయ చదరంగం నియమావళి ప్రకారం జరుగుతాయన్నారు. క్రీడాకారులు చదరంగం కిట్‌తో నేరుగా పోటీల్లో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 99518 00650ను సంప్రదించాలని కోరారు.

కర్నూలు

24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి



అక్రమార్కులకు అ'ధనమే'!

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల ఏర్పాటు
- నగరపాలక సంస్థపై ఆర్థిక భారం
- సిఫార్సులకు అధికారుల పెద్దపీట



జమ్మి చెట్టు వద్ద నుంచి చెత్తను తరలిస్తున్న టిప్పరు

నగరపాలక పరిధిలో వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి మాట దేవుడెరుగు కాని.. చెత్త నుంచి కాసులు పండిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అధిక చెత్త ఉత్పత్తి పేరుతో అదనపు వాహనాలను నిబంధలకు విరుద్ధంగా ఏర్పాటు చేయటం కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇలాంటి తప్పిదమే జరిగి బిల్లుల చెల్లింపులో పలు అభ్యంతరాలు ఉత్పన్నమై బిల్లులు ఆగిపోయాయి. పూర్వ అనుభవంతో గుణపాఠం నేర్చుకోని కార్యాలయ వర్గాలు తెగింపు ధోరణితో అదనపు వాహనాలకు అనధికారిక అనుమతులు ఇచ్చేశాయి. ఇప్పటికే నగరపాలక పరిధిలో సరిపడా సిబ్బంది, వాహనాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. ఈ అదనపు వాహనాల ఏర్పాటు ఎవరి కోసం అన్నది అందరినీ వేధిస్తోంది. - న్యూస్‌టుడే-కర్నూలు (నగరపాలకసంస్థ)

కర్నూలు నగరంలో 5 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఏటికేడు జనాభా సంఖ్య పెరుగుతూనే ఉంది. 51 వార్డులు ఉన్నాయి. ప్రతి రోజు నగరంలో 170 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతున్నట్లు అంచనా. దీనిని తరలించేందుకు నగరపాలకసంస్థ తరఫున 40 వాహనాలు, ప్రైవేటు వ్యక్తులకు చెందిన మరో 13 ట్రాక్టర్లు వినియోగంలో ఉన్నాయి. గత మూడు నెలల కిందటే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.కోటి వెచ్చించి అధిక నిల్వ సామర్థ్యం ఉన్న నాలుగు కాంపాక్టర్ వాహనాలను అధికారులు కొనుగోలు చేశారు. ఇంతవరకు అంతా సవ్యంగానే ఉన్నా గత నవంబరులో ఐదు చెత్త వాహనాలను అదనంగా ఏర్పాటు చేశారు. ఇందుకు ప్రజారోగ్య విభాగం నుంచి ఎలాంటి అనుమతులు కాని, రాత పూర్వకమైన ఒప్పందాలు కానీ జరగలేదు.

స్వామిభక్తి చాటేందుకు..

నగరపాలకకు చెందిన కొందరు అధికారులు కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అడ్డగోలుగా రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసేశారు. మరోవైపు ఎలాంటి అవసరం లేకుండానే అద్దెలకు తీసుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయకుండా.. అవసరాలను గుర్తించకుండానే స్వామిభక్తి చాటుకునేందుకు అడ్డదిడ్డంగా నిధులను ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతోంది. వాస్తవానికి వీటి అవసరం లేకపోయినా కొనుగోలు చేసేయడం గమనార్హం. మరోవైపు చెత్త తరలింపులోనూ అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చెత్త తరలించకుండానే తరలిస్తున్నట్లు చూపి నిధులు మింగేస్తున్నారు. అయినప్పటికీ ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.



సాయిబాబా సంజీవ్‌నగర్‌లో వాహనంలోకి చెత్తను వేస్తున్న సిబ్బంది

ఖజానాకు భారం

వాహనాలను కొనుగోలు చేయడం వల్ల ఖజానాకు ప్రతి నెలా రూ.4.50 లక్షల వరకు ఆర్థికంగా భారం అవుతోంది. ఇప్పటికే వీటికి సంబంధించి రెండు నెలల గడువు కావస్తుండటంతో రూ.9 లక్షల వరకు అదనంగా చెల్లింపులు చేయాల్సి వస్తోంది. గతంలోనూ 10 వాహనాలను ఇదే రకంగా ఏర్పాటు చేసుకోగా బిల్లుల చెల్లింపు సమయంలో ఆడిట్ అభ్యంతరాలు తలెత్తి కొద్ది నెలలకే వాటిని తొలగించేశారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు అదే తప్పును చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఆర్థికపరమైన అంశాలపై ఇష్టానుసారం నిర్ణయం తీసుకోవటంతో సంస్థకు ఖజానాకు భారంగా మారింది. దీనిని చూసి మరి కొంతమంది తమ వాహనాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని పైరవీలు, సిఫారసులు చేయిస్తుండటం గమనార్హం. వాస్తవానికి రూ.లక్ష దాటితే టెండర్లు పిలవాలన్న ప్రాథమిక నిబంధనను విస్మరించి తమ రాజకీయ నేతల అనయాయులకు ప్రాధాన్యం ఇచ్చారనే అపవాదు ఉంది. టెండర్లు నిర్వహిస్తే అధిక సంఖ్యలో గుత్తేదారులు పాల్గొని, పోటీ ఏర్పడి సంస్థకు ప్రయోజనం చేకూరేలా సేవలు అమలు అవుతాయనే విషయాన్ని సంబంధిత వర్గాలు పక్కన పెట్టటం ఆరోపణలకు తావిస్తోంది.

అనధికార వాహనాలకు బిల్లులు చెల్లించం

- హరినాథ్‌రెడ్డి, కమిషనర్, నగరపాలక సంస్థ

వాణిజ్య సముదాయాలు, వ్యాపార దుకాణాల నుంచి ప్రత్యేకంగా వ్యర్థాలను సేకరించాలని యోచిస్తున్నాం. ఇందుకు అదనంగా వాహనాలు తీసుకునే ఆలోచన ఉంది. కానీ ప్రస్తుతం అమలు కావటం లేదు. ఒకవేళ అనధికారికంగా ఎవరైనా వాహనాలను చెత్త సేకరణకు వినియోగిస్తుంటే అలాంటి వాటికి బిల్లులు చెల్లించం. దీనిపై కఠినంగా వ్యవహరిస్తాం.

ప్రజలకు తోడుగా.. 'హలో ఈనాడు' వేదికగా..



చరవాణి: 97014 76343

కర్నూలు, న్యూస్‌టుడే: మీ ప్రాంతంలో ఎన్నో సమస్యలు నెలకొని ఉంటాయి. రహదారులు సరిగా లేకపోవడం, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, వీధిదీపాలు వెలగకపోవడం.. ఇలా ఏ సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు 'ఈనాడు' చర్యలు చేపట్టింది. 'హలో ఈనాడు' కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. అవసరార్థులు తమ పరిధిలోని సమస్యలను పైన పేర్కొన్న చరవాణి సంఖ్యకు తెలపాల్సి ఉంటుంది.

తెలపాల్సిన సమయం : ఉదయం 10.30 నుంచి 12.30 వరకు



కేకు కోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి

నూతనోత్సాహంతో న్యాయం చేద్దాం

గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కొత్త ఏడాదిలో నూతన ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సత్వర న్యాయం అందిద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.అనుపమ చక్రవర్తి అన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆమె మంగళవారం కేకు కోసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి టి.రఘురాం, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కె.సుధాకర్, సీనియర్ సివిల్ జడ్జిలు ఎ.మోజెస్, ఎం.ఎ.సోమశేఖర్, గాయత్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జిలు రాజేంద్రబాబు, గంగాభవాని, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌లు ఎం.బాబు, ఆశారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగలక్ష్మీదేవి, బాబూసాహెబ్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలను విజయవంతం చేయాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నగరంలోని మాంటిస్సోరి గురుకుల్ జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ తన స్వగృహంలో క్రీడా సంఘాల ప్రతినిధులు విజయకుమార్, సునీల్‌కుమార్, రాజశేఖర్, రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల విజయవంతానికి క్రీడా సంఘాల ప్రతినిధులు కలిసి రావాలని కోరారు. 26 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ తదితరులు



వివరాలు వెల్లడిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

కర్నూలు క్రీడలు : నగరంలోని జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో జాతీయ యువ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రాయలసీమ జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఏర్పాటుచేసినట్లు తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్టేడియంలో పోటీల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఇక్కడ ప్రతిభ చూపినవారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయస్థాయిలో స్పోర్ట్స్ వసతిగృహంలో చేరేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

జన్మభూమి-సంక్రాంతి సంబరాలు ప్రారంభం

కర్నూలు నగరం (కల్చరల్), న్యూస్‌టుడే : ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జన్మభూమి- సంక్రాంతి సంబరాల కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా కర్నూలు పాతబస్తీలోని ఓపెన్ ఎయిర్ థియేటరులో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ శారదసంగీత కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు గోపవరపు రామచంద్రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత కళాశాల విద్యార్థులు ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. కరీముల్లా బృందం కూచిపూడి నృత్యం, సాయిరాం బృందం గిరిజన జానపద గేయాలు ఆలపించారు. ఈ సందర్భంగా రామచంద్రన్ మాట్లాడుతూ 10 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, జిల్లా కేంద్రం కర్నూలుతోపాటు మండల, తాలూకా కేంద్రాల్లో జరుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాశాల అధ్యాపకులు జ్యోతిర్మయి, విశ్రాంత ఎస్వీ అంకయ్య, సమన్వయకర్త రమణ, కళాశాల విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

కర్నూలు

విద్యార్థులకు సదస్సు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా స్థానిక కేవీ ఆర్ మహిళా కళాశాలలో సాంఘిక సంక్షేమం అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సివి.రాజేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తిరుపతయ్య, విశ్రాంత డీఎస్పీ పాపారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : డిసెంబర్ 31 అర్ధరాత్రి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టినందుకుగాను సీవీరామన్ కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు మంగళవారం కర్నూలు రెండో పట్టణ సీఐ డేగల ప్రభాకర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. లాక్‌హౌస్ మోనిటరింగ్ సిస్టంపై ప్రజలకు అవగాహన కల్పించి పోలీసుశాఖకు సహకరిస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం

గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : జీవితానికి, భవిష్యత్తుకు, సామాజిక సేవకు ఉపయోగపడే మహిళా చట్టాలపై ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సోమశేఖర్ సూచించారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వేధింపులు, అదనపు కట్నం వేధింపులు, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తిరుపతయ్య, పాపారావు, భరత్‌భూషణ్, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరిదేవి, అధ్యాపకులు శాంతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న న్యాయమూర్తి సోమశేఖర్

6న శత వసంతాల పండగ

కర్నూలు నగరం, (కల్చరల్) న్యూస్‌టుడే : తిరుపతి వేంకటకవులు రచించిన 'శ్రీకృష్ణరాయబారం (జెండాపై కపిరాజు)' నాటకం రాసి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తెలుగు కళాకారులు 'శతవసంతాల పండగ'ను నిర్వహిస్తున్నారు. కర్నూలులోని 'టిజీవీ కళాక్షేత్రంలో' 'జెండాపై కపిరాజు (శ్రీకృష్ణరాయబారం లోని పద్యాలు)' రంగస్థల పద్యపఠన పోటీలు 6 తేదీ ఉదయం 10 నుంచి నూరేళ్ల పండగ, ఏకపాత్ర పద్యపోటీలు ప్రారంభమవుతాయని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి బాలవెంకటేశ్వర్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల కళాకారులు 90004 93683 నంబరులో సంప్రదించాలని కోరారు. జనవరి 1వ తేదీ నిర్వహించాల్సిన పద్యపోటీలను 6వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 6వ తేదీ సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో శ్రీకృష్ణరాయబారంలోని 'పడకసీను' నాటక ప్రదర్శన ఉంటుందని ఆయన చెప్పారు.

సిల్వర్‌జూబ్లీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా దిన్నెదేవరపాడు గ్రామంలో స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల జన్మభూమి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అమర్‌నాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్‌ఖాదర్, అధ్యాపకులు విజయకుమార్, జగన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రిజిస్ట్రార్ అమర్‌నాథ్ తదితరులు



క్యాలెండరు విడుదల చేస్తున్న నాయకులు

కాలమానిని విడుదల

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : రెడ్ల సమైక్య సేవా సంఘం జిల్లాస్థాయి సమావేశం కర్నూలులో మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కర్నూలు నగరపాలకసంస్థ కమిషనర్ హరినాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం కాలమానిని (క్యాలెండర్) కమిషనరుతోపాటు డ్వామా పీడీ డాక్టరు పుల్లారెడ్డి, డాక్టరు అమరసింహారెడ్డి, లయన్ విజయకుమార్ రెడ్డి, కల్లూరు తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కేవీ సుబ్బారెడ్డి, పరమేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సలహాదారు ప్రకాష్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీకి ఇవ్వడం ఐఎంఏ విజయమే

కర్నూలు వైద్యాలయం న్యూస్‌టుడే : పార్లమెంట్‌లో జాతీయ వైద్య కమిషన్ ప్రవేశపెట్టిన బిల్లును స్టాండింగ్ కమిటీకి ఇవ్వడం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ విజయమని ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఐఎంఏ ఆధ్వర్యంలో అన్ని క్లినిక్‌లను మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మూసేశారని, ఈరోజు పూర్తిగా విజయవంతమైందని చెప్పారు. ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదించాల్సి ఉండగా పరిశీలనకు స్టాండింగ్ కమిటీకి ఇవ్వడం ఐఎంఏ విజయమని చెప్పారు. మరోసారి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లుపై పునరాలోచించాలని కోరారు.

డీటీఎఫ్ దైనందిని ఆవిష్కరణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్-2018 నూతన దైనందినిని జిల్లా విద్యాధికారిణి తహెరాసుల్తానా తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రత్నం ఏసేపు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరె కృష్ణ, గట్టు తిమ్మప్ప, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్-2018 నూతన కాలమానిని ఐఎస్ఈ ప్రిన్సిపల్ రామిరెడ్డి చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో మంచి సమాజం కోసం విద్య అంశంపై భవిష్యత్తులో వర్క్‌షాపు నిర్వహిస్తామని సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఎం. బాలన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ రెడ్డి, ఈశ్వరయ్య, విజయకుమార్, వసుంధర రాణి పాల్గొన్నారు.



దైనందిని ఆవిష్కరిస్తున్న తహెరాసుల్తానా తదితరులు

అగ్నిప్రమాదాలతో అప్రమత్తత అవసరం

కర్నూలు నేర విభాగం, న్యూస్‌టుడే : ఆయిల్ కర్మాగారంలో పనిచేసే కార్మికులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా విపత్తుల స్పందన అగ్నిమాపకశాఖ అధికారి భూపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక భాగ్యనగర్‌లోని క్రాంతి ఆయిల్ మిల్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేసి సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాలు జరిగిన సందర్భంలో ఉప కరణాలతో నిరోధక చర్యలపై ప్రయోగాత్మకంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ కర్నూలు కేంద్రాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్

విద్యాభివృద్ధికి కృషి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ కాలమానిని కర్నూలు మండల విద్యాధికారి మౌలాలి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ నూతన ఆంగ్ల నామ సంవత్సరంలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు టి.రామదాసు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, రఘు, హేమంత్‌కుమార్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: గ్లోబల్ ఎడ్జ్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో నగర శివారులోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికైనట్లు కార్పొరేట్ వ్యవహారాల అధికారి ఎం.గిరిధర్ కుమార్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎంపికైన ప్రణతి, శిల్ప, తేజస్విని తదితరులను మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, ప్రిన్సిపల్ సి.శ్రీనివాసరావు, డీన్ ఎస్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వృషభాల విజయం

పూడిచర్ల(ఓర్వకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని పూడిచర్లలో ఆర్‌సీఎం చర్చి సంఘస్థుల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో భాగంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 17 జతల వృషభాలు పాల్గొన్నాయి. బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామానికి చెందిన డేగల రాజేశ్వరి వృషభాలు 4742 అడుగులు లాగి ప్రథమ బహుమతిగా రూ.30 వేలు గెలుచుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం రాయచోటి జిల్లా పలకందొడ్డికి చెందిన ఖాజాహుసేన్ వృషభాలు 4700అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.20వేలు, కడప జిల్లా బాలయ్య గారి పల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు 4550అడుగులు లాగి మూడవ బహుమతి రూ. 10 వేలు, నందికొట్కూరు మండలం వడ్డెమానుకు చెందిన తరలిక వృషభాలు 4085 అడుగులు లాగి నాలుగో బహుమతిగా రూ.5వేలు అందుకున్నాయి.

ఒక్కో దరఖాస్తుకు ఒక్కో రేటు

1వ డివిజన్‌లోని కండేరీలో ఏర్పాటుచేసిన జన్మభూమి కార్యక్రమం వద్ద గృహ, పింఛను దరఖాస్తులను రూ.5కు, రేషన్‌కార్డుకు రూ.10 వసూలు చేశారు. వీటిని భర్తీ చేసేందుకు రూ. 30 తీసుకోవడం గమనార్హం. పేదల కోసం నిర్దేశించిన ఈ కార్యక్రమంలో ఇలా అనధికార వ్యక్తులు అధికారుల సాక్షిగా డబ్బులు వసూలు చేయటం పలు విమర్శలకు తావిస్తోంది. - న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ



నిందితులను శిక్షించాలి

కర్నూలు బీక్యాంపు, న్యూస్‌టుడే : రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో దళితులను బహిష్కరించిన వారిని శిక్షించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, నగర నాయకులు లక్ష్మన్న, నరసింహులు, విజయకుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు రూ.9.50 లక్షలు మంజూరు

కుంబళనూరు క్యాంపు (కౌతాళం గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని కుంబళనూరు క్యాంపులో శ్మశాన వాటిక అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు రూ.9.50 లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం నోడల్ అధికారి సత్యనారాయణ చౌదరి, తహసీల్దారు శ్రీనివాసరావు, సర్పంచి ముత్తమ్మ, ఎస్సై సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొని భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

మంత్రాలయం

నేడు కల్లుకుంటలో జన్మభూమి

కల్లుకుంట (పెద్దకడబూరు), న్యూస్‌టుడే : మండల పరిధిలోని కల్లుకుంట, మేకడోన గ్రామాల్లో బుధవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం మేకడోన, మధ్యాహ్నం నుంచి కల్లుకుంటలో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న పులికనుమ సాధన కమిటీ కన్వీనర్ రాముడు

ప్రత్యేక తూము ఏర్పాటు చేయాలి

కోసిగి, న్యూస్‌టుడే : కోసిగి సమీపంలో ఉన్న పులికనుమ జలాశయం నుంచి ప్రత్యేక తూము ఏర్పాటు చేయాలని పులికనుమ సాధన కమిటీ కన్వీనరు రాముడు, మురళీరెడ్డి డిమాండు చేశారు. స్థానిక బీరప్ప దేవాలయ ఆవరణలో మంగళవారం అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ జలాశయం నిర్మాణంలో కోసిగి రైతులు వందల ఎకరాల భూములు కోల్పోయినా సాగు, తాగునీరు అందించడానికి ఎటువంటి ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ప్రత్యేక తూము ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. కోసిగి రైతులకు న్యాయం జరిగే వరకు దశల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బెట్టన్నగౌడ్, లోకేష్, లింగన్న, తిక్కన్న, రాజు, దుర్గప్ప, జగదీష్ స్వామి, షంషాద్దీన్, మల్లికార్జున, వీరేష్, రైతులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో నేటి పూజలు

మంత్రాలయం, న్యూస్‌టుడే : పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం వేకువజాము నుంచే ప్రహ్లాదరాయల పాదపూజ, కనకాభిషేకం, మూల బృందావనానికి పంచామృతాభిషేకం, కనకకవచ సమర్పణ, అలంకరణ, బంగారు పల్లకోత్సవం, అర్చన సహిత హస్తోదకం సేవలు నిర్వహించనున్నారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచి 8లోపు పూజలు పూర్తి చేస్తారు. సాయంత్రం ప్రాకారంలో కొయ్య, వెండి, బంగారు రథాల ఊరేగింపు, ఊంజల్ సేవ జరపనున్నారు.

దర్శన వేళలు : తెల్లవారు జామున 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు.

అన్నపూర్ణ భోజనశాల : ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు. సాయంత్రం 7.30 నుంచి 9 గంటల వరకు.

వసతి గృహాల సమాచారం : డీవీజీ (దీరేంద్ర), వ్యాస మందిరం, పంచముఖిదర్శన్, సర్వజ్ఞమందిరం, సుజయీంద్ర విశ్రాంతిభవన్, విజయవిఠల్ మందిరం, వీవీజీ(వందగదులు), సుయతీంద్ర విశ్రాంతి నిలయం(200 గదులు).సీఆర్వో(ముఖ్య కార్యాలయం) ఫోన్ నంబరు: కోడ్ 08512-279 659, 279 495, ఎస్‌వీజీ: 85006 88990, బృందావన్‌గార్డెన్ : 85006 88996, అంతర్జాలంలో ఎస్ఆర్ఎస్‌మఠ్.ఓఆర్‌జీ (వెబ్‌సైట్‌లో గదులు నమోదు చేసుకోవచ్చు. 50 గదులు అందుబాటులో ఉన్నాయి.

శ్రీమఠం మేనేజర్ కార్యాలయం : 279 888, సెల్ 94400 77284, పీఆర్వో (పూజా సమాచారం కోసం) కార్యాలయం : 279 700.


రవాణ సమాచారం : మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు విచారణ కేంద్రం : 279 477, తుంగభద్ర రైల్వేస్టేషన్ (మంత్రాలయం రోడ్) విచారణ కేంద్రం: 259 930, మంత్రాలయం పోలీసు స్టేషన్ : 279 433, మంత్రాలయం సీఐ చరవాణి: 91211 01151. ఎస్ఐ (మంత్రాలయం) చరవాణి: 91211 01152, మాధవరం ఎస్ఐ చరవాణి: 91211 01153.

సమస్యల పరిష్కారానికి జన్మభూమి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని మంత్రాలయం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు తిక్కారెడ్డి అన్నారు. నౌలేకల్, తారాపురం గ్రామాల్లో మంగళవారం ఐదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ గత జన్మభూమిలో పింఛన్లు, బియ్యం కార్డులు, గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ప్రస్తుతం మంజూరయ్యాయని, ఇంకా మంజూరు కాని వారు ఉంటే ప్రస్తుత జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. నౌలేకల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ డీవైఎఫ్ఐ నాయకులు నరసింహులు తిక్కారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగేష్, జాముపద్మ, తెదేపా జిల్లా కార్యదర్శి రమాకాంత రెడ్డి, నోడల్ అధికారి రమేష్ రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్ రావు, తహసీల్దారు రమాదేవి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నదిచాగిలో మాట్లాడుతున్న రాష్ట్ర వాల్మీకి సమాఖ్య డైరెక్టర్ హులిగయ్య



నౌలేకల్‌లో కొత్త పింఛన్లు అందజేస్తున్న తిక్కారెడ్డి

దుద్ది (కోసిగి), న్యూస్‌టుడే : పేదల అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ, తెదేపా జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్ది, చిర్తనకల్ గ్రామాల్లో ప్రత్యేక అధికారి రవీంద్ర నాథ్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అలాగే చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి తహసీల్దారు రజనీకాంత రెడ్డి మాట్లాడుతూ దుద్ది, చిర్తనకల్ గ్రామాలకు 140 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఈఓపీఆర్డీ అయ్యన్న, కోసిగి సర్పంచి ముత్తురెడ్డి, నాయకులు వక్రాణి వెంకటేశులు, ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దుద్దిలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ

నదిచాగి, కుంబళనూరు (కౌతాళం గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని నదిచాగి, కుంబళనూరు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి సమాఖ్య డైరెక్టరు హులిగయ్య, నోడల్ అధికారి సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం పేదలకు వరం లాంటిదన్నారు. ప్రజల వద్దకు అన్ని శాఖల అధికారులు రావడం వల్ల తక్షణమే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు భీమయ్య, ముత్తమ్మ, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మి, తెదేపా నాయకులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కచాపురం (మంత్రాలయం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి బాలనాయక్ తెలిపారు. కచాపురం, కగ్గల్లు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి ఆనందం, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిలకలడోణలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొని చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కానుకల్లో నాణ్యత లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న లబ్ధిదారులు

చౌక దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలి

కౌతాళం, న్యూస్‌టుడే : కౌతాళంలోని ఎస్సీ వీధిలో ఉన్న చౌక దుకాణదారుడు రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని, చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండు చేశారు. మిగతా దుకాణాల్లో రెండు రోజులుగా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తుండగా ఇక్కడ మాత్రం బియ్యం అందించడం లేదని ఆరోపించారు. తూకాల్లో సైతం మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈమేరకు వారు స్థానిక తహసీల్దారు కార్యాలయానికి చేరుకొని తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా సంబంధిత డీలరు సరుకులు సరిగా వేయడం లేదన్నారు. ప్రతి నెలా వేలిముద్ర వేసుకుని రశీదులు ఇస్తున్నారని, అయితే బియ్యం మాత్రం మూడు నెలలకోసారి ఇస్తున్నాడన్నారు. ఈ విషయంపై తహసీల్దారు మాట్లాడుతూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కుంటను పూడ్చండి

దుద్ది (కోసిగి), న్యూస్‌టుడే : దుద్ది గ్రామంలోని బీసీ వీధిలో ఇళ్ల మధ్య ఉన్న మురుగు కుంటను పూడ్చాలని తెదేపా మాజీ సర్పంచి అంజినయ్య, ఉప సర్పంచి నాగేష్, బీసీ కాలనీవాసులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు రజనీకాంతరెడ్డికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా మురుగు కుంటతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుర్వాసనతో పాటు రాత్రిళ్లు దోమల బెడదతో అల్లాడుతున్నామని వాపోయారు. సమస్యను అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదన్నారు. మీరైనా చొరవ తీసుకొని కుంటను పూడ్చాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన ఇన్‌ఛార్జి తహసీల్దారు మాట్లాడుతూ పంచాయతీ అధికారులతో మాట్లాడుతానని చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కోసిగి, న్యూస్‌టుడే : క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానిస్తాయని ఈఓపీఆర్డీ అయ్యన్న అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి ముత్తురెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 13 రకాల క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం ముగిసే వరకు కోసిగితో పాటు ఆయా గ్రామాల్లో ఉండే పాఠశాలల్లో పోటీలు జరుపుతున్నట్లు వివరించారు. ఇందుకు వ్యాయామ ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. అనంతరం ముత్తురెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఈఓ రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర, ఉప సర్పంచి ఉసేనమ్మ, లూసమ్మ, పద్మ, లక్ష్మి, సరోజ, నరసమ్మ పాల్గొన్నారు.



క్రీడలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అయ్యన్న

మద్యం సీసాల స్వాధీనం

బదినేహాల్ (కౌతాళం గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని బదినే హాల్ గ్రామానికి చెందిన కటికబాషా అనే వ్యక్తి మంగళవారం మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. అతన్ని అరెస్టు చేసి, 10 సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రాలయం

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం

మంత్రాలయం, న్యూస్‌టుడే : పౌర్ణమి సందర్భంగా పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. పురోహితుడు శ్రీపదాచార్ సత్య నారాయణ వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు సంకల్పం చేయించి స్వామి చిత్ర పటానికి పూజలు చేయించారు. అనంతరం భక్తులకు సత్యనారాయణ కథను వివరించారు. ప్రసాదాలను పంచి పెట్టారు. కాగా పీఠాధిపతి మూలరాముల పూజలు, బృందావనానికి ధూపదీప నైవేద్యం సమర్పించి మంగళహారతులిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. స్వామి బృందావనాన్ని బంగారు పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరాజచార్, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆదోని డీఎస్పీ ప్రసాద్ రాత్రి మఠానికి వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మ, స్వామి బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. డీఎస్పీ వెంట సీఐ డి.రాము, ఎస్ఐలు శ్రీనివాస నాయక్, రాజారెడ్డి ఉన్నారు.


సత్యనారాయణ వ్రతం చేస్తున్న పురోహితుడు


భక్తిగీతాలను ఆలపిస్తున్న భక్తుడు



దర్శనానికి వచ్చిన ఆదోని డీఎస్పీ ప్రసాద్

రథానికి కలశ పూజ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మంగళవారం ధర్మకర్త మాచాని నీలకంఠప్ప నాగరాజు ఆధ్వర్యంలో మహిళలు కలశాలు, గొడుగుతో రథం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం కలశ, గొడుగు పూజ నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రముఖులకు ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందజేశారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం పురస్కరించుకొని మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో 36 జట్లు పాల్గొనగా బల్లేకల్ జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకొంది. రెండో బహుమతిని అలసందగుత్తి జట్టు అందుకొంది. బహుమతులను ఎంపీపీ రఘురాముడు అందజేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు రామ్మోహన్‌రెడ్డి, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబాభవాని రథోత్సవం


అలంకరణలో అంబాభవాని దేవి

చిన్నతుంబళం (పెద్దకడబూరు), న్యూస్‌టుడే : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో వెలసిన శ్రీ అంబా భవాని రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, మహా మంగళ హారతి వంటి పూజలు నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త ఢాకయ్యశెట్టి తెలిపారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన బారికికుంటి ఈరమ్మ స్వగృహం నుంచి పూర్ణ కుంభాన్ని ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని రథంలో ఉంచి ఎదురుగా ఉన్న తిమ్మయ్య మఠం వద్దకు రథాన్ని లాగారు.


సాగుతున్న రథోత్సవం

చౌడేశ్వరి దేవీ రక్షమాం..


అలంకరణలో చౌడేశ్వరీ దేవి


పెద్దకడబూరు, న్యూస్‌టుడే : మండలంలోని హనుమాపురం గ్రామంలో మంగళవారం శ్రీ చౌడేశ్వరి దేవీ రథోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయంలో కొలువైన అమ్మవారికి ఉదయమే జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. సాయంత్రం పూర్ణ కుంభాన్ని అటకార చంద్రశేఖర్ స్వగృహం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తెచ్చారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఎదురుగా ఉన్న ఈశ్వర దేవాలయం వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని తిలకించారు.


జనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

నివేదన

అసౌకర్యం

మంత్రాలయం, న్యూస్‌టుడే : పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు మూతపడిన ఏటీఎం, సులభ్ కాంప్లెక్స్‌లతో పడరాని పాట్లు పడుతున్నారు. నోట్ల రద్దు నాటి నుంచి ఏటీఎం కేంద్రాల్లో నగదు పూర్తి స్థాయిలో అధికారులు ఉంచడం లేదు. సాంకేతిక కారణాల పేరుతో మూసివేస్తున్నారు. మంత్రాలయంలో వ్యాపారుల వద్ద క్యాష్‌లెస్ లావాదేవీల పరికరాలు లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు ఏటీఎంలనే నమ్ముకొని వస్తున్నారు. ఈ నేపథ్యంలో నోక్యాష్ అని దర్శనమిస్తుండటంతో ఏమి చేయాలో తెలియక మదనపడుతున్నారు. ముఖ్యంగా మఠం పరిసరాల్లోనే ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎం వారం రోజులుగా మూసేశారు. సాంకేతిక సమస్యల పేరుతో మూత వేస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. కాగా నది ఒడ్డున ఉన్న సులభ కాంప్లెక్స్ మూతతో భక్తులకు మరుగుదొడ్డి, మూత్రశాల, స్నానాలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు వీటిపై దృష్టిసారించకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇకనైనా స్పందించి వాటిని ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.



మూతపడిన సులభ్ కాంప్లెక్స్



నగదు లేని ఏటీఎం

అసంతృప్తి

కౌతాళం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన కౌతాళంలో ఏటీఎంలు సరిగా పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఇటీవల కాలంలో ఎక్కువ శాతం ఏటీఎం కార్డులనే వినియోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వైప్ యంత్రాల సౌకర్యం లేకపోవడంతో ఏటీఎం కేంద్రాల నుంచి డబ్బులు తీసుకోవడం తప్పదు. కౌతాళంలో ఎస్‌బీఐ శాఖ వారు ఓ ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఇండిక్యాష్, ఇండియా వన్ అనే ఇతర సంస్థలు రెండు కేంద్రాలను నెలకొల్పాయి. నెల రోజులుగా ఎస్‌బీఐ శాఖ కేంద్రం పనిచేయడం లేదు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన ఇండిక్యాష్‌లో మూడు నెలల క్రితం పలుమార్లు చిరిగిన నోట్లు, చెల్లని నోట్లు రావడంతో స్థానికులు సంస్థ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి ఇండిక్యాష్‌లో డబ్బులు ఉంచిందే లేదు. ఇండియావన్ విషయానికొస్తే డబ్బులు పూర్తయిన ప్రతిసారి తిరిగి డబ్బులు ఉంచడానికి మూడు రోజుల నుంచి వారం పడుతోంది. దీంతో ఏటీఎంలపైనే ఆధారపడిన వారి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నెలరోజులుగా తెరుచుకోని ఎస్‌బీఐ ఏటీఎం



ఇండిక్యాష్ ఎప్పుడు తెరుచుకుంటుందో

నందికొట్కూరు

సీపీఎస్‌ను రద్దు చేయాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకుడు శ్రీనివాసులు ప్రత్యేక అధికారి సుదర్శన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మల్యాల గ్రామంలో జరిగిన జన్మ భూమి కార్యక్రమంలో ప్రత్యేక అధికారిని కలిశారు.

బానుముక్కల వృషభాల విజయం

పూడిచర్ల(ఓర్వకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని పూడిచర్లలో ఆర్‌సీఎం చర్చి సంఘస్థుల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగు పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 17 జతల వృషభాలు పాల్గొన్నాయి. బనగానపల్లె మండలం బానుముక్కలకి చెందిన డేగల రాజేశ్వరి వృషభాలు 4742 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.30వేలు కైవసం చేసుకున్నాయి.

చేతి వృత్తుల శిక్షణ..భవితకు రక్షణ

☛ ఉన్నత పాఠశాల స్థాయి నుంచే ఉపాధి కోర్సులు ☛ రాణిస్తున్న చేతి అల్లికలు


విద్యార్థులు తయారు చేసిన అలంకరణ వస్తువులతో ఉపాధ్యాయురాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు సంబంధించిన విద్యను అందిస్తున్నారు. మండలానికి ఇద్దరు చొప్పున క్రాఫ్ట్ టీచర్లను పొరుగుసేవల ఒప్పందం కింద ప్రభుత్వం నియమించింది. వీరి వల్ల 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు స్వయం ఉపాధి పొందేలా వీరికి వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. వృత్తి విద్యా కోర్సులు సాధారణంగా ఇంటర్ మీడియట్ నుంచి అమల్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా ఉన్నత పాఠశాల్లోనూ ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా క్రాఫ్ట్ టీచర్లను నియమించారు. విద్యార్థులకు కుట్టు శిక్షణ ఇవ్వడమే అమలు చేస్తోంది.

నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల మండలాల్లోని ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం కాకుండా దారాలతో పూల అల్లికలు, పూల అలంకరణ, వృథా వస్తువులతో గృహోపకరణాల తయారు చేయడం వంటివి విద్యార్థులకు నేర్పుతున్నారు. 8, 9, 10 తరగతులకు ప్రతి రోజూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వం గుర్తించిన ఉన్నత పాఠశాలల్లో వీరు పొరుగుసేవల కింద మధ్యాహ్నం నుంచి పాఠశాలకు వచ్చి విద్యార్థులకు కుట్టుతో పాటు అల్లికలు నేర్పుతున్నారు. గృహోపకరణాలుగా ఉపయోగించే ఆర్చీలు, గుమ్మాలకు ఉపయోగించే డెకరేషన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, దండలు వంటివి తయారు చేయడం నేర్పుతున్నారు. కుట్టు శిక్షణలో బట్టలు ఎలా కత్తిరించాలి. కొలతలు ఎలా తీసుకోవాలి అన్న అంశాలను నేర్పుతున్నారు. మొదట కాగితాలతో, కొంత నేర్చుకున్న తర్వాత వస్త్రంతో నేర్పుతున్నారు. కొందరు విద్యార్థులు స్వయంగా తమ దుస్తులు తాము కుట్టుకునే స్థాయికి ఎదిగారు.


తయారు చేసిన దండను చూపుతున్న విద్యార్థిని


విద్యార్థులు తయారు చేసిన ఫ్లవర్‌బొకె

☛ **ఈ** చిత్రంలో కనపడుతున్న విద్యార్థి సతీష్ కొణిదేల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి చాక్‌పీస్‌తో బొమ్మలు తయారు చేశాడు. దండ, పిల్లన గ్రోవి, చిన్న చిన్న బొమ్మలను చెక్కి తయారు చేస్తున్నారు. ఈ విద్యార్థికి బొమ్మలు తయారు చేయడం అంటే ఇష్టం. విద్యార్థిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించిన ఉపాధ్యాయురాలు చాక్‌పీస్‌లతో బొమ్మలు చేయించారు. అందులో నైపుణ్యం చూపి సొంతంగా ఆలోచిస్తూ బొమ్మలను తయారు చేశారు.


చాక్‌పీస్‌లతో తయారు చేసిన బొమ్మలు

స్వయం ఉపాధికి బాగా ఉపకరిస్తాయి
-సత్యం, ప్రధానోపాధ్యాయుడు

స్వయం ఉపాధికి బాగా ఉపకరిస్తాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులకు కుట్టు అల్లికలు బాగా ఉయోగపడతాయి. ఇంటి వద్దనే ఓ కుట్టు మిషన్ పెట్టుకొని స్వయం ఉపాధి పొందవచ్చు. మూడేళ్లుగా మా పాఠశాలలో కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఇలాంటి శిక్షణ వల్ల 10వ తరగతి పూర్తైన విద్యార్థులు స్వయం ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం రవిక కుడితే రూ.200 వరకు కూలీ తీసుకుంటున్నారు. గ్రామాల్లో రూ.30 తీసుకుంటున్నారు. రోజుకు రెండు తయారు చేస్తున్నట్లు విద్యార్థులు స్వయంగా వచ్చి చెబుతున్నారు. పాఠశాలల్లో నేర్చుకున్న విద్య వృథా కావడం లేదు.

మల్యాలకు చేరిన మోటరు


మల్యాల హంద్రీనీవా ఎత్తిపోతల పథకం వద్దకు తీసుకువచ్చిన మోటరు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి పట్టిసీమకు తరలించిన మోటరు తిరిగి మల్యాలకు చేరుకుంది. మూడు నెలల కిందట మల్యాల పథకానికి సంబంధించిన మోటరును పట్టిసీమ పథకం వద్దకు తరలించారు. 12 మోటార్లతో ఏర్పాటు చేసిన పథకంలో ఆరు మోటర్లు ద్వారా నీటిని కాల్వకు విడుదల చేస్తున్నారు. మరో రెండు పంపుల ద్వారా కేసీకి నీటిని తరలిస్తున్నారు. మిగిలిన నాలుగు మోటర్లలో ఓ మోటరును పట్టిసీమకు తీసుకెళ్లారు. దానిని మంగళవారం భారీ వాహనంలో దానిని తిరిగి తీసుకువచ్చారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి విశ్వేశ్వర రెడ్డి

పగిడ్యాల, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మంళవారం మండల పరిధిలోని ఘణపురంలో ఎన్‌టీఆర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మెహరున్నీసా, లక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు వాయిదా..

పడమర ప్రాతకోట (పగిడ్యాల), న్యూస్‌టుడే: మండలంలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 3 నుంచి 6వరకు జరిగే నందికొట్కూరు జోనల్స్ క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు క్రీడల నిర్వహణ ఛైర్మన్ సుబ్బరాయుడు తెలిపారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జోనల్స్ పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలన్నారు. మళ్లీ నిర్వహణ తేదీలను ఆయా పాఠశాలలకు తెలియజేస్తామని వివరించారు.

కొణిదేల పాఠశాల క్రీడాకారుల విజయం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ముందస్తుగా నిర్వహిస్తున్న జోనల్ క్రీడల్లో కొణిదేల ఉన్నత పాఠశాల క్రీడాకారులు విజయం సాధించినట్లు పాఠశాల పీడీ శ్రీనాథ్ తెలిపారు. అండర్-14 ఫుట్‌బాల్ విభాగంలో నిర్వహించిన క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన క్రీడాకారులు విజేతగా నిలిచినట్లు చెప్పారు. గడివేముల పాఠశాలకు చెందిన టీమ్ రన్నరుగా విజయం సాధించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు సత్యం, ఉపాధ్యాయులు అబినందించారు.


విజయం సాధించిన ఫుట్‌బాల్ క్రీడాకారులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు


నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన యాట ఓబులన్న

చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలి

నెహ్రూనగర్ (పగిడ్యాల), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులన్న అన్నారు. మంగళవారం మండలంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొని విజయాలు సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బాషా, పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు స్వామినాథం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాలలో విద్యుత్తు దీప కాంతుల్లో సాగుతున్న కబడ్డీ పోటీలు

ఆసక్తికరంగా ఇస్కాల కబడ్డీ పోటీలు

ఇస్కాల(పాములపాడు),న్యూస్‌టుడే: ఇస్కాల గ్రామంలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. ఇప్పటికి జరిగిన పోరులో బండిఆత్మకూరు, ఇస్కాల, కాకనూర్, నందికొట్కూరు జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. 3 వతేదీ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. కబడ్డీ పోటీలు ఫ్లడ్ దీపాల కాంతుల మధ్యం నిర్వహిస్తుండటం విశేషం. తుది విజేతలకు 6 స్థానాల వరకు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

తగ్గిన గ్రామ వేలం

లక్ష్మాపురం (పగిడ్యాల), న్యూస్‌టుడే: లక్ష్మాపురంలో రైతులు పండించిన పంటలను తూకాలు నిర్వహించేందుకు వేసిన గ్రామ షారాప్ వేలాలను మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. గత ఏడాది కంటే ఈఏడాది రూ. 22వేలు తగ్గిందని గ్రామపెద్దలు ఇస్మాయిల్, గోవిందు, బాషాలు తెలిపారు. ఈ ఏడాది గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఉస్మాన్ బాషా రూ. 2.10 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్ గౌడు, వెంకటేశ్వర్లు, సుబ్బన్న గౌడు, రామకృష్ణ, మద్దిలేటి గౌడు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మాపురంలో వేలాలను నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

నేడు లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో జన్మభూమి

పాములపాడు,న్యూస్‌టుడే: బుధవారం లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య అన్నారు

నేడు తలముడిపిలో...

మిడుతూరు, తలముడిపి, జలకనూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారిణి జయప్రద తెలిపారు.

నందికొట్కూరు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్యాల గ్రామంలో 5వ విడత జన్మభూమి కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పురపాలకలోని 1, 2, 3, 4, 22 వార్డుల్లో ఆయా వార్డుల కౌన్సిలర్ల అధ్యక్షతన కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన్మభూమి కార్యక్రమంలో ఉచితంగా వైద్యశిబిరాలను నిర్వహించి హాజరయిన వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడి కేంద్రాల్లో స్టాల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బుధవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో, పురపాలకలోని 5, 6 వార్డుల్లో 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నారు.

సంక్షేమ పథకాలకు పెద్దపీట

పాములపాడు,న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు తెదేపా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ కృష్ణవేణి అన్నారు. మంగళవారం బానుముక్కల, బానకచెర్ల గ్రామాల్లో సర్పంచులు బాలూనాయక్, శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, సంకాంత్రి కానుకలు, రైతులకు రుణమాఫీ, చంద్రన్న, పింఛన్ పత్రాలు అందించారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పూజిత బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నోడల్ అధికారి మస్తాన్‌వలి మాట్లాడుతూ జన్మభూమి- మాఊరు కార్యక్రమాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దారు నాగేంద్రరావు, జడ్పీటీసీ దుష్యంత్‌రెడ్డి, తెదేపా నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుదర్శన్‌కుమార్

జన్మభూమి- మా ఊరులో విద్యార్థులకు భాగస్వామం

మిడుతూరు, న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేసిందని స్థానిక జూనియర్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపల్ రమాదేవి అన్నారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులు చేయాల్సిన అంశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రజల జీవన శైలి, స్థితిగతులు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులు,పథకాల సద్వినియోగం, పథకాలలో మార్పు తదితర వివరాలను సేకరించి ప్రభుత్వానికి అందజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా గ్రంథాలయాధికారి ఖాజా వ్యవహరిస్తారని ప్రిన్సిపల్ చెప్పారు.



జన్మభూమి-మావూరు కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ రమాదేవి

ప్రజల సంతృప్తస్థాయే ప్రభుత్వ లక్ష్యం

మిడుతూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరువ చేసేందుకే జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారిణి జయప్రద అన్నారు. మంగళవారం మండలంలోని రోళ్లపాడు, సుంకేసుల గ్రామాల్లో ఈ కార్యక్రమం సర్పంచులు వెంకట్రామిరెడ్డి, భూపాల్‌రెడ్డిల అధ్యక్షతన జరిగింది. ఏపీఎం కల్పలత కార్యక్రమానికి హాజరయిన అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈఓఆర్డీ పుల్లయ్య గ్రామాలు సాధించాల్సిన పలు లక్ష్యాలను విశదీకరించారు. ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ సొంత ఊరిపై మమకారం ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శి ప్రత్యూష, వీఆర్వో పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

తంగడంచ (జూపాడుబంగ్లా), న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని జిల్లా పరిషత్తు ఛైర్మన్ రాజశేఖర్, తెదేపా నియోజవర్గ బాధ్యులు మాండ్రశివానందరెడ్డి అన్నారు. మండలంలోని తంగడంచలో మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం సర్పంచి రామలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు చంద్రన్నబాట కింద 700 కిలోమీటర్ల పొడవును సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా నందికొట్కూరు నియోజకవర్గంలో రైతు పథం కింద 250 ట్రాక్టర్లు పంపిణీ చేశామన్నారు. మహిళ సంఘాలకు రివాల్వింగ్‌ఫండ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంజూరైన రివాల్వింగ్‌ఫండ్‌కు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు పాల్గొన్నారు.



కాలమానినిని ప్రారంభిస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యల పట్ల నిరంతరం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం నాయకులు జాకీర్‌హుసేన్, హనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఆ సంఘం కాలమానినిని ఆవిష్కరించారు. కొత్త పింఛను విధానాన్ని రద్దు చేసే వరకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, నాయకులు శ్రీనాథ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్టీయూ కాలమాన పట్టికను విడుదల చేస్తున్న మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు

పీఆర్టీయూ కాలమాన పట్టిక ఆవిష్కరణ

మిడుతూరు, న్యూస్‌టుడే: మిడుతూరులోని ఎమ్మార్సీ కేంద్రంలో మంగళవారం మండల విద్యాధికారి మౌలాలి పీఆర్టీయూ కాలమాన పట్టికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ అధ్యక్షుడు ఆదిశేషగిరి, ప్రధాన కార్యదర్శి జంగ్లిసాహెబ్, కోశాధికారి మహబూబ్ బాషా తదితరులు విద్యాధికారి, మండల ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణవేణి



అధికారులు,ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీఎం కల్పలత



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మౌలిక వసతులు కల్పిస్తాం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జన్మభూమి మా ఊరు చక్కని వేదిక అని ప్రత్యేక అధికారి సుబ్బారావు అన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎర్రమఠంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సర్పంచి చిన్న పుల్లయ్య గౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సుబ్బారావు మాట్లాడుతూ మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ ఏసీడీపీఓ రమణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అదే పాఠశాలలో చదువుకున్న సర్పంచి పుల్లయ్య గౌడు పాఠశాల అభివృద్ధి కోసం రూ.10 వేలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణుడు, ఎంపీడీఓ కమలాకర్, ఏఓ నాగేంద్రప్రసాదు, ఎంఈఓ శ్రీరాములు, ఏపీఎం ఉమామహేశ్వరమ్మ, ఏపీఓ ఉషారాణిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణుడు

ప్రజా సమస్యల పరిష్కారమే జన్మభూమి లక్ష్యం

ఘణపురం (పగిడ్యాల), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికే జన్మభూమి మా ఊరు కార్యక్రమమని జిల్లా పరిషత్ ఛైర్మన్ రాజశేఖర్ గౌడు అన్నారు. మంగళవారం మండలంలోని ఘణపురంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను మీ గ్రామానికి పంపించారన్నారు. గ్రామ ప్రజలు సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు తరగతి గదులు, కమ్యూనిటి భవనం, సీసీ రోడ్లు కావాలని గ్రామస్థులు కోరారు. స్పందించిన వెంటనే మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ బాధ్యుడు మాండ్ర శివానంద రెడ్డి రైతు రథం ట్రాక్టర్లను పంపిణీ చేశారు. మండలానికి 63 రేషన్ కార్డులు మంజూరయితే ఘణపురం గ్రామానికి 3 మంజూరయ్యాయని వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరారెడ్డి, జడ్పీటీసీ రాధమ్మ, ఎంపీపీ పుల్యాల దివ్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతు రథం ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న మాండ్ర శివానంద రెడ్డి

హోరాహోరీగా సాగిన పొట్టేళ్ల పోటీలు

పాములపాడు,న్యూస్‌టుడే: మండలంలోని వానాల గ్రామంలో పొట్టేళ్ల పోటీలు హోరాహోరిగా సాగాయి. మంగళవారం మండలంలోని వానాల గ్రామంలో ఆర్‌సీఐ సంఘం ఆధ్వర్యంలో పందాలు నిర్వహించారు. మొత్తం 28 పొట్టేళ్లు పాల్గొన్నాయి. పోటీల్లో మొదటి బహుమతిని వానాల గ్రామానికి శివ యజమాని పొట్టేలు, రెండవ స్థానం వెలుగోడుకు చెందిన రాణి పొట్టేలు, మూడో స్థానం గడివేములకు చెందిన శేషు పొట్టేలు నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సంఘం పెద్దలు బాలస్వామి, నిమ్మపుల్లయ్య, ఏసురత్నం, వెండి బహుమతులు అందించారు.



గెల్చిన పొట్టేలికి బహుమతి అందిస్తున్న దాతలు

నంద్యాల

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

యాళ్లూరు (గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని యాళ్లూరులో ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో బుధవారం ఉదయం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ వెంకటరత్నం మంగళవారం తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 10:30 గంటల వరకు లైన్ పనులు చేస్తున్నందున సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

అపరిష్కృత బిల్లులు చెల్లించాలి

బిల్లలాపురం, పెద్దకొట్టాల (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకంలో అపరిష్కృతంగా ఉన్న బిల్లులు 2017కుగాను బిల్లలాపురంలో రూ.1.7లక్షలు, పెద్దకొట్టాలలో రూ.1.8 లక్షలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బండిరత్నమయ్య, బంగారయ్య పేర్కొన్నారు. ఈ మేరకు వారు కూలీలతో కలసి జన్మభూమి అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కార్యాలయం ఏవో శివరామిరెడ్డి

ప్రభుత్వ పథకాలను యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న పథకాల గురించి యువత ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి శివరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. చాలా మందికి అవగాహన లేక కొన్ని పథకాలను ఉపయోగించుకోలేకపోతున్నారన్నారు. ఇందు కోసం చదువుకున్న యువత గ్రామాల్లోని ప్రజలకు పథకాల గురించి వివరిస్తే వారు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి, అధ్యాపకులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మేరి, హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు వెంకటేశ్వర్లు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి జయంతి, ఆరాధనలు

నంద్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే: నంద్యాల తోట వీధిలోని త్యాగరాజస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి రోజులపాటు జయంతి, ఆరాధనోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు రామాయణం త్యాగరాజు మంగళవారం తెలిపారు. 5న ఉదయం 10 గంటలకు త్యాగరాజు స్వామి వారి ఆలయం నుంచి త్యాగరాజస్వామి వారి స్వర్ణ విగ్రహంతో పురవీధుల్లో గ్రామోత్సవం ఉంటుందని, సాయంత్రం 4:30 గంటల నుంచి సంగీత కచేరీలు, 6:30 గంటలకు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ దస్తగిరిరెడ్డి సౌజన్యంతో బెంగళూరు నుంచి గాత్ర కళాకారులు శ్రీరంజని, శ్రుతిరంజని కచేరీలు ఉంటాయన్నారు. 6న ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, అష్టోత్తర పూజలు, పంచరత్నసేవ, స్థానిక విద్యాంసుల సంగీత కచేరీలు, సాయంత్రం 6:30 గంటల నుంచి చెన్నైకు చెందిన గాత్ర కళాకారిణి మాళవిక సుందర్ సంగీత కచేరీ ఉంటుందన్నారు. 7న సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక విద్వాంసుల సంగీత కచేరీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

సాంబవరం (గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని సాంబవరంలో మంగళవారం మధ్యాహ్నం సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఐకేపీ ఏపీఎం ఎల్లయ్య ఆధ్వర్యంలో జన్మభూమిలో భాగంగా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న చంద్రన్న బీమా, రాయితీ పథకాలు, వడ్డీ రాయితీలు, మొక్కల పెంపకంపై చర్చ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పొదుపు మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం ఎల్లయ్య

వెంట'బడి'తేనే పూర్తయ్యేనా..!

➠ అసంపూర్తిగా పాఠశాలల భవనాలు ➠ కొన్నిచోట్ల ఇంకా అద్దె భవనాల్లో కొనసాగింపు

నంద్యాల పట్టణం అంటే జిల్లాలోనే విద్యాభ్యాసానికి అనుకూలమైన ప్రాంతంగా పేరొందింది. ప్రైవేటు పాఠశాలలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడానికి ప్రభుత్వం రూ.కోట్లు నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలలకు సొంత భవనాలు ఇంకా పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు ఇంకా రేకుల షెడ్లు, అద్దె భవనాల్లోనే పాఠాలు చదువుకునే దుస్థితి నంద్యాల పట్టణంలో నెలకొంది. గతేడాదిలో నిర్మించాల్సిన భవనాలు ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ ఏడాదైనా పూర్తయి అందుబాటులోకి వస్తాయానని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం, నంద్యాల క్రీడా విభాగం

నివేదన

నంద్యాల నియోజకవర్గంలో 2016-17 సంవత్సరంలో మొత్తం 5 భవనాలు మంజూరయ్యాయి. వాటిల్లో గోస్పాడులో 2 రెండు భవనాలకు ఒకటి మాత్రమే పూర్తయింది. మరొకటి ఇంకా అసంపూర్తిగానే ఉంది. పట్టణంలో మూడు భవనాలు పూర్తయ్యాయి. వాటిపై మరో భవనాన్ని నిర్మిస్తుండటంతో ఆ మూడు కూడా ప్రారంభానికి నోచుకోలేదు. 2017-18 విద్యా సంవత్సరం 18 భవనాలు మంజూరయ్యాయి. 2017 జులైలో ప్రారంభమై నవంబరు నెలలోనే భవనాలన్నీ పూర్తి కావాల్సి ఉంది, కానీ ఇప్పటికీ ఒక్క భవనం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. దీంతో విద్యార్థులు రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన భవనాల కింద విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతూ బోధనను సాగిస్తున్నారు.

అసంపూర్తి భవనాలతో ఇబ్బందులు

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె పురపాలక ఉన్నత పాఠశాలలో 2016-17లో రెండు భవనాలు, 2017-18లో రెండు భవనాలు మంజూరయ్యాయి. వీటిలో రెండు భవనాలు పూర్తయినప్పటికీ పైన అంతస్తులు నిర్మాణాల్లో ఉన్నందున నాలుగు భవనాలు ప్రారంభం కాలేదు. దీంతో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే విద్యార్థులు ఉన్నారు. ఆ పాఠశాలలో మొత్తం 470 మంది విద్యనభ్యసిస్తున్నారు. నాలుగు భవనాలు పూర్తయితే 200 మంది విద్యార్థులు వాటిల్లో చదువుకునే అవకాశం ఉంటుంది.

◆ నంద్యాల పట్టణంలోని మెయిన్ పురపాలక ఉన్నత పాఠశాలకు రెండు భవనాలు మంజూరయ్యాయి. ఇప్పటికీ అవి పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో శిథిలావస్థకు చేరిన గదుల్లోనే చదువుకుంటున్నారు.


టెక్కె పురపాలక పాఠశాలలో రేకుల షెడ్డు కింద కూర్చుంటున్న విద్యార్థులు (పాతచిత్రం)

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గోస్పాడు	31	3,400
నంద్యాల పట్టణం	38	5,230
నంద్యాల మండలం	44	4,292

◆ టెక్కె పురపాలక ఉన్నత పాఠశాలకు ఓ భవనం మంజూరైంది. కానీ ఇంకా అసంపూర్తిగా ఉండటంతో రేకుల షెడ్డుల్లోనే విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 500 మంది విద్యార్థులున్నారు.

అద్దె భవనాల్లోనే కొనసాగింపు

నంద్యాల పట్టణంలోని సలీంనగర్ ప్రభుత్వ, పురపాలక ఉర్దూ, నడిగడ్డలోని ఉర్దూ పాఠశాలలు సుమారు పదేళ్ల నుంచి అద్దె భవనంలోనే ఉన్నాయి. ఈ పాఠశాలలో ఒకే తరగతి గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు.

◆ నడిగడ్డ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఇంకా అద్దె భవనంలోనే ఉంది. ఇందులో 50 మంది చదువుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన ఒకే అద్దె భవనంలో పాఠాలు బోధిస్తున్నారు. దాంతో విద్యార్థులకు పాఠాలు అర్థం కావడం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రూ.1.49 కోట్లు మంజూరు

నంద్యాల మండలంలోని కొత్తపల్లెకు 2 భవనాలు, చాబోలు 2, పోలూరు 2 భవనాలు, పట్టణంలో మూలసాగరం 1, నీలివీధి 1, పురపాలక మెయిన్ పాఠశాలకు 1, టెక్కె 1, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 1, ఎన్జీవో కాలనీలో 2 చొప్పున భవనాలకు ఎస్ఎస్ఏ కింద మొత్తం


అసంపూర్తిగా ఉన్న భవనం

రూ.1.49 కోట్లు మంజూరయ్యాయి.

15 ఉర్దూ పాఠశాలల భవనాలకు నిధులు

నంద్యాల పట్టణం, మండలంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలలుగా మారిన వాటికి అదనపు తరగతుల కింద మూడు భవనాలు మంజూరయ్యాయి. కానాల ఉర్దూ పాఠశాలకు 3, అయ్యలూరు 3, వైఎస్సార్‌నగర్ 3, యాళ్లూరు 3, వెంకటాచలం 3 చొప్పున మొత్తం 15 భవనాలు నూతనంగా మంజూరయ్యాయి. ప్రస్తుతం స్థలాన్ని సేకరిస్తున్నారు.

త్వరలో పూర్తి చేసాం

- శంకర్‌రెడ్డి, ఏఈ, నంద్యాల

త్వరలో అన్ని భవనాలను పూర్తి చేస్తాం. కొన్ని భవనాలు పూర్తయ్యాయి, కానీ వాటిపై మరో గది నిర్మిస్తుండటంతో ఆ భవనాలు ప్రారంభానికి నోచుకొలేదు. ఉర్దూ పాఠశాలలకు నియోజకవర్గంలో 15 తరగతి గదులు మంజూరయ్యాయి. వాటికి స్థలాను సేకరిస్తున్నాం.

భవనాలన్నీ పూర్తి కావాలి

- బ్రహ్మం, ఇన్‌ఛార్జి ఉప విద్యాశాఖాధికారి, నంద్యాల



నంద్యాల మండలంలో నూతనంగా మంజూరైన గదులన్నీ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. ప్రారంభించిన నాలుగు నెలలకే పూర్తి చేసి గుత్తేదారుడు ఇవ్వాలి. నాణ్యతతో నిర్మించాలని గుత్తేదారులకు సూచించాం. మేం కూడా వెళ్లి భవనాలను పర్యవేక్షిస్తున్నాం.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నంద్యాల, న్యూస్‌టుడే: ఇటీవల ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజయ సాధన క్రీడా శిక్షణ సంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని శిక్షణ సంస్థ నిర్వాహకుడు బీపీ సుబ్బరాయుడు తెలిపారు. కర్నూలు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తోపాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారన్నారు. 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగుపందెంలో మనోజ్‌కుమార్, జి.పవన్‌కుమార్, ప్రసాద్ పతకాలు సాధించారన్నారు. మనోజ్‌కుమార్ రెండు బంగారు పతకాలు, పవన్‌కుమార్ రెండు వెండి, ప్రసాద్ ట్రిపుల్ జంప్‌లో వెండి పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో జరిగే అథ్లెటిక్స్ పోటీలల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో శిక్షకుడు

బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: జాతీయ మెడికల్ కమిషన్ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని నంద్యాల ప్రాంత వైద్యులు డిమాండు చేశారు. మంగళవారం జాతీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా బ్లాక్ డేగా ప్రకటించారు. ఇందులో భాగంగా నంద్యాల ప్రాంతీయ వైద్యులు ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యులంతా ఆసుపత్రుల్లో పగతంతా సేవలను నిలిపి వేసి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రవికృష్ణ, సంయుక్త కార్యదర్శి డా.అనీల్‌కుమార్, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు దేశంలో ఆరోగ్య రంగాన్ని కలుషితం చేసి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతుందన్నారు. వైద్యుల ప్రమేయం లేకుండా ఆరోగ్య రంగాన్ని నియంత్రించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డా.బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డా.మధుసూదన్ రెడ్డి, డా.సహదేవుడు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న నంద్యాల ప్రాంత ప్రైవేట్ వైద్యులు

నంద్యాల

రైతుబజారులో కూరగాయల ధరలు (కిలో రూ.లలో)

(నిన్నటివి)

టమోట 6, పోలూరు వంకాయ 28, బెండకాయ 34, పచ్చిమిర్చి 26, కాకరకాయ 36, బీరకాయ 40, క్యాబేజి 24, క్యారెట్ 42, దొండ 26, ఆలుగడ్డ 20, ఉల్లిగడ్డ 46, సొరకాయలు 20, మట్టికాయలు 24, దోసకాయ 24 ముల్లంగి 34 , బీట్‌రూట్ 34, అల్లం 80.

హలో... ఈనాడు

నంద్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:

● **సమస్య:** టెక్కెలో రహదాలులపై ఇసుక పడి ప్రమాదకరంగా తయారైంది. రోడ్డుపై ఇసుకతో ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి.

- సుబ్బారెడ్డి, టెక్కె

సమాధానం: సిబ్బందిని పంపించి తగిన చర్యలు తీసుకొంటాం.

● **సమస్య:** బొమ్మలసత్రం గెస్ట్ హౌస్ వెనుక వైపు లైన్ల కోసం గుంతలు తవ్వి సరిగా పూడ్చలేదు. స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

- రాజశేఖర్, బొమ్మలసత్రం

సమాధానం: సిబ్బందిని పంపించి పరిశీలించి తగిన చర్యలు చేపడతాం.

● **సమస్య:** సుద్దులపేట నుంచి హనీఫ్‌నగర్ వైపునకు వెళ్లే దారిలో రోడ్డు గుంతలు పడి ప్రజలకు ఇబ్బందిగా ఉంది. కంకర రాళ్లు తేలటంతో ప్రమాదంగా తయారైంది. **- రామాంజనేయులు, సుద్దులపేట**

సమాధానం: సిబ్బందిని పంపించి ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన పనులు చేయిస్తాం.

● **సమస్య:** బాలాజీ కాంప్లెక్స్‌లో ట్యాంకు వద్ద కాలువలో చెత్త పేరుకుని మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. **- ముర్తుజా, బాలాజీ కాంప్లెక్స్**

● **సమస్య:** సలీంనగర్‌లో కాలువల్లో పూడిక పేరుకొని మురుగు పోవటం లేదు. - కరిముల్లా, సలీంనగర్

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం.

● **సమస్య:** రోజాకుంట శాంతినికేతన్ సందులో 2 వీధి దీపాలు వెలగటం లేదు. - మున్నా, రోజాకుంట

● **సమస్య:** ఆర్యెస్ రోడ్డులో ఎల్‌ఐసీ అధికారి ఎదురు సందులో 2 వీధి దీపాలు వెలగటం లేదు.

- సుబ్బరాయుడు, ఆర్యెస్‌రోడ్

● **సమస్య:**నూనెపల్లి ఓవర్ బ్రిడ్జి కింద 2 వీధిదీపాలు వెలగటం లేదు.

- రమణయ్యగౌడు, నూనెపల్లి

సమాధానం: విద్యుత్తు సిబ్బందిని పంపించి వీధి దీపాలు వేయిస్తాం.

(పై సమస్యలకు పురపాలక కమిషనర్ సత్యనారాయణరావ్ సమాధానమిచ్చారు.)

● పట్టణంలోని పలు సామాజిక సమస్యలపై 'హలో ఈనాడు'కు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య **8008573802,** వాట్సప్ **9441030244** నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

ఖాతాదారుల సేవలతోనే బ్యాంకుల ప్రగతి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఖాతాదారులకు అందించే సేవలతోనే బ్యాంకులు ప్రగతిలో ముందుంటాయని నంది గ్రూప్ ఛైర్‌పర్సన్, ఎండీ సుజలా పేర్కొన్నారు. సేవలకు సంబంధించి ఇతర బ్యాంకులు అందుకోలేనంత స్థాయిలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ హ్యాపీ హోమ్ ద్విమాసోత్సవాలు స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజలా, ప్రాంతీయ మేనేజర్ శివశంకర్‌రెడ్డి సంయుక్తంగా ఫ్లెక్సీలు, గోడ ప్రతులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సుజలా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వ్యాపార పోటీలో ఇతర ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు దీటుగా ఏపీజీబీ సేవలందన్నారు. ప్రాంతీయ మేనేజర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ బ్యాంకు రూ.23,500 కోట్ల వ్యాపారాన్ని సాధించిందన్నారు. ఇందులో నంద్యాల రీజియన్ భాగస్వామ్యం రూ.3,200 కోట్లని వెల్లడించారు. ఫిబ్రవరి ఆఖరు వరకు అన్ని శాఖల్లో రుణాలు ఇస్తామన్నారు. అనంతరం పద్మావతినగర్ శాఖ తరపున ప్రథమ గృహ రుణ మంజూరు పత్రం జి.వేంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయం సీనియర్ మేనేజర్లు సంపత్‌కుమార్, రవి మోహన్, ప్రాసెసింగ్ మేనేజర్లు భాస్కర్‌రావు, మురళీ, మేనేజర్లు ఆదినారాయణరెడ్డి, మేనేజర్లు మునాఫ్, ప్రసాద్, జయకుమార్, కృష్ణవేణి, ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు విడుదల చేస్తున్న అధికారులు

తల్లి పరీక్షా కేంద్రంలో.. బిడ్డ ఉయ్యాలలో..

నేటి 'చిత్రం'

డైట్ పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు పసిబిడ్డలతో వచ్చారు. దీంతో వారి వెంట వచ్చిన బంధువులకు బిడ్డలను అప్పజెప్పి పరీక్షలు రాస్తున్నారు. బిడ్డలు ఏడుస్తుంటే ఉయ్యాల కట్టి ఓదార్చుతున్నారు. నంద్యాల పట్టణంలో మంగళవారం స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో డైట్ పరీక్ష కేంద్రం వద్ద ఉయ్యాలలు కట్టి ఉన్న చిత్రం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది.

- న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం



పరీక్షా కేంద్రం వద్ద ఉయ్యాల ఊపుతున్న మహిళ

విద్యార్థులకు క్రీడలతోనే భవిష్యత్తు

నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులకు, యువతకు క్రీడలతోనే మంచి భవిష్యత్తు ఉందని నంద్యాల క్రికెట్ అసోసియేషన్ సంఘం గౌరవాధ్యక్షుడు పోచా బ్రహ్మానందారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీపీ సచిన్ తెందూల్కర్ పాఠశాల స్థాయి ట్రోఫీని ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు నంద్యాల క్రికెట్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడల వల్ల రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం అవుతుందన్నారు. పాఠశాలల్లో క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అందరిలో క్రమశిక్షణ, మంచి అలవాట్లు విద్యార్థులకు అలవడుతాయన్నారు. విద్యార్థులు సచిన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆడాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల క్రికెట్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, సతీష్, అంపైర్లు పుటాలీ, ఇషాక్, పునీత్, సాయి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, సందీప్, పరమేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

ఘనంగా వీఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో శనివారం వీఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి వేడుకలు చేసుకున్నారు. వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకుడు పరమటూరు శేఖర్ మాట్లాడుతూ.. పోరాటల ఫలితంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్టీ పునరుద్ధరణ బిల్లును శాసన సభలో ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు మహేష్, నాయకులు నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, వినోద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేసిన యోధుడు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఉంటూ దేశంలో పార్టీని బలోపేతం చేసిన యోధుడు ఏబీ బర్దన్ అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ కొనియాడారు. మంగళవారం బర్దన్ వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ... బర్దన్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆయన మరణించే వరకు కేవలం రెండు జతల దుస్తులు, రెండు బ్లేజరలతో సాధారణ జీవితం గడిపిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాయకులు ప్రసాద్, సుబ్బరాయుడు, షరీఫ్‌బాషా, చౌడప్ప, చెన్నయ్య, బాలు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.



బర్దన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు

పాలిటెక్నిక్ కళాశాలల క్రీడల్లో ప్రతిభ

నంద్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 2017 డిసెంబరు 28 నుంచి 30 వరకు ఒంగోలులో జరిగిన 22వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల పోటీలలో నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల విదార్థులు ప్రతిభ సాధించినట్లు కళాశాల ప్రధానాచార్యుడు వై.విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రతిభ సాధించిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. . సి.మనోజ్‌కుమార్ 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం జి.పవన్‌కుమార్ 1500, 400 మీటర్ల పరుగుపందెంలో రెండో స్థానం సాధించారన్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ కర్నూలు జిల్లాకు దక్కేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



వ్రతం నిర్వహిస్తున్న అర్చకుడు

షిర్డీ సాయిబాబా దేవాలయంలో పౌర్ణమి వ్రతం

నంద్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే: నంద్యాల నాగులకుంటలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకొని షిర్డీ సాయిబాబా వ్రతాన్ని సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సుబ్బరామయ్య నేతృత్వంలో భక్తులు సామూహికంగా వ్రతాలలో పాల్గొన్నారు.

ఉదయం నుంచి బాబా ఆలయంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది భక్తులు, సేవా సమితి సభ్యులు పాలూరి నాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు 7న

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో 7వ తేదీ ఉదయం 8 కేవీఆర్ కళాశాలలో ఓపెన్ ప్రైజ్‌మనీ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ వి.సత్యనారాయణరావు మంగళవారం తెలిపారు. లీగ్‌కమ్ పద్ధతిలో జరిగే పోటీలు అంతర్జాతీయ చదరంగం నియమావళి ప్రకారం జరుగుతాయన్నారు. క్రీడాకారులు చదరంగం కిట్‌తో నేరుగా పోటీల్లో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 99518 00650ను సంప్రదించాలని కోరారు.

పాణ్యం

24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి

అక్రమార్కులకు అ'ధన'మే!

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల ఏర్పాటు
- నగరపాలక సంస్థపై ఆర్థిక భారం
- సిఫార్సులకు అధికారుల పెద్దపీట



జమ్మి చెట్టు వద్ద నుంచి చెత్తను తరలిస్తున్న టిప్పరు

నగరపాలక పరిధిలో వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి మాట దేవుడెరుగు కాని.. చెత్త నుంచి కాసులు పండిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. అధిక చెత్త ఉత్పత్తి పేరుతో అదనపు వాహనాలను నిబంధలకు విరుద్ధంగా ఏర్పాటు చేయటం కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇలాంటి తప్పిదమే జరిగి బిల్లుల చెల్లింపులో పలు అభ్యంతరాలు ఉత్పన్నమై బిల్లులు ఆగిపోయాయి. పూర్వ అనుభవంతో గుణపాఠం నేర్చుకోని కార్యాలయ వర్గాలు తెగింపు ధోరణితో అదనపు వాహనాలకు అనధికారిక అనుమతులు ఇచ్చేశాయి. ఇప్పటికే నగరపాలక పరిధిలో సరిపడా సిబ్బంది, వాహనాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. ఈ అదనపు వాహనాల ఏర్పాటు ఎవరి కోసం అన్నది అందరినీ వేధిస్తోంది. - న్యూస్‌టుడే-కర్నూలు (నగరపాలకసంస్థ)

కర్నూలు నగరంలో 5 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఏటికేడు జనాభా సంఖ్య పెరుగుతూనే ఉంది. 51 వార్డులు ఉన్నాయి. ప్రతి రోజు నగరంలో 170 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతున్నట్లు అంచనా. దీనిని తరలించేందుకు నగరపాలకసంస్థ తరఫున 40 వాహనాలు, ప్రైవేటు వ్యక్తులకు చెందిన మరో 13 ట్రాక్టర్లు వినియోగంలో ఉన్నాయి. గత మూడు నెలల కిందటే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.కోటి వెచ్చించి అధిక నిల్వ సామర్థ్యం ఉన్న నాలుగు కాంపాక్టర్ వాహనాలను అధికారులు కొనుగోలు చేశారు. ఇంతవరకు అంతా సవ్యంగానే ఉన్నా గత నవంబరులో ఐదు చెత్త వాహనాలను అదనంగా ఏర్పాటు చేశారు. ఇందుకు ప్రజారోగ్య విభాగం నుంచి ఎలాంటి అనుమతులు కాని, రాత పూర్వకమైన ఒప్పందాలు కానీ జరగలేదు.

స్వామిభక్తి చాటేందుకు..



సాయిబాబా సంజీవ్‌నగర్‌లో వాహనంలోకి చెత్తను వేస్తున్న సిబ్బంది

నగరపాలకకు చెందిన కొందరు అధికారులు కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అడ్డగోలుగా రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసేశారు. మరోవైపు ఎలాంటి అవసరం లేకుండానే అద్దెలకు తీసుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయకుండా.. అవసరాలను గుర్తించకుండానే స్వామిభక్తి చాటుకునేందుకు అడ్డదిడ్డంగా నిధులను ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతోంది. వాస్తవానికి వీటి అవసరం లేకపోయినా కొనుగోలు చేసేయడం గమనార్హం. మరోవైపు చెత్త తరలింపులోనూ అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చెత్త తరలించకుండానే తరలిస్తున్నట్లు చూపి నిధులు మింగేస్తున్నారు. అయినప్పటికీ ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఖజానాకు భారం

వాహనాలను కొనుగోలు చేయడం వల్ల ఖజానాకు ప్రతి నెలా రూ.4.50 లక్షల వరకు ఆర్థికంగా భారం అవుతోంది. ఇప్పటికే వీటికి సంబంధించి రెండు నెలల గడువు కావస్తుండటంతో రూ.9 లక్షల వరకు అదనంగా చెల్లింపులు చేయాల్సి వస్తోంది. గతంలోనూ 10 వాహనాలను ఇదే రకంగా ఏర్పాటు చేసుకోగా బిల్లుల చెల్లింపు సమయంలో ఆడిట్ అభ్యంతరాలు తలెత్తి కొద్ది నెలలకే వాటిని తొలగించేశారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు అదే తప్పును చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఆర్థికపరమైన అంశాలపై ఇష్టానుసారం నిర్ణయం తీసుకోవటంతో సంస్థకు ఖజానాకు భారంగా మారింది. దీనిని చూసి మరి కొంతమంది తమ వాహనాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని పైరవీలు, సిఫారసులు చేయిస్తుండటం గమనార్హం. వాస్తవానికి రూ.లక్ష దాటితే టెండర్లు పిలవాలన్న ప్రాథమిక నిబంధనను విస్మరించి తమ రాజకీయ నేతల అనయాయులకు ప్రాధాన్యం ఇచ్చారనే అపవాదు ఉంది. టెండర్లు నిర్వహిస్తే అధిక సంఖ్యలో గుత్తేదారులు పాల్గొని, పోటీ ఏర్పడి సంస్థకు ప్రయోజనం చేకూరేలా సేవలు అమలు అవుతాయనే విషయాన్ని సంబంధిత వర్గాలు పక్కన పెట్టటం ఆరోపణలకు తావిస్తోంది.

అనధికార వాహనాలకు బిల్లులు చెల్లించం

- హరినాథ్‌రెడ్డి, కమిషనర్, నగరపాలక సంస్థ

వాణిజ్య సముదాయాలు, వ్యాపార దుకాణాల నుంచి ప్రత్యేకంగా వ్యర్థాలను సేకరించాలని యోచిస్తున్నాం. ఇందుకు అదనంగా వాహనాలు తీసుకునే ఆలోచన ఉంది. కానీ ప్రస్తుతం అమలు కావటం లేదు. ఒకవేళ అనధికారికంగా ఎవరైనా వాహనాలను చెత్త సేకరణకు వినియోగిస్తుంటే అలాంటి వాటికి బిల్లులు చెల్లించం. దీనిపై కఠినంగా వ్యవహరిస్తాం.

ప్రజలకు తోడుగా.. 'హలో ఈనాడు' వేదికగా..



చరవాణి: 97014 76343

కర్నూలు, న్యూస్‌టుడే: మీ ప్రాంతంలో ఎన్నో సమస్యలు నెలకొని ఉంటాయి. రహదారులు సరిగా లేకపోవడం, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, వీధిదీపాలు వెలగకపోవడం.. ఇలా ఏ సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు 'ఈనాడు' చర్యలు చేపట్టింది. 'హలో ఈనాడు' కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. అవసరార్థులు తమ పరిధిలోని సమస్యలను పైన పేర్కొన్న చరవాణి సంఖ్యకు తెలపాల్సి ఉంటుంది.

తెలపాల్సిన సమయం : ఉదయం 10.30 నుంచి 12.30 వరకు



కేకు కోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి

నూతనోత్సాహంతో న్యాయం చేద్దాం

గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కొత్త ఏడాదిలో నూతన ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సత్వర న్యాయం అందిద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.అనుపమ చక్రవర్తి అన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆమె మంగళవారం కేకు కోసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి టి.రఘురాం, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కె.సుధాకర్, సీనియర్ సివిల్ జడ్జిలు ఎ.మోజెస్, ఎం.ఎ.సోమశేఖర్, గాయత్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జిలు రాజేంద్రబాబు, గంగాభవాని, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌లు ఎం.బాబు, ఆశారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగలక్ష్మీదేవి, బాబూసాహెబ్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలను విజయవంతం చేయాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నగరంలోని మాంటిస్సోరి గురుకుల్ జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ తన స్వగృహంలో క్రీడా సంఘాల ప్రతినిధులు విజయకుమార్, సునీల్‌కుమార్, రాజశేఖర్, రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల విజయవంతానికి క్రీడా సంఘాల ప్రతినిధులు కలిసి రావాలని కోరారు. 26 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. క్రీడలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ తదితరులు



వివరాలు వెల్లడిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

కర్నూలు క్రీడలు : నగరంలోని జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో జాతీయ యువ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రాయలసీమ జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఏర్పాటుచేసినట్లు తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్టేడియంలో పోటీల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఇక్కడ ప్రతిభ చూపినవారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినవారిని జాతీయస్థాయిలో స్పోర్ట్స్ వసతిగృహంలో చేరేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

జన్మభూమి-సంక్రాంతి సంబరాలు ప్రారంభం

కర్నూలు నగరం (కల్చరల్), న్యూస్‌టుడే : ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జన్మభూమి- సంక్రాంతి సంబరాల కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా కర్నూలు పాతబస్తీలోని ఓపెన్ ఎయిర్ థియేటరులో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ శారదసంగీత కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు గోపవరపు రామచంద్రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత కళాశాల విద్యార్థులు ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. కరీముల్లా బృందం కూచిపూడి నృత్యం, సాయిరాం బృందం గిరిజన జానపద గేయాలు ఆలపించారు. ఈ సందర్భంగా రామచంద్రన్ మాట్లాడుతూ 10 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, జిల్లా కేంద్రం కర్నూలుతోపాటు మండల, తాలుకా కేంద్రాల్లో జరుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాశాల అధ్యాపకురాలు జ్యోతిర్మయి, విశ్రాంత ఎస్వీ అంకయ్య, సమన్వయకర్త రమణ, కళాశాల విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

పాణ్యం

సమస్యలను పరిష్కరించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ఎ.గోకులపాడు గ్రామంలో సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని కల్లూరు మండల మాజీ ఎంపీపీ ఎం.బాలవెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో విన్నవించిన సమస్యలకు పరిష్కార మార్గం చూపలేదన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచి ఎం.లక్ష్మీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

పాణ్యం, న్యూస్‌టుడే: కంటి జబ్బులపై అప్రమత్తంగా ఉండి వైద్యుల సూచనలు తప్పక పాటించాలని వైద్యులు ఆనంద్ ప్రకాశ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి దృష్టిలోపం ఉన్న 22మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకు కూరలు తక్కువ తీసుకోవడం, పండ్లు తినకపోవడంతో కంటి చూపు తగ్గుతుందన్నారు.

సంక్షేమమే లక్ష్యం.. ఊరూరా చైతన్యం..

◆ జన్మభూమి మా ఊరు ప్రారంభం
◆ సమస్యలపై వినతులిచ్చిన జనం



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న అంజద్‌అలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరిత

జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు గ్రామసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కల్లూరు మండలం తడకనపల్లిలో ఏరాసు ప్రతాపరెడ్డి, పాణ్యం మండలం కొనిదేడులో ఎమ్మెల్యే గౌరుచరిత హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో జనం హాజరైన తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులు సమర్పించారు. అంతరాలంలో నమోదుచేసి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. పాణ్యం నియోజకవర్గం లోని కల్లూరు, పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల మండలాల్లో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం: గడివేముల
గ్రామాలు: బూజనూరు, బిలకలగూడూరు
హాజరైన ప్రముఖులు: ప్రత్యేకాధికారి అంజద్‌అలీ
ఏం జరిగింది: ప్రజా సాధికార సర్వే ఆధారంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలని సూచించారు. చీర, సారె అందజేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అర్హులకు 64 రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దోబీఘాట్ నిర్మించాలని రజకులు కోరారు. అనంతరం క్రీడల పోటీలు నిర్వహించారు.
పాల్గొన్నవారు: తెదేపా నేత రామచంద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేష్‌నాయక్, తదితరులు.



మహిళలకు శ్రీమంతం చేస్తున్న తహసీల్దారు అనురాధ, అధికారులు

మండలం: పాణ్యం
గ్రామాలు: కొనిదేడు, ఆలమూరు
హాజరైన ప్రముఖులు: ఎమ్మెల్యే గౌరు చరిత, పరిశీలకులు గోపీనాథ్
ఏం జరిగింది: వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. 23పింఛన్లు, 20 రేషన్ కార్డులు అందజేశారు. పాఠశాలకు రూ.2లక్షలతో ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సునీష్‌కుమార్‌రెడ్డికి రైతు రథం పథకం కింద ట్రాక్టరు పంపిణీ చేశారు. 9,10 విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. సంక్రాంతి కానుకలు అందజేశారు. ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు.
పాల్గొన్నవారు: నోడల్ అధికారి ఫిరోజ్‌ఖాన్, ఈవోఆర్డీ రమణ, ఎంఈవో కోటయ్య, ఇంజినీర్లు లక్ష్మన్న, ప్రసాద్, సర్పంచి పద్మావతి, నాయకులు చిన్నసంజీవ, నారాయణమ్మ, తిరుపాలు, రాంపుల్లారెడ్డి.

మండలం: కల్లూరు, **గ్రామాలు:** తడకనపల్లి, నెరవాడ, కల్లూరు 19, 20వ వార్డులు
హాజరైన ప్రముఖులు: ఏరాసు ప్రతాపరెడ్డి

ఏం జరిగింది: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆయన నిరంతరం శ్రమిస్తున్నా రన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు, మండలాల పరిధిలోని గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



తడకనపల్లెలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఏరాసు ప్రతాపరెడ్డి

పాల్గొన్నవారు: ఎంపీపీ వాకిటి మాధవి, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, లక్ష్మిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి అధికారులు సి.వి. రమణయ్య, నరేంద్రనాథ్ రెడ్డి, శివరామిరెడ్డి, ఈఈ రమణమూర్తి

మండలం: ఓర్వకల్లు, **గ్రామాలు:** సోమయాజులపల్లి, కొమరోలు
హాజరైన ప్రముఖులు: జిల్లా విద్యాధికారిణి తహెరా సుల్తానా

ఏం జరిగింది: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈవో కోరారు. పేదల ఇళ్ల స్థలాలకోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు కోరారు. తమ పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.
పాల్గొన్నవారు: డీఈ మురళి, తహసీల్దారు రజనీ కుమారి, ఎంపీడీవో మాధవీలత, సర్పంచులు నాగమల్లేశ్వరి, నాగశేషు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో తహెరాసుల్తానా

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాణ్యం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం నుంచి కింద పడి గాయపడిన మహిళ రామతీర్థం సుంకులమ్మ(55) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు మండలంలోని కంది కాయపల్లె గ్రామానికి చెందిన రామతీర్థం సుంకులమ్మ, అల్లుడు వెంకటయ్య గతనెల 31వతేదీ రాత్రి ద్విచక్రవాహనంపై సిమెంట్‌నగర్‌కు వస్తుండగా కళ్లు తిరిగి సుంకులమ్మ కిందపడిందన్నారు. గాయపడిన సుంకులమ్మను చికిత్స నిమిత్తం కర్నూలు గౌరీగోపాల్ వైద్యశాలకు తరలించారన్నారు. చికిత్స పొందుతూ సుంకులమ్మ మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి భర్త బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెసరవాయి(గడివేముల), న్యూస్‌టుడే: మండలంలోని పెసరవాయి సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన స్వాములు, పుణ్యవతి దంపతులు ద్విచక్ర వాహనంలో గడివేములకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో దంపతులతోపాటు ఆటో డ్రైవర్ సునీల్ గాయపడ్డారు. సోమవారం ఇదే ప్రదేశంలో ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ప్రమాదాలు జరుగకుండా రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పైపుల ధ్వంసంపై కేసు నమోదు

గని(గడివేముల), న్యూస్‌టుడే: మండలంలోని గని గ్రామానికి చెందిన లింగమయ్య పొలంలో ఏర్పాటుచేసిన పైపులను అదే గ్రామానికి చెందిన కత్తి మద్దిలేటి, చిన్న పుల్లయ్య, ఈశ్వరయ్య ధ్వంసం చేశారని ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లింగమయ్యకు నిందితులకు పొలం వద్ద వివాదం ఉందని చెప్పారు. గతంలో ఘర్షణ పడ్డారన్నారు. ప్రస్తుతం బాధితుడికి చెందిన 36 పైపులు, ఇంజిన్ ధ్వంసం చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

జిందాల్ పరిశ్రమ వద్ద దారి దోపిడీ

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని జిందాల్ పరిశ్రమ సమీపంలో దారి దోపిడీ జరిగిందని ఎస్సై రామాంజనేయ రెడ్డి తెలిపారు. పరిశ్రమ ఆవరణలోని శివ ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న మనోహర్ ద్విచక్ర వాహనంలో పరిశ్రమ వద్దకు వెళ్తుండగా, మార్గమధ్యంలో నలుగురు వ్యక్తులు అడ్డగించారని, కత్తిచూపించి 38 వేల నగదు, చరవాణిని దోచుకున్నారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరచాలి

నెరవాడ (పాణ్యం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పుడే విజయం సొంతమవుతుందని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణి, వెస్పా మోటార్స్, హెచ్‌జీఎస్, విజయ ఎలక్ట్రికల్, ఓలా క్యాబ్స్ వంటి బహుళ జాతి కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేశారన్నారు. విద్యార్థులకు ఆయా కంపెనీ ప్రతినిధులు ధ్రువపత్రం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న దాతలు

రాష్ట్రస్థాయి పోటీల్లో వృషభాల విజయం

పూడిచర్ల(ఓర్వకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని పూడిచర్లలో ఆర్‌సీఎం చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి వృషభాల బండలాగు పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 17 జతల వృషభాలు పాల్గొన్నాయి. బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామానికి చెందిన దేగల రాజేశ్వరి వృషభాలు 4742అడుగులు లాగి ప్రథమ బహుమతిగా రూ.30వేలు గెలుచుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం రాయచోటి జిల్లా పలకదొడ్డికి చెందిన ఖాజాహుసేన్ వృషభాలు 4700అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.20వేలు, కడప జిల్లా బాలయ్య గారి పల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు 4550అడుగులు లాగి మూడవ బహుమతి రూ. 10వేలు, నందికొట్కూరు మండలం వడ్డెమానుకు చెందిన తరలిక వృషభాలు 4085 అడుగులు లాగి నాలుగో బహుమతిగా రూ.5వేలు, డోన్ మండలం సీసంగుంతలకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.3వేలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన విజేత వృషభాల యజమానులకు దాతలు శివన్న, పెద్దమల్లకల్లు, చిన్నమల్లకల్లు బహుమతులను అందజేశారు.

క్రీడాభివృద్ధికి కృషి

గడివేముల, న్యూస్‌టుడే: క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పదవీ విరమణ ఉపాధ్యాయుడు రామలింగేశ్వరరెడ్డి తెలిపారు. గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలోని 20మంది విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యా ర్థుల్లో మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఉప ప్రధానోపాధ్యాయురాలు దస్తగిరమ్మ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందినా, పాఠశాలపై మక్కువతో రామలింగేశ్వరరెడ్డి తన వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ గోపాల్, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, జైపాల్, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న దాత రామలింగేశ్వరరెడ్డి

పత్తికొండ

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఈ నెల 10 నుంచి 12 వరకు ఆలూరులో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.దస్తగిరి పిలుపునిచ్చారు. పత్తికొండ ఈశ్వర్‌రెడ్డి కార్యాలయంలో మంగళవారం జిల్లా మహాసభల గోడ పత్రాలను నాయకులు విడుదల చేశారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆలూరులో మహాసభలు జరగడం విశేషమన్నారు.

ఏబీ బర్ధన్‌కి ఘన నివాళి

పత్తికొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సీపీఐ దివంగత అగ్రనేత ఏబీ బర్ధన్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సురేంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు నబీరసూల్ మండల కార్యదర్శి కారన్న, నాయకులు గురుదాసు, కారుమంచి, సుధాకర్, కంఠయ్య, రాజాసాహెబ్, పెద్దవీరన్న, సుల్తాన్, వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తదానికంటే.. పాతదే ముద్దు

- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- శిథిలమైన పాత భవనంలోనే సేవలు
- కు.ని శస్త్రచికిత్సలు లేక తప్పని అవస్థలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం మద్దికెర ప్రాథమిక వైద్యశాలలో నిర్మించిన నూతన భవనం. ఈ భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గుత్తేదారుడు భవనాన్ని పూర్తి చేసి ఆసుపత్రి వారికి అప్పగించినా వైద్యసేవలు అందడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో అన్ని వసతులతో నూతన భవనాలను నిర్మించారు. నియోజకవర్గంలోని మద్దికెర, పగిడిరాయి గ్రామాల్లో ఉన్న ప్రాథమిక వైద్యశాలల్లో ఒక్కో భవనానికి సుమారు రూ.96 లక్షలు వెచ్చించి నూతన భవనాలను ఏర్పాటు చేశారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు అన్ని వసతులతో మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గతేడాది నూతన భవనాలు మంజూరయ్యాయి. కొత్త భవనాలను గుత్తేదారుడు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని మద్దికెర, పగిడిరాయి ఆసుపత్రుల భవనాలు శిథిలమయ్యాయనే కారణంగా కొత్త భవనాలను నిర్మించారు. ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ.96 లక్షలు మంజూరు చేయగా గుత్తేదారుడు భవనాల నిర్మాణం పూర్తి చేసి సంబంధిత ఆసుపత్రి వారికి అప్పగించారు. భవనాలను త్వరగా పూర్తి చేసి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు. మద్దికెరలోని భవనాన్ని ఇప్పటికే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నరసింహులు పరిశీలించి అన్ని సౌకర్యాలు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రారంభంలో జాప్యంపై స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి వెంటనే భవనాలను ప్రారంభించి సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న శిథిలమైన భవనం మద్దికెర ప్రాథమిక వైద్యశాలలోని శస్త్రచికిత్సల గది. ఈ భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఇక్కడ కు.ని శస్త్రచికిత్సలు చేయడం లేదని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. అదే విధంగా పరీక్షల గదిలో కనీసం రోగులు నిలబడేందుకు సైతం వీలులేదని రోగులు వాపోతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం ఇబ్బందిగా మారిందని వైద్య సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఎప్పుడో బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఈ గదులనే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదంటూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పూర్తయిన భవనాల్లో సేవలందించాలి

- సుధాకర్, పెరవలి



ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రి భవనాల్లో సకాలంలో సేవలందించేలా చూడాలి. సౌకర్యాలు సమకూరినా జాప్యం చేయడం తగదు. అసౌకర్యాల ఆసుపత్రుల్లో సేవలందకా రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని సౌకర్యాలున్న ఆసుపత్రి భవనాలను ప్రారంభించి ప్రజలకు సేవలందించాలి.

ఇబ్బందుల్లో మహిళా రోగులు

- విష్ణువర్ధన్, ఎంపీటీసీ సభ్యుడు, మద్దికెర



ప్రాథమిక వైద్యశాలల్లో గతంలో కు.ని శస్త్రచికిత్సలు చేయడం వల్ల ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇటీవల కాలంలో ఆపరేషన్లు నిలిపివేయడంతో ఇతర ప్రాంతాల్లో చేయించుకునేందుకు వెళ్లి మహిళలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. సౌకర్యాల లేక బాలింతలు పడరానిపాట్లు పడుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఈ విషయంపై మండల సమావేశంలోనూ చర్చించాం. జిల్లా అధికారులు స్పందించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- శిరీష, వైద్యాధికారిణి, మద్దికెర

గుత్తేదారుడు నిర్మాణం పూర్తి చేసి మాకు అప్పగించారు. ఏఏ నిర్మాణాలు, ఏ వస్తువులు ఏర్పాటు చేశారో అన్నీ సరిచూసుకొని స్వాధీనం చేసుకున్నాం. ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయమై ఇంకా ఉన్నతాధికారుల నుంచి సమచారం లేదు. భవనం స్వాధీనం చేసిన విషయాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లాం. అధికారులతో మాట్లాడి నూతన భవనంలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాం.



అంతర్జాలం సాయంతో
పింఛన్ పంపిణీ చేస్తున్న కార్యదర్శి కృష్ణకుమార్

పింఛన్ కోసం ఎదురు చూపులు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పంచాయతీ పరిధిలోని 1974 మంది లబ్ధిదారుల్లో మంగళవారం 600 మంది వరకు పింఛన్ల కోసం వచ్చారు. పింఛన్ల పంపిణీకి రెండు ట్యాబ్‌లు ఏర్పాటు చేశారు. పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించేందుకు ఎన్టీఆర్ భరోసా నియోజకవర్గ సమన్వయకర్త క్రాంతికుమార్ వచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని అంతర్జాలంలో పింఛన్లకు సంబంధించి ప్రక్రియను నమోదు చేశారు. కార్యాలయంలోని అంతర్జాలంలో వేలిముద్ర వేసిన వారికి పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్ పింఛన్లను పంపిణీ చేశారు.

24 గంటల వైద్య సలహాలకు
104కు ఫోన్ చేయండి

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అసంఘటిత కార్మికులంతా ఐకమత్యంగా ఉంటే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు మాధవస్వామి, మురళీ నాయుడు ఆధ్వర్యంలో మహాసభను నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డోన్ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, గిరిజన సమాఖ్య నాయకులు మోటా రాముడు, సీపీఐ నాయకులు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

ఖోఖోలో విద్యార్థినుల ప్రతిభ



జ్ఞాపికలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేవనబండ (పత్తికొండ గ్రామీణ), న్యూస్‌టుడే: మంత్రాలయంలో జరిగిన డివిజన్ స్థాయి జోనల్ ఖోఖో పోటీల్లో పత్తికొండ మండలంలోని దేవనబండ ఉన్నత పాఠశాల బాలికల జట్టు విజేతగా నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. విజయం సాధించి వచ్చిన విద్యార్థినులను పాఠశాలలో మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు, ఇతర ఉపాధ్యాయ బృందం అభినందించారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు హనుమన్నను ఉపాధ్యాయులు, గ్రామస్థులు మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గట్టు తిమ్మప్ప, మల్లికార్జున, విజయలక్ష్మి, అనసూయమ్మ, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులపై విజ్ఞాన యాత్ర

పత్తికొండ గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతు విజ్ఞాన యాత్ర చేపట్టినట్లు బీటీఎం జి.మాధవయ్య అన్నారు. రైతుల అవగాహన కార్యక్రమంలో భాగంగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం, మహానంది ఉద్యానవన పరిశోధన కేంద్రం, వ్యవసాయ కళాశాలను సందర్శించనున్నట్లు తెలిపారు. పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రయోగశాలల్లో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ యాత్రకు పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పత్తికొండ, హోసూరు, చిన్నహుల్తి, ఆర్.మండగిరి, బురుజుల, ఎద్దులదొడ్డి తదితర గ్రామాల రైతులు బయలుదేరి వెళ్లారు.

5న కలెక్టరేట్ ముట్టడి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానానికి నిరసనగా ఈ నెల 5న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు జిల్లా గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి మోటా రాముడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో గిరిజన సమాఖ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ నియమించకుండా ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తెదేపా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు శోభన్‌బాబు, ఎల్లరాముడు, సుంకన్న, చిన్ననాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ

నేడు 3 గ్రామాలలో..

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, నార్లాపురం, చెరుకులపాడు గ్రామాలలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో అబ్దుల్ వహిద్ మంగళవారం తెలిపారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఐదో విడతైనా.. పరిష్కారమయ్యేనా సమస్యలు

☛ ప్రారంభమైన జన్మభూమి-మా ఊరు



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శైలజ సుబ్బరాయుడు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీపీ శైలజ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని మల్లెపల్లి, అల్లుగుండు గ్రామాలలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా తెదేపా నాయకుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ మల్లెపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయానికి రూ.8 లక్షలతో రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. హంద్రీనీవా సుజలస్రవంతి పథకం కాల్వ నుంచి రైతులకు ప్రయోజనం కలిగేలా తూములను నిర్మిస్తామన్నారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, పింఛన్లు, చంద్రన్న సంక్రాంతి కానుకలను ఎంపీపీ శైలజ సుబ్బరాయుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ, ప్రత్యేకాధికారి జుబేదా బేగం, తహసీల్దారు రామాంజులు నాయక్, ఎంపీడీవో అబ్దుల్ వహిద్, మండల విద్యాధికారి ఇందిర, తెదేపా ప్రధాన కార్యదర్శి లక్ష్మీరెడ్డి, పంచాయతీరాజ్, విద్యుత్తు, వ్యవసాయాధికారులు అచ్యుతానందరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రవిప్రకాష్, ఏపీఎం కాశేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ఐదో విడత కింద చేపట్టింది. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారు. సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయలేదు.

పెరవలిలో...

పెరవలి (మద్దికెర), న్యూస్‌టుడే: కనీసం గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు కూడా అందడం లేదంటూ స్థానికులు అధికారులు, పంచాయతీ సర్పంచితో వాగ్వాదానికి దిగారు. మంగళవారం మండలంలోని పెరవలి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచి సుధాకర్ అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగింది. గ్రామంలో దేవర జరుగుతున్నా గుక్కెడు నీరు వదలని దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోయారు. నోడల్ అధికారి నారాయణనాయక్ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సీపీఐ నాయకులు నెట్టికంఠయ్య, బొంబాయి సుధాకర్ తదితరులు అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తమ చౌదరి, తహసీల్దారు వేణుగోపాల్, ఎంపీడీవో సుధాకర్‌రాజు, వ్యవసాయ అధికారి కిరణ్, పంచాయతీ కార్యదర్శి బొఖారియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఎర్రగుడిలో...

ఎస్.ఎర్రగుడి (కృష్ణగిరి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లడమే జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఉద్దేశమని మండల ప్రత్యేకాధికారి రఘునాథరెడ్డి, మండల జన్మభూమి కమిటీ ఛైర్మన్ కేఈ జయన్న పేర్కొన్నారు. ఎస్.ఎర్రగుడిలో గ్రామ సర్పంచి సురేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం మంగళవారం జరిగింది. గ్రామానికి 55 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ, తహసీల్దారు రామసుబ్బయ్య, ఎంపీడీవో మురళీ మోహపమూర్తి, వెలుగు ఏపీఎం వెంకటస్వామి, ఉపాధి పథకం ఏపీవో రమణ, రైతు సమాఖ్య మండల అధ్యక్షుడు మర్రి శ్రీరాములు, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నబీ సాహెబ్, ఎంపీటీసీ సభ్యురాలు షాలిబీ, దస్తగిరి, సుంకన్న, సుదర్శన్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

తుగ్గలి, న్యూస్‌టుడే: గ్రామానికి తారోడ్డు వేయాలని పెండేకల్లు గ్రామస్థులు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమం తహసీల్దారు గోపాల్‌రావు నేతృత్వంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులకు స్థానిక సీపీఐ, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. మండల నోడల్ అధికారి చెన్నయ్య రహదారి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేష్, ఆయా గ్రామాల సర్పంచులు వీరేష్, వీరభద్రప్ప, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

నేడు అమకతాడులో..

అమకతాడు (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మురళీ మోహనమూర్తి మంగళవారం తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.



అధికారులుతో వాగ్వాదానికి దిగిన స్థానికులు



కొత్త రేషన్‌కార్డులను అందజేస్తున్న కేఈ జయన్న



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వంతెనకు.. నిర్లక్ష్యం శాపం

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర-మొలగల్లి గ్రామాల మధ్య రూ.4.5 కోట్లు వెచ్చించి నాలుగేళ్ల కిందట వంతెనను నిర్మించారు. వర్షపు నీరు పోయేవిధంగా రెండు చోట్ల పైపు కల్వర్టులు ఏర్పాటు చేశారు. చిన్నవిగా ఉండటంతో వర్షానికి కొట్టుకుపోయాయి. వేలాది ఎకరాల పొలాలకు వెళ్లే రైతులతో పాటు మద్దికెర ప్రాంతం నుంచి మొలగవల్లి, ఆలూరు ప్రాంతాలకు వెళ్లే వాహన దారులకు నిత్యం కష్టాలు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఇరుప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



అధ్వానంగా ఉన్న మద్దికెర-మొలగవల్లి రహదారి వంతెన

విద్యార్థులు రాసిన కథలనే అచ్చువేయిస్తాం

మద్దికెర, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాసే కథలనే అచ్చువేయించి ప్రోత్సహిస్తామని గురుజాడ ఫౌండేషన్ కార్యదర్శి, భాషోపాధ్యాయుడు పుల్లా రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెరవలి ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన కథల ద్వారా జాగృతి, సృజన పేరుతో 2 పుస్తకాలను ముద్రించినట్లు తెలిపారు. బాల్య వివాహాలు, స్వచ్ఛభారత్, మరుగుదొడ్లు, నిరక్షరాస్యత, మొక్కల పెంపకం, వ్యసనాలు తదితర సామాజిక అంశాలపై రాసిన కథలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. కేవలం విద్యార్థులు స్వయంగా ఆలోచించి రాసిన వాటినే ఎంపిక చేస్తామన్నారు. రాసిన కథలను చిప్పగిరి ఉన్నత పాఠశాల పేరుతో పంపాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దేవర

అగ్రహారం (మద్దికెర), న్యూస్‌టుడే: గ్రామ దేవత సుంకులమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకొన్నారు. మండలంలోని అగ్రహారం, పెరవలి గ్రామాల్లో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మేళాతాలాలతో అమ్మవారికి చీర, సారెలను ఊరేగింపుగా తీసుకువెళ్లి విశేష పూజలు నిర్వహించారు.



అగ్రహారంలో గ్రామదేవత సుంకులమ్మ



పెరవలిలోని అమ్మవారి ఆలయం

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు భక్తులు నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకంతో పూజించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

తుగ్గలిలో..

తుగ్గలి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జొన్నగిరి, రాంపురం గ్రామాలలో మంగళవారం దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జొన్నగిరిలో నెల్లూరమ్మ, రాంపురంలో పెద్దమ్మ దేవతలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవర సందర్భంగా బంధువులతో ఆయా గ్రామాలు సందడి వాతావరణం నెలకొంది. దేవతలకు బోనాలు సమర్పించుకొనేందుకు గ్రామ ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. దేవర సందర్భంగా గొడవలు చేసుకోవద్దని జొన్నగిరి ఎస్సై నజీర్ అహమ్మద్ సూచించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

కృష్ణగిరి మండలంలో..

ఎస్.ఎర్రగుడి, పుట్లూరు (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎస్.ఎర్రగుడి రేణుకా ఎల్లమ్మ, పుట్లూరు మారెమ్మ ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకి బోణాలు సమర్పించారు. మల్లాపురం సుంకులమ్మ, కంబాలపాడు ఎల్లమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

తెరపై ఈనాడు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడు: లక్ష్మీలో: **హలో.**

వెల్దుర్తి: గౌరి: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)**

కూరగాయల ధరలు

నిన్నటివి (కిలో. రూ): టమోట 10, ఉల్లిగడ్డలు 40, పచ్చిమిర్చి 20, వంకాయలు 30, బీర 20, చౌళేకాయలు 30, క్యాబేజీ, 30 క్యారెట్ 40, ఆలు 20, బెండ 30, బీన్స్ 50.

మాంసం ధరలు

(కిలో. రూ): పొటేళ్ల మాంసం: 440, చికెన్: 150.